PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 239 | విజయవాడ, బుధవారం 2 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 2 April 2025 | Rs

సిపిఎం మహాసభకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన ప్రకాశ్ కరత్, బివి రాఘవులు, బృందాకరత్ తదితరులు
- కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర ప్రదర్శన, బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

8

పంజాబ్ భళ్లే.. భళ్లే..

- లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఘన విజయం

8

'మనీ-మను' వాదాలపై పోరాటం

• అమరుల స్ఫూర్తితో ఆశయాలు సాధిస్తాం : బృందాకరత్

సీతారాంఏచూరి నగర్ (మదురై) నుండి వి.రాజగోపాల్‌శర్మ

పేద ప్రజలను లూటీ చేసి వేల కోట్లు పోగేసుకునే కార్పొరేట్ విధానాలపైనా, దేశ ప్రజలను కుల, మత ప్రాతిపదికన చీల్చే మనువాదంపైనా సంఘటిత పోరాటాలు చేయాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుండి ప్రజానీకం నిర్వహించిన అమరవీరుల జ్యోతులు సిపిఎం 24వ మహాసభ జరుగుతున్న మదురైలోని సీతారాం ఏచూరి నగర్‌కు (మదురై కన్వెన్షన్ సెంటర్) చేరుకున్నాయి. అమర వీరులకు జేజేలు పలుకుతూ, వారి ఆశయాలను సాధించి తీరుతామంటూ దారిపొడవునా ప్రజానీకం చేసిన ప్రతినల మధ్య అత్యంత స్ఫూర్తిదాయకంగా ఈ జ్యోతులు మహాసభ ప్రాంగణానికి చేరుకున్నాయి. తమిళనాడులోని ఐదు ప్రాంతాల నుండి ప్రారంభమైన ఈ జాతాలకు ప్రజల నుండి మంచి ఆదరణ లభించింది. మంగళవారం సాయంత్రం మహాసభ ప్రాంగణంలోకూడా అదే స్ఫూర్తి కనిపించింది. వివిధ రాష్ట్రాలనుండి వచ్చిన ప్రతినిధులతోపాటు, స్థానిక ప్రజలు ఈ జ్యోతులకు స్వాగతం పలికారు. 'అమరులకు జేజేలు... ఆశయాలను సాధిస్తాం, వివక్షను అంతం చేస్తాం, మతోన్మాదాన్ని ఎదుర్కుంటాం' అన్న నినాదాలు మారుమోగాయి. జ్యోతులను వివిధరంగాలకు చెందిన పోరాట యోధులకు హోరెత్తిన నినాదాల మధ్య అందచేశారు. అనంతరం బృందాకరత్ మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న పాలకులు ప్రజలను అర్థం చేసుకోవడంలో విఫలమైనారని అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పిన మాటలను గుర్తుచేశారు. కార్మికులను, ప్రజలను దోచుకుని వారి రక్తమాంసాలతో వ్యాపారం చేసి లాభాలు పోగేసుకునే పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం ద్వారా ఒక అడుగు ముందుకేయాలని చెప్పేవారని అన్నారు. ప్రజలను కులం పేరుతో, మతం పేరుతో చీల్చే మనువాదంపై చేసే పోరాటంతో మరో అడుగు ముందుకు వేస్తామని సీతారాం ఏచూరి పదేపదే

మిగతా 7లో

మే నుంచి ఎటిఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు

- క్యూఆర్ కోడ్‌తో జారీ
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మే నెల నుంచి ఎటిఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 30తో ఇకెవైసి ప్రక్రియ పూర్తయిన వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ఫ్యామిలీ రేషన్‌కార్డు సైజును తగ్గించి అన్ని వివరాలు పొందుపరుస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ సమయంలో కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామన్నారు. క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని మంత్రి వెల్లడించారు. ఇకెవైసి పూర్తయిన తర్వాత ఎంతమందికి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలో స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. కోటి మంది లబ్ధిదారులు దాటే విధంగా రెండో విడత దీపం-2 పథకాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభించామని, అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత మూడు నెలల కాలంలో 2 లక్షల గ్యాస్ కనెక్షన్లు అదనంగా నమోదైనట్లు పేర్కొన్నారు. ఇకెవైసి అర్హత విషయంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా వెంటనే నివృత్తి పరుచుకునే వెసులుబాటు కల్పించామన్నారు. మొత్తం 4,24,59,028 మంది లబ్ధిదారులకు గానూ, ఇప్పటి వరకు 93 శాతమంటే 3,85,74,194 మంది లబ్ధిదారులు ఇకెవైసి పూర్తి చేశామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకం కింద నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి 44,394 ప్రభుత్వ పాఠశాలలకు, 3,938 వసతి గృహాలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో నెలనెలా కొరియర్ ద్వారా పంపిణీ చేసేందుకు ఐదు గోదాములనుఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంపద సృష్టించి పేదలకు పంపిణీ

- ఈ నెలలోనే మెగా డిఎస్‌సి
- పేదలను ఆదుకునేందుకే పి-4
- త్వరలో మండలాల స్థాయిలో అన్న క్యాంటీన్లు : చంద్రబాబు

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

ఈ నెలలోనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని. పాఠశాలలను తెరిచే నాటికి జూన్‌లోగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. మంగళవారం ఆయన బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలోని ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి పింఛను పంపిణీ చేశారు. వడ్లమూడి సుభాషిణికి మానసిక వికలాంగురాల పింఛను, బత్తుల జాలమ్మకు వితంతు పింఛను అందజేశారు. వారి కుటుంబాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. 'పేదల సేవలో పింఛను పంపిణీ'లో భాగం ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రసంగించారు. సంపద సృష్టించగా వచ్చిన ఆదాయాన్ని పేదలకు ఖర్చు చేస్తామని, పేదరికం నిర్మూలనకే పి-4 విధానానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రజలే ముందు అని, ఆ తర్వాతే మిగిలిన వాటికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. బటన్లు నొక్కామని కొందరు గొప్పగా చెప్పుకుంటున్నారని, వారు నొక్కిన బటన్లు మనమిచ్చే పింఛన్లతో సమానమని అన్నారు. పార్టీని ఆదుకున్న వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకితీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు పవన్ కల్యాణ్, తాను, బిజెపి జతకట్టామని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను ముందుండి నడిపించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నానని తెలిపారు. రాజధాని అమరావతి పనులకు శ్రీకారం చుట్టామని, అమరావతికి నాలుగేళ్లలో వైభవం తెస్తామని అన్నారు. రాష్ట్ర

మానసిక వికలాంగురాలైన వడ్లమూడి సుభాషిణికి పింఛను అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జీవనాడి పోలవరం పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానానికి శ్రీకారం చుడతామన్నారు. త్వరలో మండలాల స్థాయిలో అన్న క్యాంటీన్లు పెడతామని తెలిపారు. గత ఐదేళ్లు రోడ్లు ఎలా ఉన్నాయో చూశామని, ప్రస్తుతం రోడ్ల మరమ్మతులు చేపట్టామని అన్నారు. ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ మేలో 'తల్లికి వందనం' ఇస్తామని తెలిపారు.

పేదరికం లేని సమాజమే నా ఆశయం

పేదరికం లేని సమాజమే తన ఆశయమని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే పి-4 కార్యక్రమం రూపొందించామన్నారు. సమాజంలో ఉన్నతంగా ఉన్న పది శాతం సంపన్న వర్గాలు సమాజంలో

మిగతా 7లో

బాలిక గొంతు కోసి చంపిన వ్యక్తికి ఉరిశిక్ష

చోడవరం కోర్టు తీర్పు

ప్రజాశక్తి- చోడవరం (అనకాపల్లి జిల్లా)

ఆరేళ్ల బాలిక గొంతు కోసి కిరాతకంగా హత్య చేసిన అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన సునాచారి గుణశేఖర్‌కు చోడవరం తొమ్మిదో అడిషనల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి కె.రత్నకుమార్ ఉరిశిక్ష విధించారు. ఈ మేరకు మంగళవారం తీర్పు చెప్పారు. ఆ కేసు వివరాల్లోకి వెళితే... ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన భార్యాభర్తలు వేపాడ ధనలక్ష్మి, మురుగన్ దేవరాపల్లి గ్రామంలో టీ దుకాణం నడుపుతుండేవారు. ధనలక్ష్మి తమ్ముడైన ఖమ్మం జిల్లాకు చెందిన గుణశేఖర్‌ను వారి వద్దనే ఉంచి దుకాణంలో పనిచేయించేవారు. అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో ధనలక్ష్మి దూరం పాటించారు. దీంతో, కక్ష పెంచుకున్న గుణశేఖర్ దేవరాపల్లి ఉషోదయ స్కూల్లో యుకెజి చదువుతున్న తన అక్క

కూతురైె దివ్యను 2015 డిసెంబర్ 23న తినుబండారాలు కొనిచ్చి రైవాడ రిజర్వాయర్ సమీపంలో ఉన్న బిల్లలమెట్ట వద్దకు తీసుకెళ్లాడు. బీరు బాటిల్‌తో ఆ చిన్నారి గొంతు కోసి హత్య చేశాడు. అప్పట్లో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను కోర్టు ముందు ఉంచడంతో శిక్ష ఖరారైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకటరావు ఈ కేసును వాదించి నిందితునికి శిక్ష పడేలా చేశారు. చోడవరం కోర్టు చరిత్రలో నిందితునికి ఉరిశిక్ష ఖరారు చేయడం ఇదే మొదటిసారని, తాజా తీర్పు న్యాయ వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగిస్తుందని న్యాయవాదులు ఉగ్గిన వెంకటరావు, కె.డేవిడ్ హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డెక్కిన మున్సిపల్ కార్మికులు

- ఆప్కాస్ రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు

2

నేడు లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు

- ఎనిమిది గంటల చర్చకు బిఎసి నిర్ణయం
- 12 గంటల సుదీర్ఘ చర్చకు ప్రతిపక్షాల డిమాండ్
- బిజెపి, కాంగ్రెస్, టిడిపి సభ్యులకు విప్ జారీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఎన్ని విమర్శలు, అభ్యంతరాలు వస్తున్నా ఈ బిల్లును ఎలాగైనా ఆమోదించుకోవాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. అయితే ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తోన్నాయి. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షత జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) సమావేశం బిల్లుపై చర్చకు ఎనిమిది గంటలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం ఈ బిల్లుపై 12 గంటల పాటు సుదీర్ఘమైన, విస్తృతమైన చర్చకు పట్టుపట్టాయి. ఎన్‌డిఎ పార్టీలు కేవలం నాలుగు నుండి ఆరు గంటల చర్చ సరిపోతుందని పేర్కొన్నాయి. దీంతో ప్రభుత్వం తమ గొంతు నొక్కుతోందని విమర్శిస్తూ కాంగ్రెస్‌తో సహా ఇతర ఇండియా బ్లాక్ పార్టీల సభ్యులు బిఎసి సమావేశం నుండి వాకౌట్ చేశారు. కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ తమ గొంతులను విస్మరిస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలు చర్చకు ఎక్కువ సమయం కావాలని కోరుతున్నాయని అన్నారు. మణిపూర్ పరిస్థితి, ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డుపై వివాదం వంటి మరిన్ని అంశాలను సభలో ప్రస్తావించాలని కోరుతున్నామని తెలిపారు.

ప్రభుత్వం తన ఎజెండాను తుంగలో తొక్కుతుండటం వల్లే ప్రతిపక్షాలు బిఎసి సమావేశం నుంచి వాకౌట్ చేశాయని తెలిపారు. ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని చర్చ సమయంలో తన అభిప్రాయాన్ని వెల్లడిస్తానని అన్నారు. ఈ బిల్లు ముస్లింల మత స్వేచ్ఛను అరికట్టే లక్ష్యంతో ఉందని, టిడిపి, జెడియు వంటి బిజెపి మిత్రపక్షాలకు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కాగా, ఈ బిల్లును బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగిసిన తరువాత బిల్లును ప్రతిపాదిస్తామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కొన్ని పార్టీలు చర్చ నుండి పారిపోవడానికి సాకులు చూపుతున్నాయని విమర్శించారు.

ఇండియా బ్లాక్ పార్టీలు భేటీ

బుధవారం లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు రాబోతున్న నేపథ్యంలో ఇండియా బ్లాక్ పార్టీలు సమావేశం అయ్యాయి. మంగళవారం సాయంత్రం పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్, డిఎంకె, ఎన్‌సిపి, సిపిఎం, సిపిఐ, ఎస్‌పి, ఆర్‌జెడి, ఎండిఎంకె, విసికె, ఐయుఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఆర్‌ఎస్‌పి, సిపిఐఎంఎల్ తదితర ఇండియా బ్లాక్ పార్టీల నేతల సమావేశం అయ్యారు. వక్ఫ్

మిగతా 7లో

రేపట్నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మరలా 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారులందరూ ఈ సదావకాశాన్ని వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారుల్లో 1,95,735 మందికి జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఉండగా, వీరందరూ ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేయించుకోలేదు. ఆధార్ నమోదు చేయించుకోని చిన్నారుల్లో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 12,218 మంది, అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 4,001 మంది చిన్నారులున్నారు. ఆధార్ క్యాంపులను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలని శివప్రసాద్ పిలుపునిచ్చారు.

332 మండలాల్లో తీవ్ర నీటి కొరత

- 3,549 నివాస ప్రాంతాలపై ప్రభావం
- అంచనా వేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేసవి తీవ్రతతో రాష్ట్రంలో దాదాపు సగం మండలాలు తీవ్ర నీటి కొరత ప్రమాదాన్ని ఎదుర్కోనున్నాయి. దీనిపై ఇప్పటి వరకూ యాక్షన్ ప్లాను పూర్తికాలేదు. వెంటనే రోజువారీ పరిస్థితుల నివేదిక (డైలీ సిచ్యుయేషన్ రిపోర్ట్-డిఎస్‌ఆర్) రూపొందించి పంపించాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అలాగే వేసవి యాక్షన్ ప్లాను నివేదిక వచ్చిన వెంటనే ఏయే పనులు చేపట్టాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని, అత్యవసరం, అవసరం అనే రెండు పద్ధతుల్లో స్పష్టమైన నివేదిక ఉండాలని సూచించింది. రాష్ట్రంలో 679 మండలాలు ఉండగా, 332 మండలాలు నీటి కొరతను ఏదుర్కొంటాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మండలాల పరిధిలో 3,549 నివాస ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటారనీ తేల్చింది. ఈ సమస్యను పరిష్కరించడంతోపాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే దానికి సంబంధించి నిధులు

వినియోగంపై స్పష్టత రావాల్సి ఉందని కలెక్టర్లు చెబుతున్నారు. ప్రస్తుతం నీటి కొరత ఇబ్బందులున్న మండలాల పరిధిలో తక్షణమే 1,611 బోర్లను రిపేర్లు చేయాల్సి ఉంది. భూగర్భ జలాలు తగ్గిన నేపథ్యంలో మరో 1,097 బోర్లను మరింత లోతుకు వేయాల్సి ఉంది. దీనిపై నివేదికను కలెక్టర్లు ప్రభుత్వానికి పంపించినా నిధుల వినియోగంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వనట్లు తెలిసింది. వీటితోపాటు 56 సమ్మర్ స్టోరేజీ (ఎస్‌ఎస్) ట్యాంకులను నింపాల్సి ఉంది. ఈ నీటిని ఎలా నింపాలనే అంశంపై అధికారుల్లో కొంత ఆందోళన ఉంది. ఏప్రిల్ రెండోవారంలో తాగునీటి చెరువులను నింపేందుకు నీటిని వదలాల్సి ఉంది. అప్పటికి ఎంత మొత్తం నీటిని వదులుతారు, ఎన్ని చెరువులు నింపుతారు అనే అంశంపై జలవనరులశాఖ నుండి నివేదిక తయారు చేసినా నీరు ఎంతవరకు అందుబాటులో ఉంటుందనే అంశంపై స్పష్టత రావడం లేదని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికి కొంత చెరువులు నింపామనీ, 60 రోజులకు సరిపడే విధంగా నీటిని నింపాలని ఆదేశాలు ఉన్నా 70 శాతం మాత్రమే పూర్తి చేశామని చెబుతున్నారు. మరోవైపు గ్రామీణ తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.930 కోట్ల వరకూ విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే స్కీములకు విద్యుత్‌శాఖ అధికారులు నోటీసులు పంపిస్తున్నట్లు తెలిసింది.

పశుగ్రాసం విత్తనాల పంపిణీ

వేసవిలో పశువుల మేత కూడా అత్యంత అవసరం కానుంది. రాష్ట్రంలో 1.48 కోట్ల పశువులు, జీవాలు ఉన్నాయి. వీటిల్లో ఆవులకు రోజుకు 30 లీటర్లు, గేదెలకు 40 లీటర్లు, మేకలు, గొర్రెలకు 5 లీటర్ల నీరు అవసరం ఉంటుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి జూన్ 30 వరకు 71.51 లక్షల టన్నుల ఎండుగడ్డి అవసరం ఉండగా, ప్రస్తుతం 82.61 లక్షల టన్నులు అందుబాటులో ఉంది. పచ్చగడ్డి 169 లక్షల టన్నులు కావాల్సి ఉండగా 155 లక్షల టన్నులు అందుబాటులో ఉందని తేల్చారు. అయితే ఏప్రిల్ నెలఖారు నుండి పచ్చగడ్డి నిల్వలు దాదాపు 80 శాతం వరకూ తగ్గిపోతాయి. ఈ కొరతను నివారించేందుకు వీలుగా అల్లూరు, అనకాపల్లి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, సత్యసాయి, విజయనగరం, కడప జిల్లాల కలెక్టర్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పెరిగిన 900 రకాల మందుల ధరలు

- అత్యవసర ఔషధాలే ఎక్కువ

న్యూఢిల్లీ : దేశంలో 900 రకాల ఔషధ ధరలు తాజాగా పెరిగాయి. వీటిలో యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, గుండె జబ్బులు, మధుమేహానికి సంబంధించిన అత్యవసర మందులున్నాయి. పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) వెల్లడించింది. 2023తో పోల్చితే 2024లో నమోదైన టోకు ద్రవ్యోల్బణం సూచీ ఆధారంగా ఔషధ ధరలను గరిష్టంగా 1.74 శాతం పెంచినట్లు ఎన్‌పిపిఎ వెల్లడించింది. యాంటిబయాటిక్ అజిత్రోమైసిన్ 250 ఎంజి ఒక్కో టాబ్లెట్ ధర రూ.11.87, 500ఎంజి ధర రూ.23.97కు పెరిగింది. అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ కలిగిన యాంటీబయాటిక్ డ్రై సిరప్ ధర ఒక్కో ఎంఎల్ గరిష్ఠ ధరను రూ.2.09గా నిర్ణయించారు. పెయిన్ కిల్లర్ డైక్లోఫెనార్ టాబ్లెట్ గరిష్ఠ ధర రూ.2.09కు, ఇబుప్రోఫెన్ 200ఎంజి ఒక టాబ్లెట్ ధర రూ.0.72 కాగా.. 400ఎంజి టాబ్లెట్ ధర రూ.1.22కు పెరిగింది. డయాబెటిస్‌కు వాడే డపాగ్లిఫ్లోజిన్ ప్లస్ మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్ ప్లస్ గ్లిమెపిరైడ్ ఒక టాబ్లెట్ ధర రూ.12.74కు చేరింది.

అమానుషం....చట్టవిరుద్ధం

ప్రయాగ్‌రాజ్ కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

పిటిషనర్లకు పది లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ : 2021లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కొన్ని నివాస గృహాలను కూల్చివేసిన ఉదంతంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ చర్య 'అమానుషం...చట్టవిరుద్ధం' అని వ్యాఖ్యానించింది. పిటిషనర్లకు ఒక్కొక్కరికీ పది లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థను ఆదేశించింది. ప్రయాగ్‌రాజ్‌లో ఇళ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను గతంలో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ కొందరు బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై జస్టిస్ ఏఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ మంగళవారం విచారణ జరిపింది.

తమ సమాధానాన్ని తెలియజేసేందుకు పిటిషనర్లకు తగిన సమయం ఇవ్వలేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. 'ఈ కేసులు మా మన స్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. అప్పిలెంట్లు నివసిస్తున్న గృహాలను దౌర్జన్యపూరితంగా కూల్చివేసిన తీరుపై చర్చించాము. ప్రయాగ్‌రాజ్ అభివృద్ధి సంస్థలో సున్నితత్వం లోపించిందన్న విషయాన్ని కూల్చివేతలు సూచిస్తున్నాయి' అని సుప్రీం బెంచ్ అక్షింతలు వేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో నివాస హక్కు అంతర్భాగంగా ఉన్నదన్న విషయాన్ని అధికారులు...ముఖ్యంగా అభివృద్ధి సంస్థ గుర్తుంచుకోవాలని సూచించింది. అలహాబాద్ హైకోర్టు రూలింగ్‌ను వ్యతిరేకిస్తూ ఓ ప్రొఫెసర్, ఓ న్యాయవాది, మరో ముగ్గురు సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశారు.

భారత్, చైనా దౌత్య బంధానికి 75 ఏళ్లు!

- పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలన్న ద్రౌపది ముర్ము
- కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న జిన్‌పింగ్

7

నేడు 30 మండలాల్లో వడగాడ్పులు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 30 మండలాల్లో బుధవారం వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 6, విజయనగరం 5, పార్వతీపురం మన్యం 11, అల్లూరి సీతారామరాజు 5, కాకినాడ 1, తూర్పు గోదావరి జిల్లాలో 2 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం 47 మండలాల్లో వడగాడ్పులు వీచేందుకు అవకాశం ఉందన్నారు. అదేవిధంగా బుధవారం శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గురువారం రాయలసీమ జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు, శుక్రవారం ఉత్తరాంధ్రలో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు, కర్నూలు, అనంతరపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. అకాల వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పని చేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్లు, స్తంభాలు, టవర్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదన్నారు. అలాగే మంగళవారం కర్నూలు జిల్లాలోని ఉలిందకొండ, విజయనగరం జిల్లాలోని నెలివాడలో 39.8 డిగ్రీల చొప్పున, వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లెలో 39.5, నంద్యాల జిల్లా రుద్రవరంలో 39.5, అనకాపల్లి జిల్లా రావికమతంలో 39.2, అనంతపురం జిల్లా నాగసముద్రంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు.

రోడ్డెక్కిన మున్సిపల్ కార్మికులు

- ఆప్కాస్ రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు
- మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నాలో కె.ఉమామహేశ్వరరావు

ఆప్కాస్‌ను రద్దుచేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు రోడెక్కారు. మున్సిపల్, పురపాలక సంస్థ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు.

ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం కన్నా టిడిపి కూటమి ప్రభుత్వం మెరుగైన చర్యలు చేపడుతుందని కార్మికులంతా భావిస్తే, గతం కంటే దారుణ పరిస్థితుల్లోకి కార్మికులను నెట్టివేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉపశమనంగా ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం అంటే వెట్టి చాకిరీలోకి, బానిసత్వంలోకి నెట్టేయడమేనని విమర్శించారు. ఆప్కాస్ రద్దు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని కోరారు. పట్టణాల పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు, ప్రజల ఆరోగ్యం కోసం 365 రోజులు పనిచేస్తూ శాశ్వత స్వభావం కలిగిన మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ...కార్మిక వ్యతిరేక చర్యలను ప్రభుత్వం వీడనాడాలని కోరారు. చింతలపూడి నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం అక్కడే ధర్నా చేశారు. ఆమదాలవలస పట్టణంలోని పాలపోలమ్మ గుడి దగ్గర నుంచి ఒన్‌వే కూడలి వద్ద గల గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిడిపి ఎమ్మెల్యే కూన రవికుమార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన వ్యక్తిగత సహాయకులకు వినతిపత్రాన్ని అందించారు. విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఉమ్మడి కడప, గుంటూరు, ఒంగోలు, అనంతపురంలో మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణే చంద్రబాబు లక్ష్యం

- వైసిపి మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్నం స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణే సిఎం చంద్రబాబు లక్ష్యమని వైసిపి మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్లాంటును గాడిలో పెడతానని చెబుతున్న చంద్రబాబు 40 వేల మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగిస్తుంటే కనీసం నోరెత్తలేదని విమర్శించారు. ఐదువేల మంది సీనియర్ ఇంజినీరింగ్ అధికారులను బలవంతంగా బదిలీ చేశారని పేర్కొన్నారు. రాజ్యసభలో ఉక్కు మంత్రిత్వశాఖ మంత్రి మాట్లాడుతూ ప్లాంటులో పెట్టుబడులను ఉపసంహరించనున్నట్లు తెలిపారని, కేంద్రంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు దీని గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఒకవైపు పెట్టుబడులు ఉపసంహరిస్తానని చెబుతుంటే గాడిలో పెడతానని చంద్రబాబు ఎలా చెబుతారని ప్రశ్నించారు. పెన్షన్ల పంపిణీ పేరుతో మెగా ఈవెంట్ చేస్తున్నారని విమర్శించారు. జీవిత చరమాంకంలో ఉన్నవారి పెన్షన్లను చంద్రబాబు తొలగించారని అన్నారు. మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేసినా ఇంతవరకు నిర్వహించలేదని, ఈ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. అప్పులపైనా టిడిపి నాయకులు తప్పుడు ప్రచారం చేశారని, నోటికొచ్చిన లెక్కలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. అలాగే ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని, ప్రభుత్వానికి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడితే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు.

డాక్టర్లు నైతిక విలువలు పాటించాలి

- కొన్ని ప్రాంతాల్లో వ్యాపారంగా వైద్యం
- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యం కొన్ని ప్రాంతాల్లో వ్యాపారంగా మారిందని, వైద్య వృత్తి విలువలు పలచబడ్డాయని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. రోగులను వైద్యులు మానవతా దృష్టితో చూడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌కు ఎన్నికైన ఆరుగురు డాక్టర్లు జి సుజాత, కె వెంకట సుబ్బరాయుడు, డి శ్రీహరి, స్వర్ణగీత, ఎస్ కేశవరావు బాబు, సి మల్లేశ్వరిని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొందరు వైద్యులు అవసరం లేకుండానే ఎక్స్‌రేలు, సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్‌లు తీస్తున్నారన్నారు. నార్మల్ డెలివరీ చేయడం మానేశారని, అవసరం లేకపోయినా సిజేరియన్ ఆపరేషన్ చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు నార్మల్ డెలివరీలు చేస్తే బాగుంటుందని, ప్రజలు కూడా రకరకాల టెస్ట్‌లు రాస్తేనే డాక్టర్లు సరిగ్గా చూశారనే అపోహలో ఉన్నారని, అటువంటి వారికి అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు సర్టిఫికెట్లను ప్రతి ఐదేళ్లకోసారి ఎపిఎంసిలో రెన్యువల్ చేసుకోవాలన్నారు. నూతన కౌన్సిల్ డాక్టర్ల రెన్యువల్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని, ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ రిజిస్ట్రేషన్‌పై సమస్యలున్నాయని మంత్రి తెలిపారు. ఇంకా నలుగురు ఎక్స్ అఫీషియో మెంబర్లు, 13 ఎలెక్టెడ్ మెంబర్లను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. మొత్తం 23 మంది సభ్యులు ఎపిఎంసిలో ఉంటారని, మెడికల్ కౌన్సిల్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను కూడా ఎన్నుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డిఎస్‌విఎల్ నరసింహం, ఎపిఎంసి రిజిస్ట్రార్ రమేష్‌రెడ్డి, ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి పాల్గొన్నారు.

బుంగ ధనరాజు (ఫైల్)

వంక కృష్ణ (ఫైల్)

తెప్ప బోల్తా

- ఇద్దరు మత్స్యకారులు గల్లంతు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

తెప్ప బోల్తా పడిన ఘటనలో శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన ఇద్దరు మత్స్యకారులు మంగళవారం గల్లంతయ్యారు. అదే తెప్పలో ఉన్న మత్స్యకార సొసైటీ అధ్యక్షులు బుంగ కోటేశ్వరరావు, చింతల వెంకటేశ్వరరావు అతి కష్టం మీద ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచినీళ్లపేటకు చెందిన వంక కృష్ణ, బుంగ ధనరాజు, బుంగ కోటేశ్వరరావు, చింతల వెంకటేశ్వరరావు కలిసి మంగళవారం వేకువజామున నువ్వలరేవు జెట్టీ సమీపంలో తెప్పను సముద్రంలోకి తీసుకువెళ్లే క్రమంలో ఎత్తైన రాకాసి అలలు ఒక్కసారిగా తెప్పపై పడడంతో నలుగురూ చెల్లాచెదురయ్యారు. కెరటాలకు ఎదురొడ్డి నిలిచిన బుంగ కోటేశ్వరరావు, చింత వెంకటేశ్వరరావు ప్రాణాలతో బయటపడ్డారు. గల్లంతైన కృష్ణ, ధనరాజు ఆచూకీ లభ్యం కాలేదు. మెరైన్, స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ రబీలో దాదాపు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కేంద్రం అంచనాల ప్రకారం రాష్ట్రంలో ఈ రబీలో దాదాపు 13.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండుతుందని, అందులో 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 2,900 రైతు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఆయా కేంద్రాల్లో దాదాపు 12 వేలమంది సిబ్బంది పనిచేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఖరీఫ్‌లో 35,93,443 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇప్పటికే 70 వేల మంది రైతులు వాట్సాప్ ద్వారా వివరాలు పంపారని, ఇందులో 16 వేల మంది వారికిష్టమొచ్చిన రైస్ మిల్లుల్లో ధాన్యం విక్రయించుకున్నారన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాలశాఖ కమిషనరు సౌరబ్‌గౌర్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు మహాధర్నా

- 'ఉక్కు'ను కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం : సిహెచ్.నర్సింగరావు
- జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షా శిబిరానికి నాలుగేళ్లు పూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

మహాధర్నాలో నినదిస్తున్న నాయకులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన తలపెట్టిన దీక్షా శిబిరానికి మంగళవారం నాటికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అక్కడే మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఎంతటి త్యాగాలకైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతూనే దానిని పూర్తిగా ప్రయివేటుపరం చేసేందుకు శరవేగంగా అడుగులు వేస్తున్నాయన్నారు. సొంతగనులు కేటాయించాలని అడుగుతుంటే ప్రభుత్వం రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ ఇచ్చామని సంబరాలు జరుపుకుంటోందని తెలిపారు. ఈ ప్యాకేజీని ప్లాంట్ ఉత్పత్తికిగానీ, ముడిసరుకుకుగానీ, కార్మికుల జీతభత్యాలకుగానీ ఉపయోగించలేదన్నారు. పాత అప్పులు, బ్యాంకు అప్పులు తీర్చడానికి వినియోగించారని తెలిపారు. జిఎస్‌టి పేరుతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసేసుకుందన్నారు. మరోపక్క ప్లాంట్‌లోని 5,600 మంది కాంట్రాక్టు కార్మికులను విడతలవారీగా తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌లో ఏ ఒక్కరిని తొలగించినా సహించబోమని హెచ్చరించారు. ఇప్పటికే వందలాది మంది పర్మినెంట్ కార్మికులు రిటైర్‌మెంట్ అవుతున్నారని, సుమారు 1200 మంది విఆర్‌ఎస్ పేరుతో ఉద్యోగ విరమణ తీసుకున్నారని, ఇప్పుడు కాంట్రాక్ట్ కార్మికులను కూడా తొలగిస్తే ప్లాంటులో ఉత్పత్తి ఏ విధంగా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెబుతూనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు అడగకుండా అనకాపల్లి జిల్లాలో నిర్మిస్తున్న మిట్టల్ కంపెనీకి సొంత గనులు కేటాయించాలని అడగడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సొంతగనులు కేటాయించాలని, లేనిపక్షంలో సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిఎస్‌జె.అచ్యుత రావు, బి.నాగభూషణంల అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నాలో తొలుత కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఎం.మన్మధరావు, నీరుకొండ రామచంద్రరావు, ఎన్.కనకారావు, సురేష్, దేవా, ఆర్.అనిల్ కుమార్, బి.పద్మ, పి.మణి, కె.సంతోష్ కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు ఎస్.జ్యోతీశ్వర రావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, ఎన్.రామారావు పాల్గొన్నారు.

టైగర్ ట్రయంఫ్ నావికా విన్యాసాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విన్యాసాల ప్రారంభంలో భారత్, యుఎస్ అధికారులు

ఇండియా - యుఎస్ దేశాల మధ్య ద్వైపాక్షిక ట్రై-సర్వీస్ హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ (హెచ్ఎడిఆర్) విన్యాసాలు (టైగర్ ట్రయంఫ్ నాలుగో ఎడిషన్) మంగళవారం ఉదయం విశాఖ నావెల్ డాక్‌యార్డ్‌లోని ఐఎన్‌ఎస్ జలాశ్వపై లాంఛనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఈ నెల 7వ తేదీ వరకూ హార్బర్ ఫేజ్ విన్యాసాలను విశాఖపట్నంలోనూ, ఎనిమిది నుంచి 13 వరకూ సి ఫేజ్ విన్యాసాలను బంగాళాఖాతంలోనూ నిర్వహించనున్నారు. ప్రారంభ వేడుకల్లో భాగంగా ఐఎన్‌ఎస్ జలాశ్వలో సంయుక్త ఫ్లాగ్ పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన భారత్‌లోని అమెరికా తాత్కాలిక రాయబారి జోర్గాన్ ఆండ్రూస్ మాట్లాడుతూ.. ఇండో పసిఫిక్ రీజియన్‌లోని ప్రజల భద్రతను కాపాడేందుకు ఈ విన్యాసాలు దోహదపడతాయన్నారు. భారత్‌తో కలిసి భాగస్వామ్యం కావడం తమకు సంతోషంగా ఉందన్నారు. రానున్న కాలంలో ఇరుదేశాల మధ్య మరింత సోదర భావం పెరుగుతుందని తెలిపారు. తూర్పు నావికాదళ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా మాట్లాడుతూ.. ఈ విన్యాసాలు ఇరుదేశాల మధ్య సైనిక సహకార విషయంలో మాత్రమే జరగడం లేదని, ప్రజాస్వామ్య, లౌకిక, బహుళ భాగస్వామ్య విలువల వేడుకగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంక్షోభ సమయాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో అమెరికా కాన్సుల్ జనరల్ జెనీఫర్ లారెన్, రియర్ అడ్మిరల్ న్యాక్రిక్, యుఎస్ఎస్ నేవీ కమాండింగ్ ఆఫీసర్ బైరాన్ స్టాక్స్, ఇండియన్ నేవీ ఫ్లీట్ కమాండర్, ఈస్టర్న్ ఫ్లీట్ రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్, ఐఎన్‌ఎస్ జలాశ్వ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ నౌషాద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విన్యాసాలలో భారత నావికాదళానికి చెందిన జలాశ్వ, ఘరియాల్, ముంబయి, శక్తి నౌకలు, లాంగ్ రేంజ్ మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్ క్రాఫ్ట్ పి8ఐ, 91 ఇన్ఫ్‌బ్రిగేడ్, 12 మెచ్ ఇన్ఫాంట్రీ బెటాలియన్‌కు చెందిన ఆర్మీ దళాలు, ఎయిర్‌ఫోర్స్ సి - 130 ఎయిర్‌క్రాఫ్ట్, ఎంఐ-17 హెలికాప్టర్లతో పాటు ర్యాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్ (ఆర్ఎఎంటి) భారత తరుపున ప్రాతినిధ్యం వహించనున్నాయి. అమెరికా తరఫున యుఎస్ నేవీ షిప్స్ కామ్ స్టాక్, రాల్ఫ్ జాన్సన్‌లతో పాటు యుఎస్ మెరైన్ డివి దళాలు పాల్గొననున్నాయి.

బాల సంజీవని యాప్‌లో మార్పులు

- అంగన్వాడీ యూనియన్ల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాల సంజీవని 2.0 వెర్షన్‌లో మార్పులు చేయాలని, అంగన్వాడీ కేంద్రాలకు అందించాల్సిన పోషకాహారాన్ని సకాలంలో అందించాలని, పిల్లలకు మే నెలలో టేక్ హోమ్ రేషన్‌తో వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్లు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి విఆర్ జ్యోతి సంయుక్తంగా మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సెంటర్ల నిర్వహణకు బాల సంజీవని 2.0 వెర్షన్ యాప్‌ను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫొటోలు, ప్రీ స్కూల్ పిల్లల ఫోటోలను ఇన్ టైమ్‌లో అప్‌లోడ్ చేయడం, వారికి సంబంధించి మెనూను ఇన్‌టైమ్‌లో ఆన్‌లైన్ చేయాలని నిబంధనలు పెట్టడాన్ని అంగన్వాడీ యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఒక్క పూటే కేంద్రాలు నిర్వహిస్తుండటంతో 8 గంటలకే రావాలంటే పిల్లలు ఇబ్బందిపడే పరిస్థితి ఉందన్నారు. రైస్, దాల్, ఆయిల్, బాలామృతం, పాలు, గుడ్లు, సంపూర్ణ పోషణ కిట్లు సకాలంలో అంగన్వాడీ కేంద్రాలకు అందజేయాలని కోరారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ చిన్నారులకు మే నెలంతా టేక్ హోమ్ రేషన్‌తో వేసవి సెలవులు ఇవ్వాలని ఈ సందర్భంగా యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు.

వైసిపి ప్రజాప్రతినిధులకు జగన్ అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైసిపి ప్రజా ప్రతినిధులు ధైర్యంగా నిలబడ్డారని పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. దీనిపై బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, బాపట్ల, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కేసులు పెట్టి వేధించినా అన్ని ఇబ్బందులను గట్టిగా ఎదుర్కొని పార్టీ కోసం నిలబడి పోరాడిన వారి అంకితభావాన్ని గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం జరిగే సమావేశంలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన అప్రజాస్వామిక పరిణామాలపై చర్చించడంతోపాటు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సత్యసాయి జిల్లాల్లో హత్యకు గురైన లింగమయ్య కుటుంబ సభ్యులను జగన్ ఫోన్లో పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వచ్చేవారం అక్కడకు వస్తానని వారికి చెప్పారు.

మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవరావు

కేంద్రం మోసపూరిత విధానాలతో రైతులకు నష్టం

- వ్యాపారులకు అనుకూలంగా మార్కెట్ చట్టాలు
- ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతుల తిరుగుబాటుతో మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, వాటి స్థానంలో అంతకంటే ప్రమాదకర చట్టాలను తీసుకొచ్చేందుకు యత్నిస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మందసలో వీరగున్నమ్మ వర్ధంతి సందర్భంగా 'వ్యవసాయ రంగం - ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో పంటల ధరల స్థిరీకరణ నిధిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. మార్కెట్ కమిటీ చట్టాలను ఎగుమతి, దిగుమతి వ్యాపారులకు, ఇక్కడి వ్యాపారులకు అనుకూలంగా మార్చేసిందని తెలిపారు. కేంద్రం విధానాలతో రాష్ట్రంలోని అన్ని పంటల మద్దతు ధరలు పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. స్వామినాథన్ సూచించిన మద్దతు ధర సాధించాల్సి ఉందన్నారు. ఇప్పటికే కేరళ రాష్ట్రం వరితో పాటు 16 రకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తోందని, సాధ్యం కాదని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొన్నారు. కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్లను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం, రైతుల రుణాలను ఒకసారైనా ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. కేరళ మాదిరిగా రుణ విమోచన కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరోసారి ఉద్యమానికి ఎస్‌కెఎం సన్నద్ధమవుతోందన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి పోరాటం తప్ప మరో మార్గం లేదని తెలిపారు. మందస జమిందారీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సులో మార్పు ట్రస్టు అధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, రైతుసంఘం నాయకులు మట్ట ధర్మారావు, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పనివేళలు మార్చాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేసవి ఉష్ణోగ్రతలు ఏప్రిల్ నుంచి జూన్ వరకూ తీవ్రంగా ఉంటాయని వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించినందున మున్సిపల్ కార్మికుల పనివేళలను మార్చాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు వినతిపత్రాన్ని పురపాలకశాఖ మంత్రి పి నారాయణకు, సిడిఎంఎ పి సంపత్‌కుమార్‌కు మెయిల్, వాట్సాప్‌లో మంగళవారం పంపారు. మున్సిపల్ కార్మికులు పూర్తిగా మండుటెండలో పనిచేయాల్సి వస్తున్నందున, త్వరగా అలసట చెందడం, వడగాడ్పులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల పనివేళలను మార్చి వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. ఉదయం 5:30 నుంచి 11:30 గంటల మధ్య మాత్రమే కార్మికులతో పని చేయించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మంచినీరు, మజ్జిగ, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని కోరారు. వడగాడ్పులకు గురైన కార్మికులకు ప్రభుత్వమే వైద్య సేవలు అందించాలని, వైద్య సేవలు అవసరమైన అన్ని రోజులు జీతంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించాలన్నారు. కార్మికులకు వడదెబ్బ తగలకుండా టోపీలు, ఖద్దరు కండవాలు ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎపి రైల్వే కాంట్రాక్టు వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం డివిజన్‌లోని కెకె లైన్ (ఎస్‌కోట-బొర్రా గుహలు, అరకు-కోరాపుట్)లో గత ఎనిమిదేళ్లుగా రైల్వే ట్రాక్ మెయిన్‌టెనెన్స్, పెట్రోలింగ్ డ్యూటీలు చేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమని ఎపి రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి ఉమామహేశ్వరరావు, వివిఎల్ నరసింహులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతి కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం 28.03.25న విధుల్లోంచి తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కాకాణిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు

- అక్రమ మైనింగ్ కేసులో బెయిల్ పిటిషన్ వాయిదా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మరో కేసు నమోదైంది. పొదలకూరు మండలం వరదాయపాలెం ఎస్‌సి కాలనీ వాసులను బెదిరించిట్లు పోలీసులు సోమవారం రాత్రి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఆయనపై అక్రమ మైనింగ్ కేసుపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కాకానికి రెండుసార్లు నోటీసులు ఇచ్చినా విచారణకు హాజరు కాలేదని, విచారణకు సహకరించలేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో ఉన్న కారణంగా విచారణకు హాజరుకాలేకపోయారని కాకాని తరుపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించిన న్యాయస్థానం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. అక్రమ మైనింగ్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేసినా ఆయనను అరెస్టు చేసేందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో టిడిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగానే గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. కేసులకు భయపడబోమని, ఎదుర్కొంటామని తెలిపారు.

5.6 శాతం పెరిగిన జిఎస్‌టి వసూలు

- గతేడాదికన్నా మద్యం, పెట్రోల్‌పై తగ్గుదల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో వివిధ రంగాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వాణిజ్య పన్నుల శాఖ విడుదల చేసింది. ఇందులో గతేడాదికన్నా జిఎస్‌టి వసూళ్లు 5.60 శాతం పెరిగింది. వృత్తి పన్ను కూడా 15.05 శాతం పెరగ్గా, పెట్రోలియం ఉత్పత్తులు, మద్యంపై వ్యాట్ మాత్రం తగ్గినట్లు తేలింది. పెట్రో ఉత్పత్తులపై 2023-24లో రూ.17,107 కోట్లు. వ్యాట్ ద్వారా సమకూరగా, 2024-25 సంవత్సరంలో రూ.16,176 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే 5.05 శాతం తగ్గినట్లు కనిపిస్తోంది. మద్యంపై వ్యాట్ కూడా గతేడాది రూ.963 కోట్లు రాగా తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.924 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. అయితే మొత్తం మూడు రంగాల్లో కలిపి పన్నుల ఆదాయం మాత్రం పెరిగింది. 2023-24లో రూ.50,423 కోట్లు రాగా, ఈ ఏడాది రూ.51,297 కోట్లు వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చివరి రెండు త్రైమాసికాల వివరాలను కూడా వాణిజ్య పన్నులశాఖ ప్రకటించింది. అక్టోబర్‌లో రూ.4,126 కోట్లు మొత్తం పన్నుల రూపంలో రాగా, చివరి నెల అయిన మార్చిలో రూ.4,667 కోట్లు వచ్చింది.

వివిధ రంగాల ద్వారా వచ్చిన వ్యాట్ ఆదాయం (రూ.కోట్లలో)

విభాగం	2023-24	2024-25	శాతం
జిఎస్‌టి	32,030	33,824	5.60
పెట్రోలియం	17,107	16,176	5.44 (-)
లిక్కర్	963	924	4.24 (-)
వృత్తి పన్ను	324	372	15.05
మొత్తం	**50,423**	**51,297**	**1.73**

నిజాయితీగా పనిచేశామనే సంతృప్తినిచ్చింది

'ప్రజాశక్తి'తో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

పిడిఎఫ్ ఎమ్మెల్సీగా నిజాయితీగా పనిచేశాననే సంతృప్తి ఉంది. 40 ఏళ్ల ఉద్యమ జీవితం ఎమ్మెల్సీ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించేందుకు దోహదం చేసింది. ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించిన నాటి నుంచి యుటిఎఫ్‌లో వివిధ స్థాయిల్లో పని చేయడం ఎన్నటికీ మరిచిపోలేనిది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక ప్రజా సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలమంతా ఐక్యంగా పోరాడాం. ప్రజల పక్షాన పోరాడేది పిడిఎఫ్ అనే అభిప్రాయం ప్రజల్లో వచ్చింది' అని మాజీ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు. (ఐవి) అన్నారు. మార్చి 29తో ఆయన పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ఐవితో ప్రజాశక్తి' మాట్లాడింది. ఈ సందర్భంగా పలు విషయాలను తెలియజేశారు. ఆయన మాటల్లోనే....

ఉద్యమానికి కట్టుబడే...

ఆది నుంచి ఉద్యమానికి కట్టుబడే ఉన్నాను. యుటిఎఫ్ నిర్మాణంలో, పోరాటాల్లో, విజయాలు సాధించడంలో పాలుపంచుకోవడం చాలా సంతృప్తినిచ్చింది. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల, ఉద్యోగుల, పెన్షనర్ల జీవితాల్లో కొంత మార్పు తీసుకు రావడానికి ఈ పోరాటాలు దోహదపడ్డాయి.

పదవిపై కాంక్ష లేదు..

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం 2019లో ఖాళీ అవడంతో ఆ స్థానానికి పోటీ చేయాలని ఉద్యమ నాయకులు నన్ను కోరారు. వ్యక్తిగతంగా నాకు పదవి పట్ల ఆకాంక్ష లేకపోయినా ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసంఘాల విజ్ఞప్తి మేరకు ఉద్యమ ఆకాంక్ష రీత్యా అనివార్యంగా అంగీకరించి పోటీలో నిలిచాను. శాసనమండలిలో ప్రశ్నలను సూటిగా అడిగేవాడిని. కేటాయించిన సమయంలోనే పూర్తి చేసే వాడిని. ఏ విషయంపై అయినా నిర్మోహమాటంగా, స్పష్టంగా మాట్లాడేవాడిని.

సమస్యలు... పోరాటాలు ... విజయాలు

పిడిఎఫ్‌గా ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యపై మండలిలో గళం వినిపించాం. సమస్య పరిష్కారానికి కొన్ని రకాల సాంకేతిక కారణాలు ఎదురుకావచ్చు కానీ ఆ సమస్య పరిష్కారానికి ప్రయత్నాల్లో ఏ రోజూ రాజీ పడలేదు. సమస్యలతో బాధపడుతున్న వారికి అది సంతృప్తినిచ్చింది. అనేక సమస్యల పరిష్కరించడానికి పని చేశాం. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పాలకుల పక్షం కాదని, ప్రజల పక్షం అని నిరూపించాం. సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే స్పందించేవారం. రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వంలో విలీనం చేయడానికి శాసనమండలిలో గళం వినిపించాను. పిడిఎఫ్ ఎమ్మెల్సీలమంతా కలిసి ఈ విద్యా సంస్థలను సందర్శించి ప్రభుత్వ అధికారులకు, అప్పటి విద్యా శాఖ మంత్రికి సమస్యలను విన్నవించాం. ఆ కృషి ఫలితంగా నేడు ఇవి ప్రభుత్వ హయాంలో నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 117 జిఒ ద్వారా బలవంతంగా విలీనం చేసిన ప్రభుత్వ పాఠశాలలను కొనసాగించాలని పిడిఎఫ్ ఆధ్వర్యాన బస్సు యాత్ర చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పాఠశాలల విలీనాన్ని అడ్డుకున్నాం. నేటి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తోంది. తన ఎమ్మెల్సీ పదవీ కాలం పూర్తయినప్పటికీ రానున్న కాలంలో నిర్వహించే పోరాటాల్లో పాలుపంచుకుంటాను. కోవిడ్ కారణంగా చనిపోయిన ఉపాధ్యాయులకు వన్ టైంగా ఇతర ప్రభుత్వ శాఖలలో కారుణ్య నియామకాలు కల్పించాలని నాటి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా, జిఐడి అనుమతించలేదు. దీంతో, పిడిఎఫ్ ఎమ్మెల్సీలమంతా కలిసి ఈ ఫైలును మరోసారి సిఎం కార్యాలయానికి వెళ్లేలా చూశాం. జిల్లాలో ఖాళీల మేరకు ఎప్పటికప్పుడు కారుణ్య నియామకాలు ఇప్పించేలా చూశాం. ఆర్‌టిసి ఉద్యోగులకు అలవెన్సుల పునరుద్ధరణకు, కారుణ్య నియామకాలకు కృషి చేశాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డిఎస్‌సిలో అన్యాయం జరిగిన ఆరుగురికి నియామకాలు వచ్చేలా చేశాం. 2019లో జెఎన్‌టియు కాకినాడలో ఫలితాలు తగ్గాయని తొలగించిన సుమారు 60 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను వైస్‌ఛాన్సలర్, ఇతర అధికారులతో చర్చించి వారిని తిరిగి విధుల్లో కొనసాగించేలా కృషి చేశాం. రాష్ట్రంలో ఎల్‌ఐసి ఏజెంట్లకు నాలుగు సంవత్సరాల వృత్తి పన్ను రికవరీని ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి విడుదల చేయించాం. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ విస్తరణకు పక్కనే ఉన్న ఐటిఐ తరలింపును అడ్డుకున్నాం. స్థలాన్ని ఏకపక్షంగా కలెక్టర్ స్వాధీనం చేసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాం. సమగ్ర శిక్ష సిబ్బందికి ఆ యూనియన్ నాయకులతో కలిసి 23 శాతం జీతాలు పెంపుదల అగ్రిమెంట్ చేయించి అమలు చేయించాం. ఎప్పటికప్పుడు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రెన్యువల్స్ అయ్యేలా చూశాం. నెల్లూరు జిల్లా రాచర్లపాడు, వింజమూరు ఆత్మకూరు విద్యుత్ సబ్ స్టేషన్లలో తొలగించిన 26 మందిలో 15 మందికి ఉద్యోగాలు ఇప్పించాం. విద్యుత్ శాఖ అధికారులతో పలుమార్లు చర్చించి విజయం సాధించాం. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వట్లూరులో అనంత లక్ష్మి టెక్స్ స్టైల్స్ పరిశ్రమ మూతబడి 350 మంది కార్మికులు రోడ్డున పడిన సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి రూ.7.5 కోట్లు వారికి నష్టపరిహారంగా ఇప్పించాం.

విద్యుత్ సౌకర్యం కల్పించరూ..

- అడ్డాకుల టోపీలు పెట్టుకుని గిరిజనుల వినూత్న నిరసన

అడ్డాకుల టోపీలు ధరించి వినూత్న రీతితో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - దేవరాపల్లి (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ శివారు కొక్కుల బంద, జారురాయి, కొత్తవలస పివిటిజి గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలంటూ ఆయా గ్రామాల గిరిజనులు కొక్కులబందలో మంగళవారం ఆందోళన కు దిగారు. అడ్డాకుల టోపీలు పెట్టుకుని, మోకాళ్లపై కూర్చొని.. చేతులు జోడించి ప్రాధేయపడుతూ వినూత్న రీతితో నిరసన తెలిపారు. వారినుద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.దొర మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ గిరిజన గ్రామాలకు కరెంటు లేకపోవడం దారుణమన్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో పాములు, అడవి జంతువులతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని, లేనిపక్షంలో కలెక్టర్‌ను నేరుగా కలిసి సమస్యలను విన్నవిస్తామని, పోరాటాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఆపేది లేదని తెలిపారు. ఆందోళనలో గిరిజనులు బోయిన రామన్న, పాలక అన్నయ్య, పాతబోయిన బుచ్చన్న, పాలి పెదగంగులు, పాలు సన్యాసిరావు, కొర్రడొంబు, కిల్లో శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

- ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడేందుకు కృషి
- రాజ్యాంగ విలువలను కాపాడుతూ నిజాయితీగా పనిచేశాం
- 'ప్రజాశక్తి' ప్రతినిధితో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్సీగా ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి పోరాడతామని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలపై శాసనమండలిలో రాజీలేని పోరాటం చేసి ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. రాజ్యాంగ విలువలకు, లౌకికవాద విధానాలకు కట్టుబడి నిజాయితీ, నిబద్ధతతో పనిచేశామని తెలిపారు. ఎమ్మెల్సీగా కెఎస్.లక్ష్మణరావు మూడుసార్లు గెలుపొందారు. 2007, 2009లో కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి, 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. తాజాగా ఆయన పదవీ కాలం మార్చి 29తో ముగిసిన నేపథ్యంలో 'ప్రజాశక్తి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీల ప్రత్యేకత

ఉమ్మడి రాష్ట్రంలో 2007లో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీలు ఏడుగురం గెలుపొందాం. మేమంతా కలిసి సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజాసమస్యలపై ఉమ్మడిగా శాసనమండలిలో పలు అంశాలను లేవనెత్తేందుకు ఒక బృందంగా ఏర్పడ్డాం. దీనికి ప్రొగ్రెసివ్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ (పిడిఎఫ్) అనే పేరు పెట్టాం. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, పేదల అభ్యున్నతి కోసం పనిచేయాలని నిర్ణయించాం. ఇదే పద్ధతిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పనిచేస్తున్నారు ప్రజా సమస్యలపై సభలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాం. బయట ఉద్యమాలు చేసే ప్రజా సంఘాలకు సంపూర్ణ మద్దతు ఇస్తూ వచ్చాం.

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కట్టుబడి జిఒ నెంబరు 117ను వ్యతిరేకించాం. 3, 4, 5 తరగతుల విలీనానికి వ్యతిరేకంగా పోరాడాం. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అండగా నిలిచాం. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు 'బడి కోసం బస్సు యాత్ర' నిర్వహించాం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం సుదీర్ఘకాలంగా పోరాడాం. మున్సిపల్, ఎయిడెడ్, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా విద్యాలయాల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రయోజనాలను కాపాడేందుకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాం. ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు అనేక ఉద్యమాలు చేశాం. సిపిఎస్ రద్దు కోసం జరిగిన అన్ని ఉద్యమాల్లోనూ పాల్గొన్నాం. అరెస్టు కూడా అయ్యాం. మాపై కేసులు కూడా పెట్టారు. 2022 ఫిబ్రవరి మూడున విజయవాడలోని బిఆర్‌టిఎస్ రోడ్డులో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిర్వహించిన చారిత్రాత్మక పోరాటంలో పాల్గొన్నాం. ఎన్‌పిఎస్, సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్‌లను వ్యతిరేకిస్తూ .జరిగిన ఉద్యమాల్లో భాగస్వాములమయ్యాం. ఒపిఎస్ పునరుద్ధరణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించాం.

నిరుద్యోగుల సమస్యలపై ఉద్యమాలు?

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా శాసనమండలిలోనూ, బయట నిరుద్యోగుల తరపున అనేక పోరాటాలు చేశాను. ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం జాబ్ కేలండర్ల విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాం. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి డిఎస్‌సి ద్వారా నోటిఫికేషన్లు విడుదల చేయాలని శాసనమండలిలో అనేకమార్లు గత ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాం. జాబ్ కేలండర్ ఇవ్వాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పోరాడాం. ముఖ్యంగా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల కోసం 2017 నుంచి 2024 వరకు అప్పటి ప్రభుత్వాలపై :శాసనమండలిలో చర్చల ద్వారా ఎంతో ఒత్తిడి తెచ్చాం. తర్వాత డిఎస్‌సి నోటిఫికేషన్ ఒక రాజకీయ అజెండాగా ప్రధాన పార్టీలు చేపట్టే విధంగా కృషి చేశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిఎస్‌సి ద్వారా 16,340 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తొలి సంతకం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుని ఈ పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. గ్రంథాలయాల్లో స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయించాం.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కృషి

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జరిగిన అనేక పోరాటాల్లో నేరుగా పాల్గొని వారి డిమాండ్ల అమలుకు కృషి చేశాం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు నిర్వహించిన అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొనడమే కాకుండా నేరుగా శాసనమండలిలో వారి సమస్యల తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. కాంట్రాక్టు అధ్యాపకులు, 2008 డిఎస్‌సి, మినిమం టైమ్ స్కేలు ఉపాధ్యాయులు, 1998 డిఎస్‌సి వారికి మినిమమ్ టైమ్ స్కేల్ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేశాం. వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి కృషి చేశాం. అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యమానికి మద్దతు ఇచ్చి వారి తరపున శాసనమండలిలో పోరాడాం. 42 రోజులపాటు జరిగిన సమ్మెకు మద్దతు తెలిపాం. ఆశా వర్కర్లు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు తదితర ఉద్యోగ, కార్మిక వర్గాలకు అండగా నిలిచాం.

రైతాంగ సమస్యలపై పోరాటం

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో రైతాంగ సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాం. శాసనమండలిలోనూ, జిల్లా పరిషత్తు, డిఆర్‌సి వేదికల ద్వారా కూడా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాం. ప్రధానంగా రైతులకు ఏటా ఎదురవుతున్న కల్తీ విత్తనాలు, ఎరువుల సమస్యలపై పోరాటాలు నిర్వహించాం. పెదకూరపాడు నియోజకవర్గంలో కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాం. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల జారీలో అలసత్వం, 2011 కౌలు రైతు చట్టం రద్దుపై అనేక పోరాటాలు చేశాం. భూ యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సిలు ఇవ్వాలని డిమాండ్ చేసి ఎక్కువ మందికి ఈ కార్డులు అందేలా కృషి చేశాం. మిర్చి, పత్తి, పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కోసం నిర్వహించిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాం. నీటిపారుదల రంగానికి సంబంధించి పల్నాడు జిల్లాలో వరికపూడిశెల ప్రాజెక్టు కోసం శాసనమండలి సమావేశాల్లో 14 ఏళ్లు ప్రస్తావిస్తూ వచ్చాను. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు ద్వారా 50 వేల ఎకరాలకు సాగు నీరు, 50 గ్రామాలకు తాగు నీరు అందించేందుకు ప్రభుత్వంపై ఇప్పటికీ ఒత్తిడి తెస్తున్నాం. ఎన్‌టిఆర్ జిల్లాలో కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారానికి ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో పర్యటించి సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి స్వచ్ఛమైన తాగు నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నాం. గంపలగూడెం మండలం కట్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని శాసనమండలిలో పోరాడాం.

అభివాదం చేస్తున్న కోకో రైతు సంఘం నేతలు

కోకో గింజలకు అంతర్జాతీయ ధర కల్పించాల్సిందే

- లేకపోతే 'చలో గుంటూరు'
- ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ తీర్మానం

ప్రజాశక్తి - ఏలూరు

కోకో గింజల కొనుగోలు, ధరల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే త్వరలో చలో గుంటూరు కార్యక్రమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో కోకో రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ధర కోసం గత నెల రోజులుగా కోకో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారుల సమక్షంలో కంపెనీలతో చర్చలు జరిపినప్పటికీ కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర ఇస్తామని కంపెనీలు అంగీకరించాయని ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు చెప్పినా ఆచరణలో అమలు కావడం లేదని వివరించారు. రోజురోజుకీ ధరలను కంపెనీలు తగ్గిస్తున్నాయని, దీంతో కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోకో రైతుల సంఘం ప్రతినిధి బృందం మార్చి 29న కలిసి వినతి పత్రం అందజేయగా రెండు, మూడు రోజుల్లో కంపెనీలతో జాయింట్ మీటింగ్ జరిపి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ప్రస్తుతం కిలో గింజలకు రూ.700కు పైగా ధర ఉందని తెలిపారు.. ప్రస్తుతం కంపెనీలు కిలోకు రూ.550 నుంచి రూ.500 ఇస్తున్నాయని, ఈ ధర మరింత తగ్గిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నాయని చెప్పారు.

న్యాయం జరిగే వరకూ కోకో రైతులు ఐక్యంగా పోరాడుతారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య, ఉప్పల కాశీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, గుది బండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, రాష్ట్ర కోశాధికారి జాస్తి కాశీ బాబు మరియు వివిధ జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సొమ్ముతో వెల్ఫేర్ అసిస్టెంట్ పరారీ

ప్రజాశక్తి - కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా), తర్లుపాడు (ప్రకాశం జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లలో పింఛనుదారులకు పంపిణీ చేయాల్సిన సొమ్ముతో సంక్షేమ కార్యదర్శి పరారయ్యారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ) లక్ష్మీ కుమారి కథనం ప్రకారం... గంపలగూడెం మండలం పెనుగొలనుకు చెందిన తోట తరుణ్ కుమార్ కంచికచర్లలో గత ఆరు నెలలుగా సంక్షేమ కార్యదర్శిగా (వెల్ఫేర్ అసిస్టెంట్) పనిచేస్తున్నారు. పింఛన్‌దారులకు ఇవ్వాల్సిన రూ. 7.55 లక్షల నగదును ఆఫీసు కార్యాలయం నుంచి ఆయన తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం పింఛను ఇవ్వడానికి రాలేదు. దీంతో ఎంపిడిఒకు అనుమానం వచ్చి తరుణ్‌కుమార్ స్వగ్రామం పెనుగొలనులో ఉన్న ఇంటికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెల్ఫేరు అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఎంపిడిఒ వెల్లడించారు.

కేతగుడిపిలో పింఛన్ల నగదు మాయం

ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలంలోని కేతగుడిపి పంచాయతీలో పింఛన్లకు సంబంధించిన నగదు మాయమైంది. దీంతో గ్రామానికి చెందిన వృద్ధులు, వికలాంగులు పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కేతగుడిపి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లిక మార్కాపురం స్టేట్ బ్యాంకులో శనివారం రూ.18 లక్షలు డ్రా చేశారు. కేతగుడిపిలో మంగళవారం ఉదయం పెన్షన్లను పంపిణీ చేయలేదు. ఈ విషయాన్ని ఎంపిడిఒ చక్రపాణి ప్రసాద్‌ను జిల్లా అధికారులు ప్రశ్నించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌కు ఎంపిడిఒ ఫోన్ చేయగా డ్రా చేసిన సొమ్మును బ్యాగులో పెట్టుకొని తన ఇంటికి వెళ్తుండగా ఆటోలో మిస్సయిందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం వెల్ఫేర్ అసిస్టెంట్ మార్కాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బకాయి వేతనాల కోసం ధర్నా

- కలెక్టరేట్ ఎదుట 'ఉపాధి' కార్మికుల ఆందోళన

కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న ఉపాధి కార్మికులు, వ్యకాస నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం కలెక్టరేట్ ఎదుట ఉపాధి హామీ కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ.. పనులు కావాలని దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా పని ఇవ్వని పక్షంలో 16వ రోజు నుంచి భృతి ఇవ్వాలని చట్టం చెబుతున్నా అనేక గ్రామాల్లో అమలు కావడం లేదన్నారు.

ఎస్.కోట మండల పరిధిలో దారపర్తి పంచాయతీలోని ఎనిమిది గ్రామాలు , జిల్లాలోని పలు గ్రామాల్లోనూ పనులు కల్పించడం లేదని తెలిపారు. పనులు చేసిన కార్మికులకు 15 రోజుల్లో డబ్బులు చెల్లించాలని చట్టం చెబుతున్నప్పటికీ నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో పది శాతం మాత్రమే మెటీరియల్ వర్క్సుకు వినియోగించాలని, కానీ, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ఈ బడ్జెట్‌లో నుంచి 40 శాతం టిడిపి కూటమి ప్రభుత్వం దారిమళ్లిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలనే దురుద్దేశంతోనే ఎన్ఎంఎంఎస్ యాప్ తీసుకువచ్చారని, సర్వర్ సమస్యతో ఫొటో అప్‌లోడ్ కాకపోతే ఆ రోజు కార్మికులు పనికి రానట్లుగా నమోదవుతోందని తెలిపారు. ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని కోరారు. ధర్నాలో సిఐటియు నాయకులు ఎ.జగన్‌మోహన్, ఎం.రమణ, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

మార్కెట్లలో టారిఫ్‌ల అల్లకల్లోలం

- సెన్సెక్స్ 1400 పాయింట్ల పతనం
- తొలి రోజు ట్రంప్ సుంకాల ఎఫెక్ట్
- ఐటి షేర్ల విలవిల
- రూ.3.44 లక్షల కోట్ల సంపద ఆవిరి
- భగ్గుమన్న చమురు ధర

ముంబయి : దలాల్ స్ట్రీట్‌లో అమెరికా ప్రతీకార సుంకాల భయాలు అల్లకల్లోలం సృష్టించాయి. ఈ దెబ్బతో ఆర్థిక సంవత్సరం 2025-26 తొలి రోజు మంగళవారం ఒక్క పూటలోనే రూ.3.44 లక్షల కోట్ల మదుపర్ల సంపద హరించుకుపోయింది. ట్రంప్ నిర్ణయాలు ముఖ్యంగా ఐటి కంపెనీల ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయనే అంచనాలు ఆ రంగం షేర్లను కుప్పకూలేలా చేశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన బిఎస్ఇ సెన్సెక్స్ తుదకు 1,390 పాయింట్లు లేదా 1.80 శాతం పతనమై 76,024కు పడిపోయింది. సెన్సెక్స్ 76,882.58 పాయింట్ల నష్టం వద్ద ప్రారంభం కాగా.. ఓ దశలో 75,912 కనిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ-50 సూచీ 353.65 పాయింట్లు లేదా 1.5 శాతం కోల్పోయి 23,166కు దిగజారింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.3.44 లక్షల కోట్లు ఆవిరి.. రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది. మరోవైపు చమురు ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురు దిగుమతి ప్రధాన దేశంగా ఉండటంతో ధరల పెరుగుదల మార్కెట్లపై విశ్వాసాన్ని దెబ్బతీశాయి.

ఆ రెండు తప్పా..

సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాలను చవి చూశాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. విఐలో కేంద్రం తన వాటాను 22.6 శాతం నుంచి 49 శాతానికి పెంచకునేందుకు అంగీకరించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు 20 శాతం మేర లాభపడ్డాయి. ఎన్ఎస్ఇలో 20.15 శాతం ఎగిసి రూ.8.17 వద్ద ముగిసింది.

ప్రతికూలాంశాలు..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతికార సుంకాలపై ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు ముందు జాగ్రత్తగా అమ్మకాలకు దిగారు.

అమెరికాలో ఐటికి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చుననే అంచనాలతో ఐటి స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. దేశీయ ఐటి కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టి, హెచ్‌సిఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. చాలా నెలల తర్వాత ఇటీవల సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరగడంతో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. మార్కెట్లు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న వేళ రిటైల్ మదుపర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

మార్చిలో 10 శాతం పెరిగిన జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లతో ప్రభుత్వ ఖజానా గలగలలాడుతోంది. ప్రతీ నెల జిఎస్‌టి వసూళ్లలో భారీగా పెరుగుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది మార్చిలో రూ.1.96 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లయ్యింది. గతేడాది ఇదే నెల వసూళ్లతో పోల్చితే 9.9 శాతం పెరుగుదల నమోదయ్యింది. గడిచిన నెల వసూళ్లల్లో సిజిఎస్‌టి కింద రూ.38,100 కోట్లు వసూళ్లు కాగా.. ఎస్‌జిఎస్‌టి కింద రూ.49,900 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి కింద రూ.95,900 కోట్లు, సెస్సుల రూపంలో రూ.12,300 కోట్లు చొప్పున వసూలైనట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంగళవారం వెల్లడించింది. దేశీయ లావాదేవీలు 8.8 శాతం పెరిగి మొత్తం రూ.1.49 లక్షల కోట్లు ఆదాయం వచ్చినట్లు పేర్కొంది. దిగుమతి వస్తువుల పన్ను ఆదాయం 13.56 పెరిగి రూ.46,919 కోట్లు సమకూరినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో జిఎస్‌టి వసూళ్లు 1 శాతం తగ్గి రూ.4,033 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో రూ.4,082 కోట్ల వసూళ్లు చోటు చేసుకున్నాయి. ఇదే నెలలో తెలంగాణలో రూ.5,399 కోట్లుగా ఉన్న వసూళ్లు.. 2025 మార్చిలో స్వల్పంగా పెరిగి రూ.5,401 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి.

అంకుర హాస్పిటల్‌కు రూ.165 కోట్ల ఎడిబి నిధులు

హైదరాబాద్ : ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) నుంచి రూ.165 కోట్ల నిధులు అందుకున్నట్లు అంకుర హాస్పిటల్స్ వెల్లడించింది. ఈ వ్యూహాత్మక పెట్టుబడి తమ ప్రతిష్టాత్మక విస్తరణ ప్రణాళికలకు మద్దతు ఇవ్వనుందని అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఎడిబి నుండి అందిన ఈ ఆర్థిక సహాయం దేశంలో మహిళలు, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలనే తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. "ఇది మా పీడియాట్రిక్, ప్రసూతి, గైనకాలజీ సేవలను మెరుగుపరచడానికి, మా సౌకర్యాలను విస్తరించడానికి, మరిన్ని కుటుంబాలను చేరుకోవడానికి, వారు అత్యున్నత ప్రమాణాలతో కూడిన సంరక్షణను పొందేలా చూసుకోవడానికి వీలు కల్పిస్తుంది.' అని కృష్ణ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

గౌరవ నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ వారి సమక్షంలో చెన్నై వద్ద
అప్పిలేట్ న్యాయపరిధి
కంపెనీ అపీల్ (ఎటి) (సిహెచ్) నం.79/2024

ఈ విషయంలో:
వీరి మధ్య:
కోనేరు గాంధి ...దరఖాస్తుదారు
మరియు
ఎన్‌ఆర్‌ఐ పవర్ & ఇన్‌ఫ్రా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ & 8 ఇతరులు
...ప్రతివాదులు

ఐఎ నం. 1160/2024తోపాటు కంపెనీ అపీల్ (ఏటి)(సిహెచ్) నం.79/2024 వారి విచారణ యొక్క ప్రకటన.

గౌరవ నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ వారి సమక్షంలో ఎన్‌ఆర్‌ఐ పవర్ & ఇన్‌ఫ్రా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ విషయంలో శ్రీ కోనేరు గాంధీచే ప్రవేశపెట్టిన, కంపెనీ అపీల్ (ఎటి)(సిహెచ్) నం.79/2024 ను సిపి నం.46/59/హెచ్‌డిబి/2022లో గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ వారిచే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 421 క్రింద తేది: 21.08.2024 నాటి ఇంప్యూగ్నడ్ ఆర్డర్‌ను జారీచేశారు. 25.03.2025న విచారణలో గౌరవ అప్పిలేట్ ట్రిబ్యునల్ వారిచే దీనిని గుర్తించి, దిగువ ప్రతివాదుల హాజరుకాలేకపోయారు.

ప్రతివాది నం.1	**ఎన్‌ఆర్‌ఐ పవర్ & ఇన్‌ఫ్రా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్,** రిజిస్టర్డు ఆఫీసు: ఫ్లాట్ నం.402, 6-3609/150, రామ్‌కిషన్ రెసిడెన్సీ, ఆనంద్ నగర్ కాలనీ, ఎంఆర్‌ఓ ఆఫీసు దగ్గర, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, తెలంగాణ.
ప్రతివాది నం.2	**శ్రీమతి ఇందిరా దేవి,** నివాసం: 8-2-617/ఎ/4, ఫ్లాట్ నం.జి-3, రోడ్ నం.11, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ.
ప్రతివాది నం.3	**శ్రీ వెంకట రమణ పీర్‌శెట్టి,** నివాసం: రాజుకుంట, చిట్వేల్, కడప-516104, ఆం.ప్ర.
ప్రతివాది నం.4	**శ్రీ లోకనాథ యన్నారు,** నివాసం: ఇ.నం.1/13, రాజకుంట, చిట్వేల్, కడప-516104, ఆం.ప్ర.
ప్రతివాది నం.5	**శ్రీ నీరజ్ కుమార్ కొడిదాల,** నివాసం: ఫ్లాట్ నం.503, అశ్వసిధ్ నోవటేర్ నెస్ట్-2, గౌతమి ఎంక్లేవ్, చిరెక్ పబ్లిక్ స్కూల్ దగ్గర, కొండాపూర్, కెవి రంగారెడ్డి, హైదరాబాద్-500084, తెలంగాణ.
ప్రతివాది నం.6	**శ్రీమతి లక్ష్మి చక్రధార ముక్కాస,** నివాసం: ఫ్లాట్ నం.402, 6-3-609/150, రామ్‌కిషన్ రెసిడెన్సీ, ఆనంద్ నగర్ కాలనీ, ఎంఆర్‌ఓ ఆఫీసు దగ్గర, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, తెలంగాణ.
ప్రతివాది నం.7	**శ్రీ కొడిదాల పెద్ద వెంకట సుబ్బయ్య,** నివాసం: 8-2-617/ఎ/4, ఫ్లాట్ నం.జి-3, రోడ్ నం.11, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ.
ప్రతివాది నం.8	**శ్రీ అన్నల నరసింహా వర ప్రసాద్,** నివాసం: 7-92/1, ఎం.ఆర్.పల్లి, శాంతి నగర్, తిరుపతి (అర్బన్), చిత్తూరు-517502, ఆం.ప్ర.
ప్రతివాది నం.9	**శ్రీ యలవర్తి నాగ మోహన్ చంద్,** నివాసం: 7, మన్వి రోస గార్డెన్ క్యాంప్, నాగ మోహన్ రాయచూర్, కర్నాటక-584123.

మరియు వారిపై గౌరవ అప్పిలేట్ ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ వారు విచారణ ప్రకటన ప్రచురించవలసిందిగా ఆదేశించారు. అందుకుగాను, దాని అనుసరించి, ఇందుమూలంగా **గౌరవ నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ వారి సమక్షంలో 03.06.2025న విచారణ కొరకు కంపెనీ అపీల్ (ఏటి)(సిహెచ్) నం.79/2024ను ఐఎ నం.1160/2024తోపాటు పోస్టుచేయబడినది.**

సం/-
ప్రదేశం: హైదరాబాద్,
తేది: 01.04.2025
వై. సూర్యనారాయణ కౌన్సిల్,
అప్పిలేట్ తరపున.

సంపాదకీయం

పేదల పొట్టగొట్టొద్దు

గ్రామీణ పేదలకు అండగా ఉంటున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం ఉసురు తీయాలని చూడటం అమానుషం. ఈ ఏడాది మార్చి 21 నాటికి రూ.26 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా కేంద్రంలోని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం మీనమీషాలు లెక్కిస్తోంది. అందులో మన రాష్ట్రానికి రావాల్సిన బకాయి రూ.2,030 కోట్లు. కేరళకు రూ.1,055 కోట్లు, తమిళనాడుకు రూ.3,725 కోట్లు, ఉత్తర ప్రదేశ్‌కు రూ.3,668 కోట్లు, బీహార్‌కు రూ.2,849 కోట్లు..ఇలా...దాదాపు అన్ని రాష్ట్రాలకూ బకాయిలున్నాయి. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ ఈ ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రధాని అనుంగు మిత్రుడు గౌతమ్ అదానీ కుటుంబ సంపద ఈ ఏడాది అక్షరాలా లక్ష కోట్ల రూపాయలు పెరిగి, ఆసియాలో రెండో సంపన్నుడిగా కొనసాగుతున్నాడు. మన దేశంలోని 284 మంది బిలియనీర్ల చేతిలో భారత జిడిపిలో దాదాపు మూడింట ఒక వంతు సంపద అంటే రూ.98 లక్షల కోట్లు పేరుకుపోయింది. కార్పొరేట్లకు సమస్త వనరులనూ కట్టబెడుతుండటంతోపాటు రూ.16 లక్షల కోట్లు బ్యాంకుల నుంచే దోచిపెట్టిన మోడీ ప్రభుత్వం ఎందుకు 'ఉపాధి' బకాయిల చెల్లింపులో జాప్యం చూపుతోంది?

వామపక్షాల చొరవతో యుపిఎ-1 హయాంలో 2005లో ఉపాధి హామీ చట్టం రూపుదాల్చింది. గ్రామీణ పేదలకు కనీసం వంద రోజుల ఉపాధికి హామీ ఇవ్వాలనేది ఈ చట్టం ప్రధానోద్దేశం. బిజెపి, మోడీ అప్పట్లో బహిరంగంగానే ఈ చట్టంపై విమర్శలు గుప్పించారు. ఉపాధి హామీ చట్టం ఒక హక్కు. లబ్ధిదారులు ప్రజల ఉమ్మడి సంపద సృష్టికర్తలు. చేసిన పనికి ప్రతిఫలం పొందుతారు. ఎవరికీ కృతజ్ఞత చూపవలసిన అవసరమూ లేదు. వారికి బేరమాడే శక్తీ వస్తుంది. ఈ విధమైన హక్కులు పేదల ఆత్మగౌరవాన్ని పెంచడంతోపాటు సాధికారతనూ కల్పిస్తాయి. ప్రజల వద్ద ఏ అధికారమూ ఉండటం బిజెపికి ఎంతమాత్రం నచ్చదు. అందుకే ఉపాధి హామీ చట్టం మీద దాడి కొనసాగుతూనే ఉంది.

ఉపాధి హామీ చట్టం ప్రకారం వేతన బకాయిలను పని ముగిసిన తరువాత 15 రోజుల్లో చెల్లించాలి. ఆలస్యమైతే రోజుకు 0.05 శాతం చొప్పున పరిహారం చెల్లించాలి. గ్రామ పంచాయతీ లేదా జిల్లా అధికారికి ఫిర్యాదు చేయొచ్చు. పనే కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇంతవరకూ పరిహారం గాని, నిరుద్యోగ భృతి కానీ చెల్లించలేదు. ఇది చట్టాన్ని దారుణంగా అతిక్రమించడమే. వేతనాల చెల్లింపులో విపరీతమైన జాప్యం చేయడం ఈ పనుల పట్ల కూలీల్లో విముఖత పెంచి, చట్టాన్ని దెబ్బతీసే వ్యూహమే! ఉపాధి పనుల్లో మెటీరియల్ కాంపొనెంట్ నిధులను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచి యంత్రాల పనులుగా ఇప్పటికే మార్చేసింది. ఇప్పుడు రావాల్సిన బకాయిల్లోనూ కార్మికుల వేతనాల కింద రూ.15,277 కోట్లు, సామగ్రి, పాలనా ఖర్చుల కింద రూ.10,820.23 కోట్లు ఉన్నాయి. చట్టం హామీ ఇచ్చిన వంద రోజుల నుంచి 34 రోజులకు వ్యవసాయ కార్మికుల పనిదినాలు పడిపోయాయి. ఏడాది కాలంలోనే దేశంలో ఆరు కోట్ల జాబ్‌కార్డులను రద్దు చేసింది. కేంద్ర బడ్జెట్ పెరుగుతున్నా ఉపాధి చట్టానికి మూడేళ్లుగా కేటాయింపులు పెంచకపోగా, రూ.86 వేల కోట్లకే పరిమితం చేసింది. రోజుకు రూ.345 కూలి చెల్లించాలని పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు కాగితాలకే పరిమితమైంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, అగ్రవర్ణాల గ్రామీణ పేదలు ఉపాధి దెబ్బతింటోంది. చట్టం సమర్థవంతంగా అమలు చేయాలంటే రూ.2.5 లక్షల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉన్నా... కేంద్రంలోని ఎన్‌డిఎకు పట్టడం లేదు. ప్రతిపక్షాలు, వివిధ ప్రజాసంఘాలు పార్లమెంట్ లోపలా, బయటా ఆందోళన చేస్తున్నా మీనమేషాలు లెక్కిస్తోంది. బకాయిల కోసం కేరళ, తమిళనాడు తదితర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై పోరాడుతున్నాయి. మోడీ ప్రభుత్వ బాటలోనే మన రాష్ట్రంలోనూ వివిధ కారణాలు చూపుతూ 13 లక్షల జాబ్‌కార్డులు తగ్గించారు. మరింతగా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆర్థిక అగ్రశక్తిగా ఎదుగుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ సర్కారు ఇకనైనా 'ఉపాధి' బకాయిలన్నీ చెల్లించాలి. వీటిపై మరింత సంఘటితంగా గ్రామీణ పేదలు పోరాడేందుకు సహకరించాల్సిన బాధ్యత అందరిదీ.

మహనీయుల మాట

అన్నింటికీ మించిన నేరం అన్యాయంతోనూ, అక్రమాలతోనూ రాజీ పడటమే.

- నేతాజీ సుభాష్ చంద్రబోస్

భారత జిడిపి వృద్ధి-అతిశయోక్తులు, చేదు నిజాలు

విశ్లేషణ



పదేళ్లలో జిడిపి రెట్టింపు అని గొప్పలు చెప్పుకుంటూ తమ భుజాలను తామే చరుచుకుంటూ శభాష్ అని చెప్పుకుంటున్నారు పాలకులు. ఆ పది సంవత్సరాల్లో 2014 నుంచి 2024 వరకు మన ఆకలి సూచిక స్కోరు 28.2 నుంచి 27.3కు మాత్రమే తగ్గింది. దీనిలో అంత అభివృద్ధి ఎందుకు రాలేదు? అయినా సరే దీనికే పొంగిపోతున్నాం. ఇదే కాలంలో పాకిస్తాన్ స్కోరు 29.6 నుంచి 27.9కి తగ్గింది, మనకంటే మెరుగైన అభివృద్ధి అంటే పాకిస్తాన్ ఏజంట్లని ఎదురు దాడి చేస్తారు. పాక్ ర్యాంకు మన తరువాత 109, ఆకలిని ఎవరు ఎక్కువగా తగ్గించినట్లు? గత పదేళ్లలో చైనా స్కోరు ఐదు కంటే తక్కువే ఉందన్న వాస్తవాన్ని చెబితే నానా యాగీ చేస్తారు. అన్నం ఉడికిందా లేదా అని చూడటానికి ఒక మెతుకు పట్టుకు చూస్తే చాలు అన్నట్లుగా నరేంద్ర మోడీ అతిశయోక్తుల గురించి చెప్పుకోవటానికి ఈ ఒక్కటి చాలు.

నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తరువాత దేశ జిడిపి 2015లో 2.1 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2025లో 4.3 లక్షల కోట్ల డాలర్లకు చేరినట్లు. ఇది 105 శాతం పెరుగుదల అని ఐఎంఎఫ్ చెప్పింది. అయితే ప్రపంచంలో ఏ పెద్ద దేశమూ ఇంతటి అభివృద్ధి సాధించలేదని బిజెపి ఐ.టి సెల్ అధినేత అమిత్ మాలవీయ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. జాతీయ, ప్రాంతీయ పత్రికలు కూడా ఈ వార్తకు పెద్ద ఎత్తున ప్రాచుర్యమిచ్చాయి. భజనపరుల సంగతి చెప్పేదేముంది, కీర్తి గీతాలు పాడుతున్నారు. బుర్రకు పని చెప్పకుండా చెవులప్పగించేవారుంటే కాకమ్మ కతలు ఎన్నైనా చెబుతారు. బిజెపి పెద్దలు 2025 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు పెంచుతామని గొప్పలు చెప్పుకున్న అంశం ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి. అలా ప్రచారం చేయటమే కదా ఆ పెద్దమనిషి ఉద్యోగం. వాస్తవం ఏమిటి, 2004లో మన్మోహన్ సింగ్ అధికారానికి వచ్చినపుడు జిడిపి 709 బిలియన్ డాలర్లు కాగా 2014 నాటికి అది 2030 బిలియన్లకు పెరిగింది. ఏ ఎలిమెంటరీ స్కూలు విద్యార్థిని అడిగినా యుపిఏ పాలనా కాలంలో పెరుగుదల రేటు 186 శాతమని, 105 కంటే ఎక్కువని చెబుతారు. ఎవరన్నా గట్టిగా కాదు అంటే మున్సిపల్ అధికారులు వచ్చి నిబంధనలన్నీ సక్రమంగానే పాటించినా వారి ఇళ్ల గోడల నిర్మాణంలో ఇసుక, సిమెంటు పాళ్లలో తేడా కనిపిస్తోందని, హానికారక రంగులు వేశారంటూ వెంటనే బుల్డోజర్లతో కూల్చివేసే రోజులివి. వ్యంగ్యాన్ని భరించలేక ముంబైలో కునాల్ కమ్రా ప్రదర్శన జరిగిన హాలును ఎలా కూల్చివేశారో చూశాంగా!

ఎం. కోటేశ్వరరావు

టీవీ9 నిర్వహించిన సమావేశంలో ప్రధాని చెప్పిన కొన్ని అతిశయోక్తుల గురించి చూద్దాం. "నేడు ప్రపంచ కళ్లన్నీ భారత్ మీదే". 2014 మే 26న ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుంచీ పదాలు మార్పు ఉండవచ్చు తప్ప ఇదే పాట. ఏ ఒక్క అంతర్జాతీయ సమస్యలో అయినా లేదా వివాద పరిష్కారంలోనైనా భారత పాత్రను కోరిన దేశాలు గానీ, మోడీ ప్రమేయంగానీ ఉన్న ఉదంతం ఒక్కటంటే ఒక్కటి ఉందా? కానీ మోడీ చెప్పిందాన్ని మరోవైపు నుంచి చూస్తే నూటికి నూరు పాళ్లు వాస్తవం. ఏమిటంటే మన మార్కెట్‌లో తమ వస్తువులను అమ్ముకోవటానికి, తమకు అవసరం లేని వాటిని మనకు అంటగట్టటానికి (ప్రపంచంలో నిషేధించిన అనేక పురుగుమందులు, రసాయనాలు, ఔషధాలు మన దగ్గర పుష్కలంగా దొరుకుతున్నాయి), ఇక్కడి కార్పొరేట్లకు మోడీ సర్కార్ ఇస్తున్న రాయితీల కారణంగా స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులు పెట్టి లాభాలు తరలించుకుపోవటానికి మనవైపు చూస్తున్న మాట వాస్తవం.

"గత పదేళ్లలో జిడిపిని రెట్టింపు చేయటం అంకెలు కాదు, 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ దాటించి నూతన మధ్యతరగతిని సృష్టించాం. వారు కొత్త జీవితాన్ని ప్రారంభించారు, సచేతనంగా ఆర్థికవృద్ధికి తోడ్పడుతున్నారు". ప్రధాని చెప్తున్న ఈ మాటలకు వాస్తవ పరిస్థితికి లంకె కుదరటం లేదు. ఇరవై ఐదు కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి ఎగువకు లాగాం అంటూనే కనీసం ఆహార ధాన్యాలు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార భద్రతా పథకం కింద గోధుమలు, బియ్యం ఇస్తున్నామని అదే నోటితో చెప్పటం విన్నాం. ప్రపంచ ఆకలి సూచికలో తాజాగా 127లో 105వ దేశంగా ఉన్నాం. ఆకలి లేని (9.9), స్వల్ప (10 నుంచి 19.9), తీవ్రం (20 నుంచి 34.9), ఆందోళనకరం (35 నుంచి 49.9), అత్యంత ఆందోళనకరం (50 పైన) అనే ఐదు తరగతులుగా దేశాలను విభజిస్తే మన దేశం తీవ్ర తరగతిలో అంతకు ముందు గత పదేళ్లుగా కూడా ఉంది. అనూహ్య అద్భుతాలు లేదా నరేంద్ర మోడీకి కొత్తగా దైవిక శక్తులు వస్తే తప్ప దాన్నుంచి సమీప భవిష్యత్‌లో బయటపడే స్థితి దరిదాపుల్లో కూడా లేదు. పదేళ్లలో జిడిపి రెట్టింపు అని గొప్పలు చెప్పుకుంటూ తమ భుజాలను తామే చరుచుకుంటూ శభాష్ అని చెప్పుకుంటున్నారు పాలకులు. ఆ పది సంవత్సరాల్లో 2014 నుంచి 2024 వరకు మన ఆకలి సూచిక స్కోరు 28.2 నుంచి 27.3కు మాత్రమే తగ్గింది. దీనిలో అంత అభివృద్ధి ఎందుకు రాలేదు? అయినా సరే దీనికే పొంగిపోతున్నాం. ఇదే కాలంలో పాకిస్తాన్ స్కోరు 29.6 నుంచి 27.9కి తగ్గింది, మనకంటే మెరుగైన అభివృద్ధి అంటే పాకిస్తాన్ ఏజంట్లని ఎదురు దాడి చేస్తారు. పాక్ ర్యాంకు మన తరువాత 109, ఆకలిని ఎవరు ఎక్కువగా తగ్గించినట్లు? గత పదేళ్లలో చైనా స్కోరు ఐదు కంటే తక్కువే ఉందన్న వాస్తవాన్ని చెబితే నానా యాగీ చేస్తారు. అన్నం ఉడికిందా లేదా అని చూడటానికి ఒక మెతుకు పట్టుకు చూస్తే చాలు అన్నట్లుగా నరేంద్ర మోడీ అతిశయోక్తుల గురించి చెప్పుకోవటానికి ఈ ఒక్కటి చాలు.

ఆర్థిక విస్తరణలో జి7, జి20, బ్రిక్స్ దేశాలన్నింటి కంటే అసాధారణ వృద్ధి సాధించినట్లు వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ వర్ణించారు. త్వరలో జిడిపిలో భారత్ మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందని బిజెపి పెద్దలు, వారి సమర్థకులు నిత్యం ఊదరగొడుతుంటారు. ఇదొక మైండ్ గేమ్. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున ఉంటుందా? ప్రస్తుతం జపాన్‌ను అధిగమించేందుకు మోడీ చూస్తున్నారని, 2027 తొలి ఆరు నెలల్లోనే 4.9 లక్షల కోట్ల డాలర్లతో జర్మనీని కూడా దాటించేస్తారని ఊదరగొడుతున్నారు. అవన్నీ గిడసబారిన దేశాలుగా మారుతున్నాయి. మనం పోల్చుకోవాల్సింది చైనాతో కదా! మన వృద్ధి రేటు చైనా, అమెరికా, జర్మనీ కంటే ఎక్కువగా ఉందని, గడచిన పదేళ్లలో భారత్ 105 శాతం పెరుగుదల సాధించగా చైనా 76, అమెరికా 66, జర్మనీ 44, ఫ్రాన్సు 38, బ్రిటన్ 28 శాతం పెరుగుదల సాధించిందని ఐఎంఎఫ్ చెప్పింది. లక్ష కోట్ల డాలర్ల మైలు రాయిని దేశం 2007లో దాటింది.తదుపరి 2014లో రెండు లక్షల కోట్లు దాటింది. 2032 నాటికి పది లక్షల కోట్ల డాలర్ల జిడిపి కలిగిన దేశంగా మారుతుందని కొందరు ఆర్థికవేత్తలు జోస్యం చెప్పారు. వారి తర్కం ఏమిటి? 2021లో మూడు లక్షల కోట్లకు విస్తరించింది. కేవలం నాలుగు సంవత్సరాల్లోనే 4.3 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రతి 1.5 సంవత్సరాలకు (18 నెలలకు) ప్రస్తుత వేగంలో ఒక లక్ష కోట్ల డాలర్లు పెరుగుతున్నది. ఇదే కొనసాగితే 2032 నాటికి 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుంది.

కొంత మందికి అంకెలతో ఆడుకోవటం వెన్నతో పెట్టిన విద్య. అంతా అద్భుతంగా ఉందని చెబుతూనే 2025 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5 శాతం ఉంటుందని సన్నాయి నొక్కులు. రానున్న కొద్ది సంవత్సరాల్లో మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నందుకు ఇప్పటి నుంచి సంబరాలు జరుపుకుంటున్నారు కొందరు. చెన్నయ్ కేంద్రంగా పని చేస్తున్న ఆర్థిక నిపుణుడు డి ముత్తుకృష్ణన్ ఉత్సవాలు జరుపుకోవాల్సినంత ఘనత ఏమి సాధించామని ప్రశ్నించారు. జిడిపిలో ఏ స్థానంలో ఉన్నామన్నది కాదు. తలసరి రాబడిలో ప్రపంచంలో మనం 140వ స్థానంలో ఉన్నామని, మనకంటే 139 దేశాలు ముందున్నాయని గుర్తించాలని చెప్పారు. పర్చేజింగ్ పవర్ పారిటీ (పిపిపి) పద్ధతి జీవన ప్రమాణాలను మెరుగ్గా వెల్లడిస్తుందని కొందరు చెబుతారు. దాని ప్రకారం చూసినా మన స్థానం 119 అని చెప్పారు. పదేళ్లలో మన జిడిపి 105 శాతం పెరిగిందని ఏ ఐఎంఎఫ్ చెప్పిందో అదే సంస్థ 2025 తలసరి జిడిపిలో 141వ స్థానం అని కూడా చెప్పింది. మనకంటే పేద దేశమైన కంపూచియా పైన ఉంది. దివాలా తీసిందని చెప్పిన శ్రీలంక 133, బంగ్లాదేశ్ 143, పాకిస్తాన్ 159, సీ జిన్‌పింగ్ ఏలుబడిలో కుప్పకూలి పోయిందని కొంత మంది చెప్పే చైనా 71వ స్థానంలో ఉందని కూడా ఐఎంఎఫ్ చెప్పింది. మన తలసరి రాబడి పదివేల డాలర్లకు చేరాలంటే కనీసం 30 సంవత్సరాలు కష్టపడి పని చేయాలని, దానికి అనుకూలమైన ఆర్థిక పరిస్థితులు ఉండాలని ముత్తు కృష్ణన్ చెప్పారు. చైనా తలసరి జిడిపి 2025లో 13,873 డాలర్లు. ఇప్పుడున్న మన 2,937 డాలర్ల నుంచి ఎదిగి ప్రథమ స్థానంలో ఉన్న మొనాకో 2,56,581 (2023 ప్రపంచ బ్యాంకు సమాచారం) లేదా డాలర్ దేవుడున్న అమెరికా 89,678 (2025 ఐఎంఎఫ్) స్థాయికి, చివరికి పడక కుర్చీ మేథావులు త్వరలో అధిగమించే దూరం ఎంతో దూరం లేదని నమ్మించేందుకు చూస్తున్న చైనాను అయినా కనీసం అధిగమించాలంటే ఎంత సమయం పడుతుందో ఆల్జీబ్రా లేదా వేద గణితం ఏదో ఒక అడ్డగోలు పద్ధతిలో లెక్క వేసుకోవాల్సిందే.

పదకొండు సంవత్సరాల విశ్వగురువు మోడినోమిక్స్ సమర్థ పాలన తరువాత పరిస్థితి గురించి కమ్యూనిస్టులో ఇతర పురోగామివాదులో చెబుతున్న మాటలను కాసేపు పక్కన పెడదాం. బిజినెస్ టుడే పత్రిక 2025 మార్చి 21వ తేదీ సంచికలో వైట్ కాలర్ భారత్‌లో 500 డాలర్ల ఉద్యోగాలు ఇంకేమాత్రం లేవు అంటూ ఒక వార్త వచ్చింది. విజ్‌డమ్ హాచ్ అనే సంస్థ స్థాపకుడు అక్షత్ శ్రీవాత్సవ చెప్పిన అంశాలను దానిలో చర్చించారు. శ్రీవాస్తవ చెప్పిన అంశాలు, వార్తలోని వ్యాఖ్యల సారం ఇలా ఉంది. సాంప్రదాయకంగా ఉపాధి కల్పించే రంగాలు, వృద్ధి పడిపోతున్నది. యువత ఎలా ముందుకు పోవాలో ఎంచుకోవటం కష్టంగా మారుతున్నది. దేశ అభివృద్ధి నమూనా గతం మీద ఇంకేమాత్రం ఆధారపడలేదు. భారత ఐటి మార్కెట్ నిర్ణయాత్మక మార్పుకు లోనవుతున్నది, అది మంచిదారిలో కాదు. ఐ.టి లో మంచి ఉద్యోగాలు అంతరిస్తున్నాయి. అవి వెనక్కు తిరిగి రావు. "ఒక తెల్లవాడికి వెయ్యి డాలర్లు ఇచ్చే బదులు భారతీయులకు 500 డాలర్లు ఇచ్చారు. ఆ సొమ్ముతో మనం సంతోష పడ్డాం. ఎందుకంటే ఇప్పటికీ అది గొప్ప ఉద్యోగమే. అది మన జీవన ప్రమాణాలను పెంచింది. కానీ ఆ కాలం కనుమరుగు అవుతున్నది." అని శ్రీవాత్సవ పేర్కొన్నారు. "ప్రభుత్వం ఒక పరిష్కారం చూపుతుందేమోనని ఆశించటం అర్థం లేనిది, ఆ మార్పు రావాలంటే దశాబ్దాలు పడుతుంది, అప్పటికి మీరు వృద్ధులు కావచ్చు" అని కూడా చెప్పారు.

పదకొండు సంవత్సరాల క్రితం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ ఒక బిజెపి నేతగా, గుజరాత్ సిఎంగా చెప్పిందేమిటి? మిగతా అంశాలను పక్కన పెడదాం. గుజరాత్ నమూనా అభివృద్ధిని దేశమంతటా విస్తరిస్తాం అన్నారు. అంటే పారిశ్రామికంగా వృద్ధి చేస్తామన్నారు. ప్రధాని పదవిలోకి రాగానే విదేశాలకు ఎందుకు పదేపదే వెళుతున్నారంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కోసం అన్నారు. కానీ జరిగిందేమిటి? తరువాత ఎప్పుడైనా గుజరాత్ నమూనా గురించి ఎక్కడైనా మాట్లాడారా? 1950లో మన దేశంలో 20 కోట్ల మంది జనం ఉపాధి కోసం వ్యవసాయంపై ఆధారపడ్డారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగా కొంత భూమి సాగులోకి వచ్చింది. కొంత వ్యవసాయేతర అవసరాలకు మళ్లింది. ఎంత పెరిగింది, ఎంత తగ్గింది అన్న లెక్కలను పక్కన పెడితే స్థిరంగా ఉందనుకున్నప్పటికీ అదే భూమి మీద నాడు 20 కోట్ల మంది బతికితే ఇప్పుడు 2023-24లో జనాభాలో 46.1 శాతం మంది ఆధారపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే తెలిపింది. ఆరు సంవత్సరాల క్రితంతో పోల్చితే రెండు శాతం పెరిగారు. అంటే ఇప్పుడు 67 కోట్ల మంది పని చేస్తున్నారు. చైనాలో 24.1 శాతం లేదా 17.66 కోట్ల మంది (2023) పని చేస్తున్నారు. ఇలాంటి స్థితిలో ఏటా రెండు కోట్ల మేరకు పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో ఉపాధి కల్పిస్తామని చెప్పిన మాటలేమైనట్లు ?

ఉన్నోళ్ల దయతో పేదరికం పోతుందా?

వ్యాఖ్య

తమతో సమానంగా రెండు గంటలపాటు ఓ గొర్రెల కాపరిని, భవన నిర్మాణ కార్మికుడిని కూర్చోబెట్టుకొని రాష్ట్రమంతా ఇలానే ఉన్నట్టుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. వాస్తవంగా పేదలంటే లెక్కలేనితనం రాష్ట్రంలో అడుగడుగునా కనిపిస్తుంది. పేదలు రెవెన్యూ కార్యాలయాల్లో అడుగు పెట్టడానికి వీల్లేదు. పోలీస్ స్టేషన్లో వీరికి జరుగుతున్న అవమానాలు లెక్కలోనివి కాదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో వీరికి ఎదురవుతున్న అనుభవాలు ఒకటి రెండు కాదు. పేదలకు సాయం చేయకపోతే పోయింది. కనీసం వారిని మనుషులుగా చూసే పరిస్థితినైనా రాష్ట్రంలో తీసుకు రావడానికి ఏం చేయాలో నేతలు ఆలోచించడం మంచిది. బంగారు పేరులోనే కాదు ఆచరణలోనూ రావాలి.

ఉన్నోళ్ల దయతో రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పేదరికం నుంచి విముక్తి కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉగాది రోజున ఘనంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్ (పి4)ను ప్రకటించి ఈ కార్యక్రమం ప్రాధాన్యత గురించి వివరించారు.

పి4 పేరిట ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల ప్రయోజనం ఉంటుందా? అన్న ప్రశ్న పలువురిలో ఉంది. పది వేల మంది బంగారు కుటుంబాల (పేదలు) వారు, 600 మంది మార్గదర్శకులు (సంపన్నులు)తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మచ్చుకు ఓ రెండు కుటుంబాలను ఎంపిక చేసుకుని వారితో మాట్లాడారు. వారి సమస్యలను ప్రస్తావిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి 600 మంది మార్గదర్శకులలో మచ్చుకు ముగ్గురు పారిశ్రామికవేత్తలతో ఆ వేదికపై ముఖ్యమంత్రి మాట్లాడించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటల్లో చెప్పాలంటే రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ లేకుంటే రాష్ట్రం ఏమైపోయేదో, పి4 లాంటి కార్యక్రమాలు వచ్చేవా? అని ప్రజలకు ప్రశ్నలు వేశారు. ఇంతవరకు బాగానే ఉంది.

కందారపు మురళి

వేదిక మీద పిలిపించుకొని మాట్లాడిన పేద కుటుంబాలు...కాదు కాదు...బంగారు కుటుంబాల ప్రతినిధులైన గొర్రెల కాపరి నరసింహ స్వామి, భవన నిర్మాణ కార్మికుడు ఇస్మాయిల్ పలు ప్రశ్నలను లేవనెత్తారు.

తమ కుటుంబమంతా కష్టపడినా కడుపు నిండా కూడు తినలేని దౌర్భాగ్యకరమైన పరిస్థితికి కారణమేంటని నరసింహస్వామి ప్రశ్నిస్తే... కుటుంబం గడవడానికి, ఆడబిడ్డను చదివించడానికి ఇస్మాయిల్, ఆయన కుమారుడు మొత్తం కుటుంబం కష్టపడుతున్నా చాలీచాలని పరిస్థితులు, బిడ్డకు ఫీజులు కట్టలేని దయనీయమైన పరిస్థితికి కారణం ఏమిటో తెలియడం లేదని వాపోయారు. గొర్రెల కాపరి నరసింహ స్వామి, భవన నిర్మాణ కార్మికుడు ఇస్మాయిల్ పేదరికానికి ప్రభుత్వ బాధ్యత లేదా?

జగన్మోహన్ రెడ్డి హయాంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉండేదని, ఇప్పుడు తమతో సమానంగా ఆ కార్మికుడిని కూర్చోపెట్టుకున్నామని పవన్ కల్యాణ్ గొప్పగా ప్రకటించారు. జగన్మోహన్ రెడ్డి హయాంకి ఇప్పటికీ భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో ఏమైనా మార్పు వచ్చిందా? అన్నదానికి సమాధానం లేదు.

ఇస్మాయిల్ భార్య, నరసింహస్వామి భార్య ఇరువురూ ఇంటి పనులతో పాటు, పూలు కడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వేదిక మీదకి పిలిచి మాట్లాడించుకున్న పేద కుటుంబాల్లోని సభ్యులు అందరూ కష్టపడుతున్నారు. అయినా జీవించటానికి తంటాలు పడుతున్నారన్న విషయం వారి మాటల్లోనే వ్యక్తం అయింది. రాష్ట్రంలో ఈ పరిస్థితి కారకులు ఎవరు? రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు సంపన్నుడికైనా, సామాన్యుడికైనా ఒకటే. కొనుగోలు శక్తి లేని వారి కష్టం గురించి వారి మాటల్లో అర్థమయింది.

సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు సంపన్నులను, పేదలను కూర్చోబెట్టి సుద్దులు చెబుతున్నారు. ప్రపంచం మొత్తం శోధించి ఎక్కడా లేని విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశ పెట్టానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా ప్రకటించారు.

చంద్రబాబు చెబుతున్నట్టు ఇదేదో కొత్త పథకం కాదు. పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలోకి వచ్చిన ప్రతిసారీ పెట్టుబడుదారుల పట్ల భ్రమలు కల్పించేందుకు పాలకులు చేసే పనులన్నీ ఇలాంటివే!

రాష్ట్రంలో పేదరికంలో ఉన్న 30 లక్షల కుటుంబాల బాధ్యత సంపన్నులకు అప్పగిస్తున్నామని ప్రకటించి ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి వైదొలిగింది.

సంపన్నుల దయాదాక్షిణ్యాలతో ఏ దేశంలోనైనా పేదరికం తొలగిందన్న ఉదాహరణ ఉందా? సంపద కూడబెట్టుకున్న వారిలో పరివర్తన ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చనే చంద్రబాబు సిద్ధాంతాన్ని గతంలో అనేకమంది వివిధ దేశాల్లో చెప్పి ఆచరణలో అది అమలు కాదని గ్రహించారు.

అంబేద్కర్, వివేకానందుడు, అబ్దుల్ కలాం, ఎన్టీ రామారావుల గురించి చంద్రబాబు నాయుడు వివరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతవరకు బాగానే ఉంది.

ఆ తరువాత మెగా కృష్ణారెడ్డి, చలమలశెట్టి అనిల్ కుమార్, లోక్‌సభ సభ్యులలోనే అత్యంత సంపన్నుడైన పెమ్మసాని చంద్రశేఖర్, పవన్ కల్యాణ్, తనను కూడా ఆదర్శంగా తీసుకోవాలని చెప్పుకొచ్చారు.

మెగా కృష్ణారెడ్డి వ్యాపార రంగంలో ఎలా బలపడ్డారు? అనే దానిపై అనేక వివాదాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ కాంట్రాక్ట్‌లో పైపుల కుంభకోణం, వందల, వేల అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో, ఆయనకు ఉన్న ప్రైవేటు విమానాలు రాజకీయ నేతలకు ఉపయోగ పడుతున్న తీరు, కిర్లోస్కర్ కంపెనీకి సబ్ కాంట్రాక్టర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి అదే కిర్లోస్కర్ కంపెనీ ఆయనకు సబ్ కాంట్రాక్టర్‌గా మారిన తీరు, మెడికల్ విద్యార్థుల నుంచి అడ్మిషన్ల పేరిట వసూళ్ల తదితర అనేక వివాదాల్లో కూరుకుపోయి ఉన్నారు.

ఇక చలమలశెట్టి అనిల్ కుమార్ తెలంగాణ రాష్ట్రంలో ఈ రేస్ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్నారు. ఆయన స్థాపించిన గ్రీన్ కో ఎనర్జీ సంస్థ పలు వివాదాల్లో కూరుకుపోయి ఉన్నది. కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన ఈ అనిల్ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వివాదాస్పదమైన కార్పొరేట్ వ్యక్తి. అవినీతి కేసుల్లో ఇరుక్కున్నారు. ఈ ఇరువురు పారిశ్రామికవేత్తలు అధికారంలో ఏ పార్టీ ఉన్నా తమ పనులను జరిపించుకోవడంలో ఘనులు.



ఇలాంటి ఘనమైన పేరున్న వివాదాస్పదమైన వ్యక్తులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తమతో సమానంగా వేదికపై ఆసీనులను కావించటం, వారి ద్వారా రాష్ట్రంలో పేదరికం నిర్మూలిస్తామని చెప్పడం ఏ మేరకు సమంజసమో వారే చెప్పాలి.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి 600 మంది మార్గదర్శకులలో వివాదం లేని వ్యక్తులను వేదిక మీదకు పిలిపించుకోవటానికి జాగ్రత్త తీసుకుని ఉండాల్సింది. ఆ జాగ్రత్త తీసుకోకపోగా వీరినే ప్రజలందరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రకటించటం... రాజకీయ నాయకులకు కార్పొరేట్‌కున్న బంధాన్ని మరో మారు వెల్లడి చేసింది.

తమతో సమానంగా రెండు గంటలపాటు ఓ గొర్రెల కాపరిని, భవన నిర్మాణ కార్మికుడిని కూర్చోబెట్టుకొని రాష్ట్రమంతా ఇలానే ఉన్నట్టుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. వాస్తవంగా పేదలంటే లెక్కలేనితనం రాష్ట్రంలో అడుగడుగునా కనిపిస్తుంది. పేదలు రెవెన్యూ కార్యాలయాల్లో అడుగు పెట్టడానికి వీల్లేదు. పోలీస్ స్టేషన్లో వీరికి జరుగుతున్న అవమానాలు లెక్కలోనివి కాదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో వీరికి ఎదురవుతున్న అనుభవాలు ఒకటి రెండు కాదు. పేదలకు సాయం చేయకపోతే పోయింది. కనీసం వారిని మనుషులుగా చూసే పరిస్థితినైనా రాష్ట్రంలో తీసుకు రావడానికి ఏం చేయాలో నేతలు ఆలోచించడం మంచిది. బంగారు పేరులోనే కాదు ఆచరణలోనూ రావాలి.

(వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సెల్: 9490098840)

కవనం

గాజా రోజా బుగ్గల్లారా!

పల్లవి: కన్నీళ్లు, రక్తం కలగలిసిన
గాజా పాల బుగ్గల్లారా!
యుద్ధభూమిలో నిద్దురెరగని
రోజా మొగ్గల్లారా!
గాజా పాల బుగ్గల్లారా!
చరణం: సంద్ర తీరాన ఆటపాటలూ..
చంద్ర లోకాన ఊహ, ఊసులూ..
చెంగు చెంగున అల్లరి గంతులు
రంగు రంగుల పూల స్నేహాలు
'పాపం పుణ్యం శ్లేషార్థాలు'
ఎరుగని సిరిసిరి మనసుల్లారా!
కరగని ఇంద్రధనసుల్లారా
"యుద్ధభూమిలో"
ఉగ్రవాదము దాహము తెలియదు
అగ్ర రాజ్యము అహమూ తెలియదు!
జీసస్, అల్లా బోధలు ఎవరికి
అర్థమయ్యేయో తెలియనే తెలియదు!
ఆదేశాల భాష తెలియదు!
చిన్ని ముద్దుకే వెన్న ముద్దలారా!
పగడపు పెదాల వన్నె నవ్వులారా "యుద్ధ"
జ్వాలలు.. జ్వాలలు.. జ్వాలలు!
దగ్ధమవుతున్న జోల పాటలు!
కాల్పులు.. కాల్పులు.. కాల్పులు!
రెప్పలు తెరవని లేత కన్నులు!
శవాలు.. శవాలు.. శవాలు!
అక్కున చేర్చని అమ్మ నాన్నలు !
దిక్కులేని కొన ఊపిరులారా!
"యుద్ధ"
సమాధులెరుగని అనాథ చావులు
డాలర్ చదరంగంలో పావులు!
సంపద, దోపిడి లక్ష్యం వాళ్లకు
తెలియవు పుట్టుక, చావుల విలువలు!
ప్రతి పసి మరణం.. చరిత్రకు సాక్ష్యం
దురాగతాలకు బలైపోయిన
దీనుల్లారా! బిడ్డల్లారా!
ఆలాపన: మేమర్పించే నివాళి గీతం..
జీవన్ మృతుల స్మృతి పతాకం!

- నల్లి ధర్మారావు

హిమాలయాలతో భారత్ అందం అద్భుతం

- భారత్‌కు వస్తానని సునీతా విలియమ్స్ వ్యాఖ్యలు

న్యూయార్క్ : రోదసీ నుండి భారత్ అద్భుతంగా కనిపిస్తుందని నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ వ్యాఖ్యానించారు. తన తండ్రి మాతృ దేశమైన భారత్‌కు తప్పక వస్తానని ఆమె తెలిపారు. అక్కడి ప్రజలతో, తన బంధువులతో రోదసీ అన్వేషణలో తన అనుభవాలను పంచుకుంటానన్నారు. అంతరిక్షం నుండి వచ్చిన తర్వాత సునీతా విలియమ్స్‌తో పాటూ మిగిలిన ఇద్దరు వ్యోమగాములు తొలిసారిగా పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా సునీత పై వ్యాఖ్యలు చేశారు. "భారత్ చాలా అద్భుతంగా కనిపిస్తుంది. హిమాలయాలపై నుండి వెళ్ళిన ప్రతీసారీ బుచ్ విల్మోర్ వాటిని ఫోటోలు తీసేవారు. తూర్పు వైపు నుండి అంటే గుజరాత్, ముంబయిల మీదుగా వస్తున్నపుడు తీర ప్రాంతంలో వుండే చేపల బోట్లు చూడగానే ఒక సిగ్నల్‌లా అనిపించి, భారతదేశం మీదుగా పయనిస్తున్నామని అర్థమయ్యేది. పెద్ద పెద్ద నగరాల నుండి చిన్న నగరాలకు వరకు సాగుతుంటే లైట్ల నెట్‌వర్క్ అందంగా అనిపించేది నిశీధి వేళలోనే కాదు, పగటి పూట కూడా మంచు పర్వతాల అందం అద్భుతం, అనిర్వచనీయం...హిమాలయాలతో భారత్ అందం ఇనుమడిస్తోందని సునీతా వ్యాఖ్యానించారు.

విచారణకు సహకరించండి

- రఘురామ కేసులో డాక్టర్ ప్రభావతికి సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్‌లో ఎలాంటి గాయాలు లేవని నివేదిక ఇచ్చిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తప్పనిసరిగా దర్యాప్తుకు సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో బెయిల్ కోసం పిటీషన్ వేసిన డాక్టర్ ప్రభావతికి మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ప్రభావతిని అరెస్టు చేయెుద్దని పోలీసుల్ని ఆదేశించింది. అలాగే దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ప్రభావతిని ఆదేశించింది. ప్రభావతి పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. సుప్రీంకోర్టు చెప్పినా దర్యాప్తునకు సహకరించలేదని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎప్పుడు నోటీసులు పంపినా, ప్రభావతి తప్ప ఎవరో ఒకరు స్పందిస్తున్నారని సిద్ధార్థ్ లూత్రా తెలిపారు. ఏదో ఒక సాకు చూపి, దర్యాప్తునకు హాజరుకావడం లేదని అన్నారు. దీనికి ప్రభావతి తరపు న్యాయవాది జోక్యం చేసకుని ఒక్కసారే విచారణకు పిలిచారని, రెండు నెలల్లో మళ్ళీ పిలవలేదని తెలిపారు. దీంతో ఈనెల 7, 8 తేదీల్లో ఉదయం 10 గంటలకు దర్యాప్తునకు హాజరుకావాలని ప్రభావతిని ధర్మాసనం ఆదేశించింది. ఈ విచారణలో లిఖితపూర్వకంగా అన్ని సమాధానాలు తీసుకోవాలని పోలీసులకు సూచించింది. తదుపరి విచారాణను ధర్మాసనం ఈనెల 15కి వాయిదా వేసింది.

అందరి చూపూ ట్రంప్ వైపే

- నేడే ప్రతీకార సుంకాల విధింపు

వాషింగ్టన్ : తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాల పైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధం కీలక దశకు చేరుకుంది. ఇప్పుడు అందరి దృష్టి ఆయన పైనే నిలిచి ఉంది. ఎందుకంటే ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల విధింపు నేటి నుండే అమలులోకి రాబోతోంది. దీనిని ఆయన విమోచన దినోత్సవంగా అభివర్ణించారు. అమెరికా ఉత్పత్తులపై విదేశీ వాణిజ్య భాగస్వాములు ఎంత మేర సుంకాలు విధిస్తారో తాము కూడా వారి ఉత్పత్తులపై ఆ స్థాయిలోనే దిగుమతి సుంకాలు విధిస్తామని, కాబట్టి ఇక తాము విదేశీ వస్తువులపై ఎంతమాత్రం ఆధారపడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. అయితే ఏయే దేశాలపై ఏ మేరకు సుంకాలు విధిస్తారో ఇంకా తెలియడం లేదు.

సుంకాల విధింపునకు గడువు సమీపిస్తున్న తరుణంలో అమెరికా వాణిజ్య ప్రతినిధులు, వాణిజ్య శాఖ, ట్రెజరీ శాఖ నుండి కీలకమైన మూడు నివేదికలు అందాయి. అమెరికాకు 20 దేశాలతో వాణిజ్య ఒప్పందాలు ఉన్నాయి. ప్రారంభంలో ఈ దేశాలే లక్ష్యంగా సుంకాల దాడి జరగవచ్చునని చెబుతున్నారు. వాస్తవానికి అమెరికాకు 200 వాణిజ్య భాగస్వామ్య దేశాలు, సుమారు 12,500 సుంకాల కేటగిరీలు ఉన్నాయి. కాబట్టి కొన్ని లక్షల టారిఫ్‌లు విధించాల్సి వస్తుంది. అయితే అమెరికా అధికారులకు అదంత సులభమైన పనేమీ కాదు. ఒకేసారి అన్ని ఉత్పత్తులు, అన్ని దేశాలపై సుంకాలు విధించడం సమస్యాత్మకం అవుతుంది. అధ్యక్షుడు తన అత్యవసర అధికారాలను ప్రయోగించి సుంకాలను పెంచుతారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. బుధవారమే సుంకాల విధింపును పూర్తి చేస్తారా అన్న ప్రశ్నకు 'ప్రతీకార సుంకాల విధింపు ప్రకటన అనేది తదుపరి చర్చలకు అవకాశం కల్పిస్తుంది. సంప్రదింపులు ఫలిస్తే వాటిని తొలగించవచ్చు లేదా తగ్గించవచ్చు' అని విశ్లేషకులు బదులిచ్చారు.

ప్రతీకార సుంకాలపై చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని ట్రంప్ ఇదివరకే చెప్పారు. అయితే ఆ చర్చలు, ఒప్పందాలు సుంకాల విధింపు తర్వాతేనని స్పష్టం చేశారు. ఇక బుధవారం జరిగే పరిణామాలపై అమెరికా వాణిజ్య భాగస్వాములు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది. గతంలో అమెరికా అధిక సుంకాలు విధించినప్పుడు కొన్ని దేశాలు తీవ్రంగా స్పందించాయి. గట్టిగానే ప్రతిఘటించి ప్రతీకార చర్యలకు సైతం దిగాయి. కొన్ని దేశాలు మాత్రం అమెరికాను బుజ్జగించేందుకు ప్రయత్నించాయి. సుంకాలు అనేవి దేశీయ వినియోగదారులపై పడే పన్నులే. వాటిని పెంచితే ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. కాగా మరికొన్ని దేశాలు అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించి ట్రంప్ నుండి రాయితీలు పొందాలని చూస్తున్నాయి.

అమెరికా విధించబోయే సుంకాలు భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయన్న విషయంపై విశ్లేషణలు జరుగుతున్నాయి. అయితే అమెరికా విధించబోయే ప్రతీకార సుంకాల నుండి భారత్‌కు ఎలాంటి రాయితీలు లభించబోవని తెలుస్తోంది. ఎందుకంటే అన్ని దేశాల పైన కొత్తగా సుంకాలు విధిస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నప్పటికీ వాటి ప్రభావం సుంకాలపై ఉండకపోవచ్చునని చెబుతున్నారు.

ఎగిరే ట్యాక్సీలకు చైనా గ్రీన్ సిగ్నల్..

బీజింగ్ : ఎగిరే ట్యాక్సీల విషయంలో చైనా కీలక ముందడుగు వేసింది. పైలట్ అవసరం లేని ఫ్లయింగ్ ట్యాక్సీలను కమర్షియల్‌గా వినియోగించేందుకు అక్కడి సివిల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చైనా అనుమతిచ్చింది. ఈహ్యాంగ్ హెూల్డింగ్స్, హెఫీ హే ఎయిర్‌లైనస్ సంస్థలకు ఈ మేరకు ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికెట్‌ను జారీ చేసింది. అర్బన్ ఏరియాల్లో పర్యటక స్థలాల సందర్శనకు ప్రయాణికుల డ్రోన్లను వినియోగించుకునేందుకు అనుమతించినట్లు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తన కథనంలో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ రెండు కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు మార్గం సుగమం అయ్యింది. త్వరలోనే ఎయిర్ ట్యాక్సీలు రివ్వున గాల్లోకి ఎగరనున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 6జీ నెట్‌వర్క్ వంటి వాటితో పాటు తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్లు, బ్లింప్స్ (గాలితో నిండిన బెలూన్లు), ఫ్లయింగ్ కార్లను చైనా ప్రమోట్ చేస్తోంది.

మద్యం కేసులో వాళ్లను ఇళ్ల వద్దనే విచారణ చేయండి

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో దర్యాప్తు పేరుతో ఇద్దరు వృద్ధులను సిఐడి అధికారులు వేధిస్తున్నారనే పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. శార్వాణి ఆల్కో బ్రూ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు ఇ చంద్రారెడ్డి (68), ఠాకూర్ ఖాళీ మహేశ్వర్ సింగ్లు (63) వృద్ధులు కావడంతో వాళ్లను ఇళ్ల వద్ద అడ్వకేట్ల సమక్షంలో విచారణ చేయాలని సిఐడిని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మద్యం కొనుగోళ్ల కేసు దర్యాప్తు పేరుతో సిఐడి అధికారులు తమను వేధిస్తున్నారంటూ చంద్రారెడ్డి, మహేశ్వర్ సింగ్లు అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్లు అనారోగ్యంగా ఉన్నారని, సిఐడి అధికారులు మంగళగిరి కార్యాలయానికి వచ్చి తీరాలంటున్నారని, అసభ్యంగా కూడా ధూషిస్తున్నారని వాళ్ల న్యాయవాది నాగార్జునరెడ్డి తెలిపారు.

BEFORE THE HON'BLE X ADDL. DISTRICT JUDGE
AT :: MACHILIPANAM
E.P. No. 534 /2024 in Arbitration
Claim No : 991 /2012

Between:
M/s. SHRIRAM FINANCE LIMITED,
(Formerly Known as Shriram City Union Finance Limited)
Machilipatnam Branch.,
Rep. by its Chief Business Manager,
Mr. D.Srinivasa Rao
...DHR
AND
Thota Ajay Kumar & 2 others
...Jdr's

To,
JDR No.1
Thota Ajay Kumar, S/o. Krishna Murthy, Govt.Employee in ZPH School at Nidumolu, R/o. D.No: 28/241, Circle Peta, Machilipatnam, Krishna Dist.

Please take notice that the above E.P. had filed for recovery of E.P. amount and the Hon & Hon'ble court ordered notice to you and posted the E.P. to 03.04.2025 for your appearance. So you are hereby requested to appear before the above Hon'ble court on **03.04.2025** at **10.30** A.M., in person or through your advocate , failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Court)
G. VIJAY KUMAR,
Advocate for DHR
Machilipatnam

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ
(A.P. STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, VIJAYAWADA
F.A.I.A. No. 812/2024 in F.A.No. 452/2024

వారి మధ్య (Between)
ది మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, డోర్ నెం. 4-1-1. గాయత్రి ప్లాజా, 1వ అంతస్తు, హరిహరమహల్ ప్రక్కన, కొరిటెపాడు, గుంటూరు.
... పిటిషనర్/అప్పీలుదారు/అపోసిట్ పార్టీ
మరియు:
కోటి వెంకయ్య, S/o రాఘవులు, హిందూ, వయస్సు 50 సంవత్సరములు, వ్యాపారం, డోర్ నెం. 101, ఉదయపుష్ప అపార్ట్‌మెంట్, రెడ్డి కాలేజీ రోడ్, ఏ.టి. అగ్రహారం, గుంటూరు.
... రేస్పాండెంట్/రేస్పాండెంట్/కంప్లైనంట్
నోటీసు(NOTICE)

పైన ఉదహరించిన F.A.I.A. No. 812/2024 in F.A.No. 452/2024 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ నందు పెండింగుగా యున్నది. సదరు F.A లో I.A. దాఖలు చేసి యున్నారు. F.A.I.A. No. 812/2024 లో తమకు నోటీసు పంపియున్నారు. కానీ సదరు నోటీసు "మీరు స్వీకరించబడలేదు" అను ఎండార్స్‌మెంట్‌తో తిరిగి వచ్చినది కానీ మీరు కేసు దాఖలు చేసినప్పుడు మీరు పొందుపరిచిన అడ్రస్ అదే కావడం వలన మీరు ఉద్దేశపూర్వకంగానే స్వీకరించలేదు అని భావించడమైనది.

కావున ఈ నోటీసును ప్రజాశక్తి పేపరుపై పబ్లికేషన్ ద్వారా ఈ నోటీసును ఇవ్వమని కమీషన్‌ని కోరడం జరిగింది. సదరు కమిషన్ దానిని ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసి యున్నారు.

అందువలన F.A.I.A. No. 812/2024 in F.A.No. 452/2024 ను తేది. 10-03-2025న మీ యొక్క హాజరు కోసం వాయిదా వేసి యున్నారు. కావున **తేది. 25-04-2025** దిన మీరు కానీ మీ యొక్క న్యాయవాది ద్వారా కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల కమిషన్, విజయవాడ ఎదుట **10:30A.M** ని॥కు హాజరయి తమరి యొక్క వాదనలు వినిపించుకోగలరు. అట్లు కాని పక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల కమిషన్, విజయవాడ (A.P. STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, VIJAYAWADA) వారు మీ యొక్క గైర్హాజరీలో నిర్ణయం తీసుకోబడుతుంది అని తెలియ పరుచుచున్నాము.

సం/- వి.బ్రహ్మాజీ
పిటిషనర్లు/అప్పెల్లంట్ల న్యాయవాది,
విజయవాడ.

పవన్‌పై కేసు..
ప్రజాప్రతినిధుల కోర్టుకు ఎలా పంపాలో చెప్పండి

- ఇరుపక్షాలను ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ విపక్షంలో ఉండగా ఎమ్మెల్యే కాదని, ఆ సమయంలో వలంటీర్ల గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే కేసును ప్రజాప్రతినిధుల కోర్టుకు ఎలా పంపాలో చెప్పాలని ఇరుపక్షాలను హైకోర్టు కోరింది. పవన్ వ్యాఖ్యలపై గతంలోని రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు కోర్టులో వేసిన పరువు నష్టం కేసును విజయవాడ ప్రజా ప్రతినిధుల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు పంపాలన్న పిటిషనర్ వాదనలపై పైవిధంగా సందేహాన్ని వ్యక్తం చేసింది. తమ సందేహాలను నివృత్తి చేయాలని పిటిషనర్‌తోపాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. వలంటీర్ల వల్లే ఆడ పిల్లలు మాయమవుతున్నారంటూ 2023లో ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. పెద్ద సంఖ్యలో ఆడ పిల్లలు కనిపించకుండా పోవడం వెనుక వలంటీర్లు ఉన్నారనే వ్యాఖ్యలు ప్రభుత్వ పరువు, ప్రతిష్టకు నష్టం కలిగించే విధంగా ఉన్నందున పవన్‌పై క్రిమినల్ కేసు దాఖలు చేయాలని గుంటూరు కోర్టు పిపిని ఆదేశిస్తూ అప్పటి ప్రభుత్వం జిఓ జారీ చేసింది. తర్వాత పవన్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, పరువు నష్టం కేసులో ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతినివ్వాలంటూ కోర్టులో పిపి కేసు వేశారు. దీంతో గుంటూరు కోర్టు ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతినిస్తూ గతేడాది నవంబర్ 18న ఉత్తర్వులిచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.

జనాభా లెక్కలు, కుల గణనను వెంటనే ప్రారంభించాలి

- రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జనాభా లెక్కలు, కుల గణనను వెంటనే ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. మంగళవారం రాజ్యసభలో జనాభా లెక్కల నిర్వహణలో జాప్యంపై ఖర్గే ప్రశ్నించారు. జనాభా లెక్కల విషయంలో ప్రభుత్వం మౌనం వహిస్తోందని, ఈ జాప్యం కారణంగా అనేకమంది సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారని విమర్శించారు. 1881 నుండి దేశంలో ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనాభా గణనను నిర్వహించారని, యుద్ధాలు, అత్యవసర పరిస్థితులు, ఇతర సంక్షోభాల సమయంలో కూడా ఇది జరిగిందని గుర్తు చేశారు. 1931లో సాధారణ జనాభా లెక్కలతో పాటు కుల గణన కూడా నిర్వహించారని చెప్పారు. 1931 జనాభా లెక్కలకు ముందు మహాత్మా గాంధీ మన ఆరోగ్య పరిస్థితులను అంచనా వేయడానికి మనకు కాలానుగుణంగా వైద్య పరీక్షలు అవసరం అని చెప్పారని గుర్తు చేశారు. కోవిడ్ ఉన్నప్పటికీ ప్రపంచంలోని 81 శాతం దేశాలు జనాభా గణనలను విజయవంతంగా పూర్తి చేశాయని అన్నారు. వినియోగదారుల సర్వే, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే, కార్మిక సర్వే, జాతీయ ఆహార భద్రతా చట్టం, జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం వంటి అనేక కీలకమైన సర్వేలు, సంక్షేమ కార్యక్రమాలు జనాభా లెక్కల డేటాపై ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు.

భార్గవ్‌రెడ్డి కేసులో తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి సోషల్ మీడియా మాజీ ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి ఇతరులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ న్యాపతి విజయ్ ప్రకటించారు. సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ భార్గవ్‌రెడ్డి, ఇతర వైసిపి నేతలు పిటిషన్లు వేశారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసుంటే హైకోర్టుకు నేరుగా ఎలా వస్తారు?

ప్రజాశక్తి-అమరావతి

అక్రమ మైనింగ్ ఆరోపణలతో నెల్లూరు జిల్లా, పొదలకూరు పోలీసులు పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ న్యాయవాది ఓ మనోహర్ రెడ్డి వాదిస్తూ, కాకాణిని అరెస్ట్ చేయాలనే ఏకైక లక్ష్యంతో పోలీసులు ఉన్నారన్నారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. పోలీసుల తరపున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ ప్రతివాదన చేస్తూ, పిటిషనర్ కాకాణిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు కూడా నమోదైందని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఎస్‌సి, ఎస్‌టి కేసు ఉన్నప్పుడు నేరుగా హైకోర్టుకు రాకూడదని చెప్పింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

ఎల్‌ఓసి వద్ద పేలుడు

పూంచ్ : జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) సమీపంలో బుధవారం మందుపాతర పేలుడు సంభవించింది. దీంతో భద్రతా దళాలు స్వల్ప కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో ఎవ్వరికీ గాయాలు లేదా ప్రాణనష్టం సంభవించలేదు. ఈ విషయాన్ని అధికారులు ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. బుధవారం ఉదయం కృష్ణగతి సెక్టార్‌లో ఈ మందుపాతర పేలుడు ఘటన సంభవించినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం ప్రకారం పాకిస్తాన్ వైపు నుంచి కూడా కాల్పులు జరిగాయి.

మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా
5,6 తేదీల్లో కొచ్చిలో మిడ్‌నైట్ మార్కెట్

కొచ్చి : కేరళలోని మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా ఈ నెల 5,6 తేదీల్లో కొచ్చిలో మిడ్‌నైట్ మార్కెట్‌ను నిర్వహించనున్నారు. నగరంలోని రాజేంద్ర మైదానంలో సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ ఈ మిడ్‌నైట్ మార్కెట్‌ను మహిళా పారిశ్రామిక వేత్తల నెట్‌వర్క్ (డబ్ల్యూఇఎన్) నిర్వహించనుంది. ఈ నెల 5న ఎంపి ఈడెన్ ఈ మార్కెట్‌ను ప్రారంభించనున్నారు. కొజికోడ్, కొట్టాయం, త్రిస్సూర్, తిరువనంతపురంల్లో డబ్ల్యూఇఎన్ విస్తరించి ఉంది. ఇందుల్లో వెయికి పైగా సభ్యులు ఉన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగానూ, అలాగే మహిళలు, చిన్నారులకు భద్రతను నిర్ధారిస్తూ ఉత్సాహభరిత, వినోదాత్మక వాతావరణంలో ఈ మిడ్‌నైట్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. అలాగే ఇందులో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యక్ష సంగీత ప్రదర్శనలు ఉంటాయని, గేమ్ జోన్‌లో ఆటలు, ఈవెంట్స్‌ల్లో సందర్శకులు పాల్గొనవచ్చని చెప్పారు.

కృష్ణ, బీమా నదులకు నీటిని విడుదల చేయండి

- మహారాష్ట్రకు కర్ణాటక సిఎం సిద్ధరామయ్య విజ్ఞప్తి

బెంగళూరు : ఉత్తర కర్ణాటకలోని బెళగావి, విజయపుర, బాగల్‌కోట్, కలబురగి, యాద్గిర్, రాయిచూర్ జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలు తీరేవిధంగా మహారాష్ట్రలోని రిజర్వాయర్ల నుంచి కృష్ణ, బీమా నదులకు నీటిని విడుదల చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం విజ్ఞప్తి చేశారు. వార్నా/కొయినా రిజర్వాయర్ నుంచి కృష్ణా నదికి కనీసం రెండు టిఎంసిల నీటిని, ఉజ్జిని రిజర్వాయర్ నుంచి ఒక టిఎంసిల నీటిని విడుదల చేసే విధంగా సంబంధిత అధికారుల్ని ఆదేశించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను సిద్ధరామయ్య అభ్యర్థించారు. ఉత్తర కర్ణాటకలోని ప్రజల, పశువుల తాగునీటి అవసరాలను తక్షణం తీర్చేవిధంగా చూడాలని కోరారు. ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచి ఉత్తర కర్ణాటక ప్రాంతం తీవ్ర తాగునీటి కొరతను ఎదుర్కొంటుందని సిద్ధరామయ్య తెలిపారు.

భారత పర్యటనలో చిలీ అధ్యక్షులు

న్యూఢిల్లీ : చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ ఫాంట్ భారత్ పర్యటనలో భాగంగా న్యూఢిల్లీకి మంగళవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించినట్లు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు.కాగా, భారత్ పర్యటనలో భాగంగా ఫాంట్ ఢిల్లీలోని మహాత్మాగాంధీ రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'చిలీ మంత్రులు, పార్లమెంటు సభ్యుల బృందం ఈరోజు ఢిల్లీలోని మహాత్మాగాంధీ గౌరవార్థం నిర్మించిన రాజ్‌ఘాట్ వద్ద చేరుకుని ఆయనకు నివాళులర్పించాము. భారతదేశం ఆయన వారసత్వాన్ని గుర్తుచేస్తుంది. ఈ సందర్భంగా మేము ఉమ్మడి ఆసక్తులను పంచుకోవడమే కాదు.. మా ప్రజల భవిష్యత్తు కోసం గొప్ప అవకాశాలనే కాదు.. ప్రాథమిక విలువలను పంచుకున్నాము' అని ఫాంట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. అలాగే రాష్ట్రపతి భవన్‌లో చిలీ అధ్యక్షుడు బోరిక్ ఫాంట్ గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిలీ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

HDFC BANK
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్
శాఖ : 1వ అంతస్తు, శ్రీ హరి టవర్స్, 59ఎ-1-5/1, విజయవాడ-520008.
టెలి : 18002100018/040-66588491, సిఐఎన్ : L65920MH1994PLC080618, వెబ్‌సైట్ : www.hdfcbank.com

స్వాధీనత ప్రకటన

ఏదైతే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("సదరు యాక్ట్") క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ (గతంలో హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ తో సమ్మిళితమైంది తేది 17 మార్చి 2023 గౌరవనీయులైన ఎన్‌సిఎల్‌టి-ముంబై వైడ్ ఆర్డర్ ద్వారా ఆమోదించబడిన విలీనం పథకం ద్వారా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ద్వారా సమ్మిళితమైంది) (హెచ్‌డిఎఫ్‌సి)** యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు జారీచేసి దిగువ రుణగ్రహీత(లు)/చట్టబద్ధ వారసుడు(లు) మరియు చట్టబద్ధ ప్రతినిధి(ల)ను చెల్లింపు మరియు/లేదా రాబట్టుకునే తేదీ వరకు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలైనవాటితో సహా సదరు నోటీసు/ల తేదీ నుండి 60రోజుల్లోగా సదరు నోటీసులలో తెలిపిన విధంగా వర్తింపబడే రేటు వంతున ఆపై వడ్డీతో సహా వారి సంబంధిత పేర్లకు ఎదురుగా తెలిపిన మొత్తాలను చెల్లించవలసిందిగా కోరుచున్నారు.

క్ర. సం.	రుణగ్రహీతలు/ సహ రుణగ్రహీతల పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనత తేది	స్థిరాస్తు(ల)/సెక్యూర్డ్ ఆస్తి(ల) వివరణ
1	శ్రీ.గల్లా మహేష్‌బాబు (రుణగ్రహీత), శ్రీమతి.గల్లా రమాదేవి (సహ రుణగ్రహీత)	రూ.33,53,712/- (ముప్పై మూడు లక్షల యాభై మూడు వేల ఏడు వందల పన్నెండు రూపాయలు మాత్రమే) 30-జూన్-2022 నాటికి బకాయి.	02-AUG-2022	27-మార్చి-2025 (లాంఛనప్రాయ స్వాధీనత)	టి.ఎస్.(వార్డు నం.01 మరియు బ్లాక్ నం.01) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కప్ర మండలం మరియు కప్ర సర్కిల్, జివిఎమ్‌సి పరిధిలోని కప్ర, విరాట్ నగర్ వద్ద ఉన్న సర్వే నం.లు.368 మరియు 399 లోని స్థలంపై భాగంలో **"శ్రీ హను తేజ రెసిడెన్సీ"** యొక్క నాలుగవ అంతస్తులో ఆ రెసిడెన్షియల్ ఫ్లాట్ బేరింగ్ నం.506 మొత్తం తో మున్సిపల్ బేరింగ్ నం.1-1-27/398 మరియు 399/ఎస్‌హెచ్‌టి/506 (పిటిఐఎన్ నం.1010129175) తో బిల్టప్ ఏరియా 960 చ.అ.లు. లేదా 89.18 చ.మీ.లు. తో పాటు సాధారణ ఏరియాలు మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో స్థలం అవిభక్త వాటా 47.00 చ.గ.లు. కు సమానమైన 39.29 చ.మీ.లు. (బయట 4031 చ.గ.లు.కు సమానమైన 3369.91 చ.మీ.లు.) మరియు **హద్దులు : ఉత్తరం** : ఓపెన్ టు స్కై, **దక్షిణం** : కారిడార్, **తూర్పు** : కారిడార్, **పడమర** : ఓపెన్ టు స్కై.

చెల్లింపు తేది మరియు/ లేదా రాబట్టుకునే తేది వరకు వర్తించే విధంగా తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలగునవి.
అయితే, బకాయి మొత్తాలు తిరిగి చెల్లించుటలో ఇందులో పైన రుణగ్రహీత విఫలమైనందున, సదరు రూల్స్ లోని రూల్ 8తో చదవబడే సదరు చట్టం లోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/వారికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ హెచ్‌డిఎఫ్‌సి యొక్క అధీకృత అధికారి/లు ఇందులో పైన తెలిపిన స్థిరాస్తి/సెక్యూర్డ్ ఆస్తిని పైన తెలిపిన తేదీలలో లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారని ప్రత్యేకించి రుణగ్రహీత/చట్టబద్ధ వారసుడు/లు) మరియు చట్టబద్ధ ప్రతినిధి(ల)కు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమైనది.
పై సదరు స్థిరాస్తి(లు)/సెక్యూర్డ్ ఆస్తి(ల)తో వ్యవహరించరాదనియూ, సదరు స్థిరాస్తి(లు)/సెక్యూర్డ్ ఆస్తి(ల)తో జరిపే ఏవేని లావాదేవీలు హెచ్‌డిఎఫ్‌సి యొక్క తనఖాకు లోబడివుంటాయని ప్రత్యేకించి పైన తెలిపిన రుణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు) మరియు చట్టబద్ధ ప్రతినిధి(ల)ను మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.
రుణగ్రహీత(లు)/చట్టబద్ధ వారసుడు(లు) మరియు చట్టబద్ధ ప్రతినిధి(ల)ను జాగ్రత్త ఏమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు మీకు అందుబాటులో ఉన్న సమయంలో చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు పొందుపరచబడినాయి.

ప్రదేశం : హైదరాబాద్
తేది : 01.04.2025

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్., తరుపున
సం/-
అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపత్ మార్గ్, లోవర్ పారెల్ (వెస్ట్), ముంబై-400013.

TATA
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదు కార్యాలయం చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గనపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400013.
శాఖ చిరునామా : డో.నం: 54-15-4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లెరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీసు రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ-520008

స్థిరాస్తి యొక్క విక్రయం కొరకు నోటీసు
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు రూల్ 9(1) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల ఇ-వేలం నోటీసు

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)కి తనఖాగా ఉంచబడిన స్థిరాస్తిని క్రింద వివరించిన స్థిరాస్తిని గురించి సాధారణ ప్రజలుకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత లేదా వారి చట్టపరమైన వారుసులు/ప్రతినిధులు (రుణగ్రహీతలు)లకు దీని ద్వారా నోటీసు ఇవ్వడింది. టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క ఆధీకృత అధికారి తీసుకున్న స్వాధీనం 21.04.2025న దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతలు బకాయిలను రికవరీ చేయడానికి "ఎక్కడ ఉందో అలాగే ఉంది" మరియు "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది" ఆధారంగా. రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ దిగువన పేర్కొనబడ్డాయి. ఏదైనా వాయిదా/విక్రయాలు నిలిపివేయబడినప్పుడు, పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్/ఆస్తి దీని ద్వారా విక్రయించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. ఇ -వేలం 21.04.2025న మ. 2గం.లకు . ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి యొక్క డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలిగి ఉన్న సీల్డ్ ఎన్వలప్‌ను టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ ఆధీకృత అధికారికి బ్రాంచ్ అడ్రసు: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్, డోర్ నెం. 54.15.4సి/1, 5వ అంతస్తు, ఆర్.కె. గల్లెరియా శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్డు, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 వద్ద 19.04.2025, సా.5 గం.ల లోపు సమర్పించాలి.
క్రింద వివరించిన క్లుప్త వివరాల ప్రకారం సురక్షి ఆస్తి/ స్థిరాస్తి విక్రయం "పరిస్థితి ఉన్న చోటనే" ఉంటుంది.

క్ర. సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు) చట్టపరమైన వారసులు/ న్యాయ ప్రతినిధి/ తనఖాదారు(లు) పేరు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వ్ మొత్తం	బయానా మొత్తం	స్వాధీనతా విధానం	24.03.2025 నాటికి బకాయి
3.	10333437 & 10292671	శ్రీ. ఎస్.శ్రీనివాస్ నోరి శ్రీమతి. రాంబిల్లి నాగ పల్లవి	లోన్ అకౌంట్ నం.10333437 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన మరియు బకాయి రూ.20,45,825/- మరియు లోన్ అకౌంట్ నం.10292671 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన మరియు బకాయి రూ.42,66,668/- మరియు 03.06.2023	రూ. 36,00,000/- (ముప్పై ఆరు లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 3,60,000/- (మూడు లక్షల అరవై వేల రూపాయలు మాత్రమే)	భౌతికం	లోన్ అకౌంట్ నం.10333437 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన మరియు బకాయి రూ.27,14,168/- మరియు లోన్ అకౌంట్ నం.10292671 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన మరియు బకాయి రూ.29,52,641/- మొత్తం రూ.56,66,809/-

స్థిరాస్తి వివరణ : ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-520010, కృష్ణాజిల్లా, పటమట సబ్ రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ (అశోక్ నగర్, మేరీ స్టెల్లా కాలేజి ఎదురు) పటమట వద్ద ఉన్న ఫ్లాట్ మూల్యాంకనం నం.605734, బేరింగ్ డో.నం.603019, కొత్త మూల్యాంకనం నం.263666, పాత మూల్యాంకనం నం.34644, ఆర్.ఎస్.నం.8 లో శ్రీ.నోరి సత్య శ్రీనివాస్ పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.3172/2014 "యజ్ఞవాలక్య నివాస్ మరియు మాధవ్ ఎన్‌క్లేవ్" లోని మూడవ అంతస్తులో ఫ్లాట్ నం.టిఎస్-1 మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ తో ప్లింత్ ఏరియా 721 చ.అ.లు., 100 చ.అ.లు. సాధారణ ఏరియా మరియు 125 చ.అ.లు. కార్ పార్కింగ్ తో కలిపి ఉమ్మడి విస్తీర్ణం 46.58 చ.గ.లు. బయట మొత్తం విస్తీర్ణం 400.7 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు : స్థలం సరిహద్దులు : తూర్పు : సుజనమ్మ ఆస్తి 114.0 లిం.లు., దక్షిణం : ఇతరుల ఆస్తి 73.0 లిం.లు., పడమర : గోగినేని ఉమా మహేశ్వరరావు ఆస్తి 113.0 లిం.లు., ఉత్తరం : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు 73.0 లిం.లు., ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : కామన్ కారిడార్, సాధారణ మెట్లకేస్, సాధారణ లిఫ్ట్, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై.
గమనిక : టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ (ఎస్ఎ/252/2024) కు వ్యతిరేకంగా రుణగ్రహీత దాఖలు చేసిన ఎస్ఎ దరఖాస్తు డిఆర్‌టి, విశాఖపట్నం ముందు పెండింగ్‌లో ఉంది, పేర్కొన్న కేసులో టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ కు వ్యతిరేకంగా ఎటువంటి స్టే ఆర్డర్ జారీ చేయబడలేదు.
బిడ్డరుదారులు బిడ్ సమర్పించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించబడ్డారు. వేలం వ్యాజ్యం ఫలితాన్ని బట్టి ఉంటుంది.

వేలంలో, ప్రజలు తమ బిడ్(ల)ని వ్యక్తిగతంగా సమర్పించడానికి సాధారణంగా ఆహ్వానించబడతారు. ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి, ఈ విక్రయానికి సంబంధించి ఏదైనా విధిని నిర్వర్తించకూడదు, అయితే, విక్రయించబడిన స్థిరాస్తిపై ఏదైనా ఆసక్తిని పొందేందుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వేలం వేయకూడదు, సంపాదించకూడదు లేదా సంపాదించడానికి ప్రయత్నించకూడదు.
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో సూచించిన షరతులకు లోబడి ఉండవలెను మరియు తదుపరి షరతులు అనుసరించవలెను :
గమనిక : ఇ-వేలం 21.04.2025న మ.2.00గం.ల నుండి 3.00గం.ల మధ్యన ప్రతి 5 నిమిషాల పొడగింపుతో పోర్టల్ https://auctionbazaar.com ద్వారా జరుగుతుంది.
నియమాలు మరియు నిబంధనలు :
1) దిగువ షెడ్యూల్‌లో ప్రత్యేకంగా పేర్కొన్నట్లుగా క్రింది సంతకందారునికి ఉన్నంత సమాచారం మేరకు సరైనవి, కాని క్రింది సంతకందారుడు ఈ ప్రొక్లేమేషన్‌లో ఏదేని పొరపాటు, మిస్‌స్టేట్‌మెంట్ లేదా లోపానికి సమాధానం ఇవ్వరు. మొత్తం బిడ్ లేదా బిడ్డరుదారుకు ఏదేని వివాదాలు తలెత్తితే, ఆ లాట్ మళ్లీ ఒకసారి వేలం కొరకు ఉంచబడును. 2) ఆస్తిని రిజర్వు ధర కంటే తక్కువ ధరకు విక్రయించబడదు. **3) బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (పది వేల రూపాయాలు).** 4) ఆస్తి కొనుగోలు కోసం సమర్పించిన అన్ని బిడ్‌లు పైన పేర్కొన్న విధంగా ఎర్నెస్ట్ మనీతో పాటు "టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" కి అనుకూలంగా ఉండే డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అందించబడతాయి. చెల్లించవలసిన శాఖ చిరునామా: ఎన్ఈఎఫ్‌టి/ ఆర్‌టిజిఎస్/ ఐఎమ్‌పిఎస్ ద్వారా ఇఎమ్‌డి కోసం, దయచేసి ఆధీకృత అధికారిని సంప్రదించండి. వేలం సఫలీకృతంకాని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగిఇవ్వబడును. 5) అధికృతగల బిడ్డరుదారు బిడ్‌కు చట్టపరంగా అర్హతపొందినగా అన్నివిధాలా కల్పించిన ఏదేని లాట్ కొనుగోలుదారుగా ప్రకటించబడతారు మరియు తదుపరిగా అతని ద్వారా బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫర్‌చేసిన ధర సరిగాలేనట్లుగా స్పష్టంగా కనిపిస్తే అత్యధిక బిడ్ యొక్క క్షీణత అనుమతించుట ఆధీకృత అధికారి యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. 6) రికార్డు అయిన కారణాల కొరకు అమ్మకమును వాయిదా వేయుట/నిలుపివేయుట అనునది 'ఆధీకృత అధికారి' యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. 7) ఆస్తి యొక్క తనిఖీ **11.04.2025న ఉ.11 గం.ల నుండి సా.5.00గం.ల మధ్యలో** ముందస్తు నియామకంతో చేపట్టవచ్చును. 8) కొనుగోలుదారుగా ప్రకటించబడు వ్యక్తి, సదరు డిక్లేరేషన్ తరువాత వెంటనే, కొనుగోలుచేసిన మొత్తం/బిడ్‌లో ఇరవై ఐదు శాతంను 24 గం.లలోపు **'ఆధీకృత అధికారి'**కి డిపాజిట్ చేయవలెను మరియు సదరు డిపాజిట్ విషయంలో విఫలమైన యెడల, ఆస్తి వెంటనే ప్రైవేట్ ట్రీటి ద్వారా తాజా వేలం/అమ్మకానికి ఉంచబడుతుంది. 9) పై విధంగా చేసిన ప్రారంభ డిపాజిట్ విషయంలో, కొనుగోలు యొక్క మిగిలిన మొత్తంను ఆస్తి అమ్మకం నిర్ధారణ తేది నుండి 15వ రోజున లేదా ఆలోగా ఆధీకృత అధికారి కొనుగోలుదారు చెల్లించవలెను, లేదా ఒకవేళ 15వ రోజు ఆదివారం లేదా ఇతర సెలవు రోజువస్తే, 15వ రోజు తరువాత మొదటి రోజున చెల్లించవలెను. 10) పైన పేర్కొన్న సమయంలో ఏదైన విఫలం చెందితే, ప్రైవేట్ ట్రీటి ద్వారా ఆస్తిని తాజాగా వేలం/విక్రయం జరుపబడును. డిపాజిట్ టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఇఎండి సహా వదులుకోవాల్సి ఉంటుంది మరియు విఫలమైన కొనుగోలుదారుడు ఆస్థి దావాలు కోల్పోవలసి ఉంటుంది. 11) పై పట్టిక ప్రకారం ఆస్తికి సంబంధించిన **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి తెలిసినంత వరకు ఏదేని రుణాభారాలు వివరాలు లేవు. ఆస్తి పన్ను, విద్యుత్ మొదలైన చట్టబద్ధమైన బాధ్యతల ప్రాంతాలతో సహా ఆస్తిపై భారాలకు సంబంధించి వారి స్వంత స్వతంత్ర విచారణలు చేయాలని ఉద్దేశించిన బిడ్డర్ సూచించబడ్డారు. **12) ఏదైనా ఇతర వివరాల కోసం లేదా ఇ-వేలం పై ఆన్ లైన్ శిక్షణ కోసం కాబోయే బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ ఎఆర్‌సిఎ ఈ మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్, 6-3-1090/1/1, 2వ అంతస్తు, పార్ట్ బి, ఉమా హైదరాబాద్ హౌస్, రాజ్ భవన్ రోడ్డు, సోమాజిగూడ, హైదరాబాద్-500082, ఇ మెయిల్ ఐడి : contact@auctionbazaar.com / support@auctionbazaar.com లేదా మనిష్ బన్సాల్, ఇ మెయిల్ ఐడి: Manish.bansal@tatacapital.com ని సంప్రదించవచ్చు.** ఆధీకృత అధికారి ఫోన్ నెం. 8588983696, దయచేసి మీ ప్రశ్నను వాట్సప్ నెం. 9999078669 లో పంపండి. **13)** 1% టిడిఎస్ వర్తింబడును మరియు గరిష్టంగా ప్రకటించిన బిడ్ మొత్తం మీద అత్యధిక బిడ్డర్ ద్వారా చెల్లించబడుతుంది. యజమాని/రుణగ్రహీత(లు) యొక్క పాన్‌లో అత్యధిక బిడ్డర్ ద్వారా పేమెంట్ చెల్లించాల్సిన అవసరం ఉంటుంది మరియు ఒక చలాన్ కాపీ మా కంపెనీకి దాఖలు చేయాల్సి ఉంటుంది. 14) పై **వివరాలకు సెక్యూర్డ్ క్రెడిటార్'స్ వెబ్‌సైట్ https://surl.li/nkcxaq లో పొందుపరిచిన క్రింది లింక్‌ను చూడవచ్చు.** 15. దయచేసి **https://www.tatacapital.com/property-disposal.html** లింక్‌ని కూడా సందర్శించండి.
దయచేసి గమనించండి- టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ ఈ ఆస్తి అమ్మకం/ వేలం కోసం పేర్కొన్న వేలం భాగస్వామితో పాటు ఏ బ్రోకర్/ఏజెంట్‌ను నిమగ్నం చేయలేదు. ఆసక్తి ఉన్న పార్టీలు ఈ విషయంలో అన్ని సందేహాలు మరియు విచారణల కోసం దిగువ సంతకం చేసిన ఆధీకృత అధికారిని మాత్రమే సంప్రదించాలి.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 02.04.2025

సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

'ప్రభుత్వ బడిలో విద్యార్థుల్ని చేర్పిద్దాం'

- ఉపాధ్యాయులకు యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచే ప్రక్రియలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించాలని, తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో ఉంచేటట్లు బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు, ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బడి ఈడు పిల్లల్లో 49 శాతం మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదవడం, ప్రైవేట్ బడిలో 51 శాతం పెరగటం ప్రభుత్వ విద్యారంగానికి ప్రమాద ఘంటికలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించడం ద్వారా రాజ్యాంగ ధర్మాన్ని, నైతిక విలువలను అలవర్చుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వివరిస్తూ తల్లిదండ్రులకు, సమాజానికి ప్రభుత్వం బడి పట్ల నమ్మకాన్ని కలిగించాలన్నారు. పిల్లలందరికీ నాణ్యమైన విద్య ఆయా తరగతిలో సామర్థ్య ఆధారిత బోధన అందిస్తామనే భరోసాను, నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించాలన్నారు. ప్రత్యేకించి ప్రతి యుటిఎఫ్ కార్యకర్త ఇంటింటికి వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కోరారు. పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటిస్తూనే ప్రభుత్వ బడులను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్ కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్‌కుమార్, ప్రచురణ విభాగం ఛైర్మన్ ఎం హనుమంతరావు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసరావు, ఎ సుందరయ్య, యుటిఎఫ్ కార్యకర్తలు ఎ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

147 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట/రామభద్రపురం

విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం కొట్టక్కి చెక్ పోస్టు వద్ద 147 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం... కొట్టక్కి చెక్ పోస్టు వద్ద ఫిబ్రవరి పదిన రామభద్రపురం ఎస్ఐ వి ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా కారులో వస్తున్న కొంతమంది పోలీసులను చూసి, కారు విడిచిపెట్టి పరారయ్యారు. కారును తనిఖీ చేయగా 147కిలోల గంజాయి ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. కారుతో పాటు గంజాయి, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారైన నలుగురు నిందితులను సాంకేతికత ఆధారంతో గుర్తించారు. వారిలో ఆనందపురం మండలం దుక్కవానిపాలెం గ్రామానికి చెందిన భోగవిల్లి గోవిందరావు, సగురుపల్లి అనిల్ కుమార్, బంక రామ సురేష్, ఎఎస్ఆర్ జిల్లా ముంచంగిపుట్టి మండలం కిలగడ గ్రామానికి చెందిన అంబిడి బాలరాజు ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అనంతగిరి మండలం శివలింగాపురానికి చెందిన శెట్టి ఉమా మహేశ్వరరావుగా గుర్తించారు. ఆయనపై ఇప్పటికే ఎస్ కోట, విశాఖపట్నం సిటీ, అనంతగిరి, హుకుంపేట పోలీసు స్టేషన్లలో ఎనిమిది గంజాయి కేసులు, రూ.2 కోట్ల ఆస్తులు కూడా అటాచ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఉమా మహేశ్వరరావు జైలులో ఉన్నాడు. పరారిలో ఉన్న నిందితులిద్దరిని అరెస్టు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌పి తెలిపారు.

13 గ్రంథాలయ సంస్థలకు ఇన్‌ఛార్జులుగా జాయింట్ కలెక్టర్లు

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్‌ఛార్జులుగా నియమితులైన జెసిలు ఆయా గ్రంథాలయాల పనితీరు పర్యవేక్షిస్తూ ఇన్‌ఛార్జులుగా 6 నెలలు ఉంటారని, లేదా ఆయా జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్లను నియమించే వరకు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

పార్క్ మెడి వరల్డ్ రూ.1,260 కోట్ల ఇష్యూ

ముంబయి : అక్రెడిటెడ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్వహిస్తున్న పార్క్ మెడి వరల్డ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి దరఖాస్తు చేసుకుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.1,260 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.2 ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయనుంది. ఈ ఇష్యూలో రూ.960 కోట్ల వరకు విలువ చేసే షేర్లను జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ విధానంలో రూ.300 కోట్ల వరకు విలువ చేసే షేర్లను విక్రయించనున్నట్లు ప్రతిపాదించింది.

పబ్లిక్ ఇష్యూకు ప్రోజిల్ గ్రీన్ దరఖాస్తు

ముంబయి : దిగ్గజ సోలార్ ఇపిసి కంపెనీల్లో ఒక్కటైన ప్రోజిల్ గ్రీన్ ఎనర్జీ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రావడానికి సిద్ధం అవుతోంది. ఇందుకోసం మార్కెట్ రెగ్యులేటరీ సెబీకి డిఆర్‌హెచ్‌పి సమర్పించినట్లు ఆ కంపెనీ వెల్లడించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.700 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ2 ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయనున్నట్లు వెల్లడించింది. ఆయా నిధులను దీర్ఘకాలిక నిర్వహణ మూలధన అవసరాలు, నిర్దిష్ట రుణాల చెల్లింపునకు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనున్నట్లు తెలిపింది.

జొమాటాలో 500 మందిపై వేటు

బెంగళూరు : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో వందలాది ఉద్యోగులను ఇంటికి పంపించింది. కస్టమర్ సపోర్ట్ అసోసియేట్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న 500 మందికి పైగా సిబ్బందిని తొలగించింది. వీరిని విధుల్లోకి తీసుకుని ఏడాది కూడా కాలేదని సమాచారం. జొమాటో అసోసియేట్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ పేరిట`స్టమర్ సపోర్ట్ విభాగం కింద 1500 మందిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. చాలా మందిని పేలవమైన పనితీరు, సమయపాలన పాటించని కారణంగా నోటీస్ పీరియడ్ ఇవ్వకుండానే తొలగించిందని తెలుస్తోంది.. వీరందరికీ ఒక నెల జీతాన్ని పరిహారంగా ఇచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

కేర్ హాస్పిటల్స్‌లో ఎఐ ఆధారిత నాన్ ఇన్వేసివ్ చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎఐ ఆధారిత నాన్ ఇన్వేసివ్ చికిత్సను ప్రారంభించినట్లు కేర్ హాస్పిటల్స్ ఓ ప్రకటనలో తెలిపింది. రోగులకు న్యూరో, మూత్ర సంబంధిత, జీర్ణాశయ సంబంధిత సమస్యలకు ఇది అత్యుత్తమ నూతన చికిత్సా విధానమని కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ అఫ్ మెడికల్ సర్వీసెస్, డాక్టర్ నిఖిల్ మాథుర్ తెలిపారు. అమెరికాలో అభివృద్ధి చేయబడిన జోగో హెల్త్ సాంకేతికత, ప్రత్యేకమైన వేరబుల్ ఎలక్ట్రో మయోగ్రాఫీ (ఇఎంజి) సెన్సార్లు, కృత్రిమ మేధస్సు, తక్షణ బయోఫీడ్‌బ్యాక్ ద్వారా నరాల పనితీరును మెరుగుపరిచేలా రూపొందించబడిందన్నారు. ఇది శస్త్రచికిత్సల అవసరాన్ని తగ్గించి, రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు.

సిబిజి ప్లాంట్లతో 2.50 లక్షల ఉద్యోగాలు

- రూ.65 వేల కోట్ల పెట్టుబడి
- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సిబిజి) ప్లాంట్లకు రూ.65 వేలకోట్లు పెట్టుబడి పెడుతుందని, ఫలితంగా 2.50 లక్షల మందికి ఉద్యోగవకాశాలు లభిస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. హరిత ఇంధనాన్ని ప్రోత్సహించేందుకు, బయోఫ్యూయల్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి ఒక కీలక ముందడుగని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్లను రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్లలో ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి హరిత పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తాయని వెల్లడించారు. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.130 కోట్లు వ్యయం అవుతుందని, రోజుకు 22 టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని, దాదాపు 500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో నిరుపయోగంగా ఉన్న దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని ఎనర్జీ ప్లాంటేషన్ కోసం వినియోగించనున్నట్లు చెప్పారు. క్లీన్ ఎపి కార్యక్రమాన్ని బయో ఎనర్జీ ప్రాజెక్టుతో అనుసంధానం చేయడంతో వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఉపాధి పెంపు, ఆర్థిక వృద్ధి వంటి ముఖ్యమైన అంశాల్లో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని చెప్పారు. ప్రకాశం జిల్లా, పిసిపల్లి మండలం, పెద్దర్లపాడు గ్రామంలో ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును ఐటిశాఖ మంత్రి నారా లోకేష్, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు బుధవారం ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా సిఎస్ తెలిపారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్ ఎప్పుడో..!

- మార్చి 26న జిఒ 44 విడుదల
- లబ్ధిదారుల ఎంపికకు విడుదలవ్వని మార్గదర్శకాలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల హామీలను అమలు చేయడంలో టిడిపి కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. నేతన్నలకు ఉచిత విద్యుత్‌పై 2025 మార్చి 26న జిఒ 44 విడుదల చేసిన ప్రభుత్వం అందుకు అమలుకు మార్గదర్శకాలను పేర్కొలేదు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలోనూ మొదటి నెల నుంచి అమల్లోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఉచిత విద్యుత్ ఎప్పటి నుంచి అందుబాటులోకి వచ్చేది తెలియని పరిస్థితి నెలకొంది.

చేనేత కార్మికులకు రెండు వందల యూనిట్లు, పవర్ మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని, నేతన్న నేస్తం కంటే మెరుగైన పద్ధతిలో నేత కార్మికులకు సంక్షేమ ఫలాలు అందిస్తామని టిడిపి కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదుటపడిన తర్వాత ఎన్నికల హామీలను అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ క్రమంలోనే తొమ్మిది నెలల తర్వాత ఉచిత విద్యుత్‌కు జిఒ విడుదల చేసింది. నూతన ఆర్థిక సంవత్సరంలో 2025 ఏప్రిల్ నెల నుంచి పథకం అమల్లోకి వస్తుందని నేతన్నలు ఆశించారు. దీని అమలుకు మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత రాలేదు. కృష్ణా జిల్లాలో 37 చేనేత సొసైటీల్లో 5,720 మందికిపైగా నేత కార్మికులు పనిచేస్తున్నారు. రంగులు అద్దడం, పొడుగులు తోడడం తదితర ఉప వృత్తులపై మరో 2,200 మంది ఆధారపడి జీవిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సొంత మగ్గాలు కలిగిన 4,200 మందికి మాత్రమే నేతన్న నేస్తం అందించారు. తాజాగా జిఒ విడుదలైన నేపథ్యంలో సొంత మగ్గాలు కలిగిన కార్మికులు, సొసైటీల్లో పనిచేసే కార్మికులతోపాటు చేనేత ఉప వృత్తులు చేసే కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందని ప్రచారం జరుగుతోంది. దీనిపై మార్గదర్శకాలు విడుదలైన తర్వాత మాత్రమే లబ్ధిదారుల ఎంపిక గురించి స్పష్టత ఇవ్వగలమని అధికారులు చెబుతున్నారు.

మార్గదర్శకాలు రాగానే లబ్ధిదారుల ఎంపిక
సిహెచ్.సాయిప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్, చేనేత, జౌళిశాఖ, కృష్ణాజిల్లా

నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. త్వరలోనే ఈ పథకం అమల్లోకి వస్తుంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే, వాటి ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక చేపడతాం.

ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- దోషులను కఠినంగా శిక్షించాలి
- క్రైస్తవ సంఘాల భారీ ర్యాలీ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, అసత్యప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మంగళవారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఎవి అప్పారావు రోడ్డులోని నెతన్య చర్చి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ మూడు కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ సాగింది. క్రైస్తవులపై దాడులు అరికట్టాలని, క్రైస్తవులకు, క్రైస్తవ సంఘాలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌డిఒకు క్రైస్తవ సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు బిషప్ డాక్టర్ కె.ప్రతాప్‌సిన్హా రెవరెండ్ డాక్టర్ కె.సుధీర్‌కుమార్, రెవరెండ్ డాక్టర్ జుహాని హలోనిన్, రెవరెండ్ పి.విక్టర్, రెవరెండ్ ఎస్ఎస్‌సి.ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ప్రస్తుతం క్రైస్తవులపై దాడులు పెరిగాయని, చర్చిల్లోకి వచ్చి దుర్భాషలాడుతున్నారని, చర్చిలను కూల్చివేస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆయన మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రవీణ్ మృతిపై మీడియా, సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను అడ్డుకోవాలని కోరారు. విష ప్రచారాన్ని మీడియా ద్వారా వ్యాపింపజేస్తోన్న వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులను, దేవునిగా ఆరాదించే ఏసు క్రీస్తును అసభ్యపద జాలంతో దూషిస్తూ, కించపరిచే మాటలు, బూతులతో అవమానిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెడుతూ తమ మనోభావాలను దెబ్బతీస్తోన్న రాధామనోహర్ దాస్, లలిత్ కుమార్, హమారా ప్రసాద్ తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మత విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తోన్న, కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో డాక్టర్ మోజేష్ బాబు, రెవరెండ్ ఎం.విజయ సారథి, డాక్టర్ జి.జాన్‌ప్రసాద్, రెవరెండ్ డాక్టర్ ఎన్‌జె.షారోన్‌కుమార్, డాక్టర్ నిర్మలప్రశాంత్ కుమార్, ఏ.కనకరాజు, డాక్టర్ సునీత సిన్హా, డాక్టర్ లలిత సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

15 రోజుల్లో 12,500 నీటి తొట్టెల నిర్మాణం

- పిఆర్ అండ్ ఆర్‌డి శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పశువులకు తాగునీటి సమస్య లేకుండా 12,500 నీటి తొట్టెలను రూ.56.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. ఈ నెల 15వ తేదీలోపు వీటి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ నీటి తొట్టెలను నిర్మించనున్నట్లు తెలిపింది. ఈ వేసవిలోనే నీటి తొట్టెలు సంపూర్ణంగా వినియోగంలోకి రావాలని స్పష్టం చేసింది.

పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రైతులకు భరోసా ఇచ్చే విధంగా ఉపాధి హామీ పథకంలో గోకులాలు, పంట కుంటలు వంటి వాటిని నిర్మిస్తున్నట్లు, తాజాగా పశువుల కోసం నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కో నీటి తొట్టె కోసం రూ.45 వేలు వెచ్చించనున్నట్లు తెలిపింది. 12,500 నీటి తొట్టెలతో 25 లక్షల పశువులకు తాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. వీటి నిర్మాణ కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టినట్లు తెలిపింది.

ద్విచక్ర వాహన మెకానిక్‌లకు సంక్షేమ బోర్డు

- మెకానిక్‌ల అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ద్విచక్ర వాహన మెకానిక్‌లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఎపి టూ వీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. అసోసియేషన్ నాయకులు అసిఫ్ అలీ, డి ధర్మ, షేక్ జుబేర్ తదితరులు కార్మికశాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడును సచివాలయంలో మంగళవారం కలిసి మెకానిక్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి మెకానిక్‌లకు ప్రమాద బీమా, వడ్డీ లేని రుణాలు, మరణించిన మెకానిక్‌ల కుటుంబాలకు ఆర్థికసాయం అందించడం వంటి అంశాలను అమలు చేయాలని కోరారు. సంక్షేమ బోర్డు నుంచి గుర్తింపు పొందిన మెకానిక్‌లకు పనిముట్లు, విడిభాగాలు కొనుగోలుకు షూరిటీ ఇవ్వడం, 55 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ మంజూరు చేయడం వంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గంధం చంద్రుడు మాట్లాడుతూ.. తొలుత ద్విచక్ర వాహన మెకానిక్‌లు అందరూ ఇ-శ్రమ కార్డులు పొందాలని సూచించారు. అసోసియేషన్ లేవనెత్తిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

బంగారం @ రూ.94,150

న్యూఢిల్లీ : బంగారం ధర భగ్గుమంటోంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.2,000 ఎగిసి రూ.94,150కి చేరినట్లు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. దీంతో తొలిసారి రూ.94వేల మార్కును దాటినట్లయ్యింది. అమెరికా వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో బంగారంపై పెట్టుబడులను సురక్షితంగా భావిస్తోన్న నేపథ్యంలో ఆ లోహం ధరలు అమాంతం పెరుగుతున్నాయి.

2025లో ఇప్పటి వరకు బంగారం ధర దాదాపు 18 శాతం పెరిగింది. జనవరి 1న రూ.79,390గా నమోదయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.15,000 ఎగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 3,149 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదే స్థాయిలో పెరుగుతోంది. మరోవైపు కిలో వెండిపై రూ.500 తగ్గి రూ.1,02,500గా పలికింది.

జిల్లా విద్యా శిక్షణ సంస్థల్లో డిప్యుటేషన్‌పై అధ్యాపక పోస్టుల భర్తీ

- 16, 17 తేదీల్లో రాత పరీక్ష
- పాఠశాల విద్యా సంచాలకులు విజయరామరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 13 జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లను బలోపేతం చేసేందుకు డిప్యూటేషన్ పద్ధతిలో అధ్యాపకుల భర్తీ చేపడుతున్నట్లు పాఠశాల విద్యా సంచాలకులు విజయరామరాజు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మంగళవారం ఆయన జారీ చేశారు. 2025-26 సంవత్సరానికి అర్హులైన పాఠశాల సహాయకులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు కలిగి ఉండి, స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం ఐదేళ్లు అనుభవం, అభ్యర్థుల గరిష్ట వయసు 58 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి ఏప్రిల్ 10 చివరి తేదీ అని ఆయన తెలిపారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డ్ కాపీని జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా డైట్ ప్రిన్సిపల్‌కు సర్పించాలని సూచించారు.

ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్

ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనరుగా జిల్లా విద్యాశాఖాధికారి, సంబంధిత డైట్ ప్రిన్సిపల్ మెంబరుగా వ్యవహరిస్తారు. ఈ ఖాళీల భర్తీ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఉండనుంది. వచ్చిన దరఖాస్తులు ఈ నెల 11న పరిశీలన, 16, 17 తేదీల్లో రాత పరీక్ష, 19న ఇంటర్వ్యూ, ఎంపికైన వారికి 21న డిప్యూటేషన్ ఆర్డర్లు, 22న కేటాయించిన డైట్ కళాశాలల్లో చేరాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

రాజధాని నిర్మాణంపై కమిటీ వేయాలి

- సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

అమరావతి రాజధాని నిర్మాణం కోసం కమిటీ ఏర్పాటు చేయాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ సూచించారు. రాజధాని కోసం ఖర్చు పెట్టే ప్రతి రూపాయికీ సమాధానం చెప్పాలని, ఏ ఉద్దేశం కోసం ఖర్చు పెడుతున్నామో అది సార్థకం అయ్యేలా ఉండాలని అన్నారు. తన పాత మిత్రులను కలుసుకునేందుకు ఆయన సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ వచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంపై దృష్టి పెట్టినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని గుర్తు చేశారు. ఏదైనా పట్టణానికి ప్రజలు వచ్చి నివసించాలంటే ఆర్థిక అవసరాలు తీర్చేందుకు పనులు సృష్టించబడాలని, ఉద్యోగావకాశాలు కల్పించాలని అన్నారు. నవ నగరాల పేరుతో ఏమేరకు ఉపాధి దొరుకుతుందో అంచనా వేయాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై స్పష్టత రావాలన్నారు. ఎన్నాళ్లుగానో నిరుద్యోగులు ఎదురుచూస్తున్న డిఎస్‌సిని వెంటనే ప్రకటించాలని కోరారు. ముఖ్యంగా ఉగాది రోజున సిఎం ప్రకటించిన పి ఫోర్‌లో ఎమ్మెల్యేలు, ఎంపిలూ భాగస్వాములు కావాలని కోరారు. ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్న సొమ్ములో పది శాతం, పార్టీల వద్ద ఉన్న ఫండ్‌లో కొంత భాగం పి-4కి అందజేయాలని సూచించారు. 18 సీట్లు వస్తే ప్రతిపక్ష హోదా వస్తుందని, 11 సీట్లు సాధించిన వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం సబబు కాదని, ఎన్నికైన ప్రతి ఎమ్మెల్యే అసెంబ్లీకి వచ్చి పూర్తి సమయం కేటాయించాలని కోరారు. అధికార పార్టీ సైతం అసెంబ్లీ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జెడి లక్ష్మీ నారాయణను కాకతీయ అపోలో విద్యా సంస్థల అధినేత కాపా రవీంద్రనాథ్, పర్యావరణ పరిరక్షణ నందిగామ సమితి అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్, చంద్రశేఖర్, బాలాజీ తదితరులు సత్కరించారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు జనసేన మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ముందుకు తీసుకురానున్న వక్ఫ్ సవరణ బిల్లుకు తమ పార్టీ మద్దతు తెలుపుతోందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు జనసేన అధ్యక్షులకు రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్ట సవరణ ముస్లిం సమాజానికి మేలు చేస్తుందని జనసేన విశ్వసిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు లోక్‌సభలోని జనసేన ఎంపిలకు పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ దిశా నిర్దేశం చేశారన్నారు. బిల్లుకు అనుకూలంగా ఓటింగ్‌లో పాల్గొనాలని ఎంపిలకు సూచించారని పేర్కొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ నెల 6వ నుండి 14వ తేదీ వరకు జరగనున్న శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సుప్రభాతం, అర్చన అనంతరం ఎనిమిది గంటల నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుని ఆలయ ప్రాంగణలు నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం యాత్రికులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాహన సేవల వివరాలు..

ఈ నెల ఆరున ఉదయం ధ్వజారోహణం (వృషభ లగ్నం) రాత్రి శేష వాహనసేవ, ఏడున ఉదయం వేణుగానాలంకారం, రాత్రి హంస వాహన సేవ, ఎనిమిదిన ఉదయం వటపత్రశాయి అలంకారం, రాత్రి సింహ వాహన సేవ, తొమ్మిదిన ఉదయం నవనీత కృష్ణాలంకారం, రాత్రి హనుమత్సేవ, పదిన ఉదయం మోహినీ అలంకారం, రాత్రి గరుడసేవ, 11న ఉదయం శివధనుర్భాణ అలంకారం, రాత్రి కల్యాణోత్సవం, గజడ వాహన సేవ, 12న ఉదయం రథోత్సవం, 13న ఉదయం కాళీయమర్ధనా లంకారం, రాత్రి అశ్వవాహన సేవ, 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం. 15న పుష్పయాగం కార్యక్రమాలుంటాయి.

ఆందోళనకరంగానే ఫార్మా విద్యార్థిని ఆరోగ్యం

- విబి ఇంజక్షన్ స్వయంగా చేసుకునే అవకాశంలేదు
- రాజమండ్రి మెడికల్ కాలేజీ హెచ్‌ఒడి సత్యనారాయణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

లైంగిక వేధింపుల నేపథ్యంలో విబి10ఎంజి ఇంజక్షన్ తీసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఫార్మా విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ జనరల్ మెడిసన్ హెచ్‌ఒడి డాక్టర్ పివి సత్యనారాయణ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు తమ బృందం గత నెల 28 నుంచి ఫార్మా విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని పరీక్షిస్తోందని తెలిపారు. కిమ్స్ వైద్యుల బృందం తమకు సహకరిస్తోందన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. గత నెల 30 వరకు ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, తరువాత నుంచి ఆర్గాన్ ఫంక్షన్స్ తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ప్రస్తుతం రక్తంలో ఇన్‌ఫెక్షన్స్ గుర్తించామని చెప్పారు. గుండె, మూత్రపిండాలు తదితర అవయవాల పనితీరు మెరుగ్గా లేదన్నారు. విబి 10 ఎంజి ఇంజెక్షన్ తానే స్వయంగా చేసుకునే అవకాశం ఉందా..? అనే ప్రశ్నకు ఆయన బదులిస్తూ... ఈ ఇంజెక్షన్ నరాలకు చేసుకోవాల్సి ఉందని, స్వయంగా చేసుకునే అవకాశం లేదని తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ సాయినీలిమ మాట్లాడుతూ బ్రెయిన్ కొంత మేర డేమేజ్ అయ్యిందని, ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయని, ఫలితంగా తరచూ జ్వరం వస్తోందని చెప్పారు. ఈ స్థితిలో రోగి కోలుకోవడం కష్టమన్నారు. తొమ్మిది రోజులుగా ఆమె వెంటిలేటర్‌పై ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆమెను మరో చోటుకు తరలించడం సాధ్యం కాదని, అది ప్రాణాలకే ప్రమాదమని స్పష్టం చేశారు. ఎనస్తీషియా వైద్యులు ఎస్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మా విద్యార్థిని తీసుకున్న విబి 10 ఎంజి ఇంజక్షన్‌ను సర్జరీ చేసే క్రమంలో మజిల్ రిలాక్సేషన్ కోసం ఉపయోగిస్తారని తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో ఈ ఇంజక్షన్ ఇస్తామని, ఇచ్చిన రెండు నిమిషాల్లోనే ఆక్సిజన్ అందిస్తామన్నారు. ఈ ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత ఆక్సిజన్ అందించడం ఆలస్యమైతే బ్రెయిన్‌పై ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్‌ఒ ఎన్.వసుంధర, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సుధాకర్, ఎన్‌టిఆర్ వైద్య సేవ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రయాంక పాల్గొన్నారు.

వామపక్షాల పూర్వ వైభవానికి కృషి

- రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతాం
- మహిళల ప్రాతినిధ్యం పెంచుతాం
- పార్టీలో కొత్త వారికీ బాధ్యతలు
- రాష్ట్రాల స్థాయిలోనే సర్దుబాట్లు
- సిపిఐ (ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

న్యూఢిల్లీ : పార్టీ రాజకీయ ప్రభావాన్ని, ప్రజల మద్దతును విస్తరింపజేసుకోవడం దృష్టి సారిస్తామని సిపిఐ (ఎం) సీనియర్ నేత, సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్‌లో సంప్రదింపులు లోపించాయని, అవి కొనసాగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. పార్టీలో పాత తరంతో పాటు కొత్త తరానికి బాధ్యతలు అప్పగిస్తామని, పాత కొత్తల కలయికగా కమిటీల కూర్పు ఉంటుందని చెప్పారు. పార్టీ కమిటీలలో మహిళలకు ప్రాతినిధ్యం పెంచుతామని అన్నారు. అఖిలభారత మహాసభలలో ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు రూపొందించుకొని వాటి ప్రకారం ముందుకు సాగుతామని తెలిపారు. పూర్వ వైభవం కోసం వామపక్షాలన్నీ కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఎన్నికల పొత్తులు అనేవి రాష్ట్రాలను బట్టి మారుతుంటాయని చెప్పారు. తమిళనాడులోని మదురైలో పార్టీ అఖిలభారత మహాసభలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రతినిధి పర్వేజ్ సుల్తాన్‌కు కరత్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అనేక అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఆ విశేషాలు...

మదురై మహాసభలలో పార్టీ నాయకత్వంలో ఎలాంటి మార్పులు జరుగుతాయి? కేంద్ర కమిటీలో ఎక్కువ మంది యువ నేతలకు స్థానం కల్పిస్తారా?

ముఖ్యమైన కమిటీలకు సంబంధించి పార్టీలో మాకు ఓ విస్తృత విధానం ఉంది. కొనసాగింపులు, మార్పుల మధ్య మేము సమతూకం పాటిస్తాము. అన్ని పార్టీ మహాసభలు లేదా అఖిలభారత మహాసభలలో కొందరు వృద్ధ నేతలు బాధ్యతల నుండి తప్పుకుంటారు. కొందరు కొత్త వ్యక్తులు వస్తారు. అంటే దాని అర్థం వృద్ధ నేతలు బయటికి పోతారని కాదు. నేను చెప్పినట్లు పాత తరం వారిని కొనసాగిస్తూనే మార్పులు చేసుకుంటాం. అంటే పాత కొత్తల కలయిక అన్న మాట. ఈ మహాసభలలో మేము ఈ సూత్రాన్ని అనుసరిస్తాము. కేంద్ర కమిటీకి, పొలిట్‌బ్యూరోకు జరిగే ఎన్నికలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. మా ప్రధాన కార్యదర్శి లేకుండానే ఈసారి జాతీయ మహాసభలు జరుపుకుంటున్నాము. గత ఏడాది సెప్టెంబరులో ఆయన హఠాత్తుగా కన్నుమూశారు. కాబట్టి ప్రధాన కార్యదర్శిని కూడా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

సమీప భవిష్యత్తులో మీ పార్టీకి మహిళా ప్రధాన కార్యదర్శి ఉంటారా?

పురుషుడు లేదా మహిళ, వయసు ఇవేవీ అర్హతలు కాబోవు. ఆ బాధ్యతను చేపట్టడానికి అత్యంత సమర్థులు ఎవరనే అంశాన్నే కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో స్థాయిలో పార్టీ పరిశీలిస్తుంది.

ప్రస్తుత కేంద్ర కమిటీలో 85 మంది సభ్యులు ఉంటే వారిలో 15 మంది మహిళలు. ఈసారి కమిటీలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం ఉంటుందా?

అవును. సంఖ్య కంటే మహిళా శాతాన్ని పెంచాలని కేంద్ర కమిటీలో మేము నిర్ణయించాం. కమిటీ పరిమాణాన్ని, అందులో మహిళల సంఖ్యను, మహిళా శాతాన్ని పెంచుతాం.

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా కొందరు నేతల వయో పరిమితి నిబంధనను మారుస్తారా?

పినరయి విజయన్ కేరళ ముఖ్యమంత్రిగా ఉన్నందున గత మహాసభలలో మినహాయింపు ఇవ్వడం జరిగింది. ఆయన ప్రభుత్వంలో కొన్ని ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. కాబట్టి ఆయన పార్టీలో ఉన్నత నాయకత్వ స్థానంలో ఉండాలి. ఆ విషయాన్ని అప్పుడు పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఇప్పుడు దానిని తాజాగా పరిశీలిస్తాం. ఏదైనా మినహాయింపు ఇవ్వాల్సి ఉంటే మదురై సమావేశాలలో చర్చిస్తాం.

ఎన్నికల రాజకీయాలలో ఏది ముఖ్యమని అనుకుంటున్నారు? పిడివాదమా? లేక ఆచరణాత్మక వైఖరా?

ఏదీ కాదు. మాకు, మా పార్టీకి సంబంధించినంత వరకూ రాజకీయ వ్యూహాత్మక వైఖరితోనే వెళతాం. దానిని మా పార్టీ మహాసభలు నిర్ణయిస్తాయి. మా ఎన్నికల వ్యూహాలు దాని పైనే ఆధారపడి ఉంటాయి. పట్టు విడుపులు లేని వైఖరి కావచ్చు లేదా ఆచరణాత్మకమైనది కావచ్చు. అది మా అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు బిజెపిని ఒంటరిని చేసి ఓడించడమే మా ప్రధాన లక్ష్యమని మేము నిర్ణయిస్తే ప్రతి రాష్ట్రంలో ఒక నిర్దిష్ట పరిస్థితికి దానిని వర్తింపచేస్తాము. మేము దానిని ఎలా వర్తింపజేస్తాము ఎలా అమలు చేస్తాం? మా ఎన్నికల వైఖరిని లేదా ఎత్తుగడలను రూపొందించుకొని దానికి అనుగుణంగా నడుచుకుంటాం.

ఇండియా బ్లాక్ పరిస్థితి ఏమిటి? భాగస్వాముల మధ్య చర్చలను తిరిగి ప్రారంభించేందుకు మీ పార్టీ చొరవ తీసుకుంటుందా?

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా బ్లాక్‌తో ఎలా ముందుకు సాగాలన్న విషయంపై స్పష్టత లేదు. పార్లమెంటులో ఇండియా బ్లాక్ పార్టీలు అన్ని అంశాలు, విధానపరమైన విషయాలలో సహకరించుకుంటున్నాయి. కానీ బయట మాత్రం సంప్రదింపులు జరగడం లేదు. అలాంటి సంప్రదింపులు అవసరం. అన్ని విషయాలనూ నిర్ణయించే పని మాది కాదు. మేము అలాంటి బలమైన శక్తిగా లేము. కానీ అన్ని పార్టీలు కలిసి కూర్చొని చర్చించుకొని ఎలా ముందుకు సాగాలన్న దానిపై కొంత ఉమ్మడి అవగాహనకు రావాలని మేము కోరుకుంటున్నాము. లోక్‌సభ ఎన్నికలు జరిగి తొమ్మిది మాసాలు అయింది. అయినా ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. అందుకే ఇండియా బ్లాక్‌కు ఓ దిశ అంటూ లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎందుకంటే భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి చర్చలు జరపడం లేదు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నిటికీ విశాలమైన ఐక్యవేదిక ఏర్పాటుకు మేము కృషి చేస్తాం.

రాష్ట్రాల స్థాయిలో కాంగ్రెస్‌తో ఏమైనా అవగాహన ఉన్నదా?

రాబోయే నాలుగు సంవత్సరాలలో లోక్‌సభకు ఎన్నికలు జరగవు. ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఎన్నికలు మాత్రమే జరుగుతాయి. ఆయా రాష్ట్రాలలోని రాజకీయ శక్తుల మధ్య ఉన్న సంబంధాలను బట్టి బిజెపి వ్యతిరేక లేదా బిజెపి యేతర పార్టీలు చేరువయ్యేందుకు ప్రయత్నించాలి. పొత్తులు అనేవి అన్ని రాష్ట్రాలలో ఒకేలా ఉండవు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంటాయి. బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. అక్కడ ఇప్పటికే మహాఘట్‌బంధన్ (మహా కూటమి) ఉంది. అది ఇండియా బ్లాక్‌లోనే ఉంది. ఆ కూటమి కొనసాగుతుంది. కొన్ని కొత్త శక్తుల చేరికతో మరింత బలపడవచ్చు కూడా. కాబట్టి రాష్ట్రాన్ని బట్టి సీట్ల సర్దుబాటు లేదా అవగాహనలు ఉంటాయి. వచ్చే సంవత్సరం తమిళనాడులో ఎన్నికలు జరుగుతాయి. డిఎంకె నేతృత్వంలో ఇప్పటికే అక్కడ కూటమి ఉంది. అది కొనసాగుతుంది. జాతీయ స్థాయిలో ఏం జరుగుతుందన్న దానిపై అది ఆధారపడి ఉండదు. కాబట్టి రాష్ట్ర స్థాయిలో అలాంటి అవగాహనలను కుదుర్చుకోవడం జరుగుతుంది.

కేరళలో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ప్రభావం పెరుగుతోందంటూ వస్తున్న నివేదికలపై ఏమంటారు?

అవును. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సమీక్ష జరిపినప్పుడు మొత్తంగా దక్షిణాదిలో అది కొన్ని విజయాలు సాధించిందని మేము గుర్తించడం జరిగింది. కేరళలో కూడా ఎన్డీయేకు వచ్చిన ఓట్ల శాతంలో అది కన్పించింది. బిజెపి, కొన్ని చిన్న పార్టీలతో కూడిన ఎన్డీయే 19 శాతం ఓట్లు సాధించింది. మొదటిసారిగా వారికి చాలా ఓట్లు వచ్చాయి. అయితే లోక్‌సభ ఎన్నికల ఫలితాల మాదిరిగానే రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు కూడా ఉంటాయని మేము అనుకోవడం లేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల కార్యకలాపాల ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై ఇప్పటికే చర్చించాం.

వామపక్షాల ఐక్యత గురించి సిపిఐ (ఎం) కొంతకాలంగా మాట్లాడుతోంది. ఆ ఐక్యతకు సిపిఐ, సిపిఐ (ఎంఎల్) అడ్డు వస్తాయని భావిస్తున్నారా?

లేదు. వారేమీ అడ్డు రారు. బెంగాల్, త్రిపురలో మేము బలహీనపడిన తర్వాత దేశ రాజకీయాలలో మా ప్రభావం తగ్గిపోయిందన్నది వాస్తవం. కాబట్టి అప్పుడు ఉన్న వామపక్షాల ఐక్యత ఇప్పుడు బలహీనపడింది. అందువల్ల ఇప్పుడు మొత్తంగా వామపక్షాలకు పూర్వ వైభవం తేవడానికి మేము ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. అది సిపిఐ (ఎం) మాత్రమే చేసే పని కాదు. మాకు వామపక్షాల ఐక్యత కావాలి. ఉమ్మడి ప్రయత్నాలు,ఉమ్మడి కార్యకలాపాలు, ఉమ్మడి ఉద్యమాలు అవసరం. అందుకోసం కూడా మేము కృషి చేస్తున్నాము. బడ్జెట్ తర్వాత మేము దేశవ్యాప్త నిరసనలకు పిలుపు ఇచ్చాం. బడ్జెట్ కేటాయింపులపై ప్రచారం నిర్వహించాం. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను గతంలో కలిసే వ్యతిరేకించాం. అనేక అంశాలపై వామపక్ష పార్టీలు సంఘటితంగానే ముందుకు సాగుతున్నాయి. కానీ దానిని మరింత విస్తృతం చేయాలని భావిస్తున్నాము. మా అఖిల భారత మహాసభల అనంతరం నూతనోత్సాహంతో ఈ అంశాన్ని చేపడతాం.

గుజరాత్ బాణసంచా గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం

- 18 మంది మృతి

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా దీసా పట్టణంలోని ఓ బాణసంచా గిడ్డంగిలో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోగా ఐదుగురు గాయపడ్డారు. దీపక్ ఫైర్‌క్రాకర్స్ సంస్థకు చెందిన బాణసంచా తయారీ యూనిట్‌లో పలువురు కార్మికులు పని చేస్తుండగా ఉదయం 9.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన తర్వాత ఆరు గంటల వరకూ అగ్నికీలలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. వాటిని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది చాలా శ్రమ పడాల్సి వచ్చింది. గిడ్డంగిలో బాణసంచా తయారీ సామగ్రిని పెద్ద ఎత్తున నిల్వ చేశారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నాలుగు లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి యాభై వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు.

భారత్, చైనా దౌత్య బంధానికి 75 ఏళ్లు !

- పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలన్న ద్రౌపది ముర్ము
- కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న జిన్‌పింగ్

న్యూఢిల్లీ/బీజింగ్ : భారత్, చైనా మధ్య దౌత్య బంధానికి 75 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ మంగళవారం అభినందన సందేశాలు పరస్పరం పంపుకున్నారు. భారత్, చైనా రెండూ ప్రాచీన నాగరికతలు కలిగిన దేశాలని, ప్రధాన వర్ధమాన దేశాలని, గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్య దేశాలని ఇరువరు నేతలు పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు వాటి ఆధునీకరణ ప్రయత్నాల్లో కీలకమైన దశలో వున్నాయని వ్యాఖ్యానించారు.

ప్రపంచ జనాభాల్లో మూడో వంతు జనాభా భారత్, చైనాల్లోనే వున్నారని రాష్ట్రపతి ముర్ము అన్నారు. సుస్థిరమైన, విశ్వసనీయమైన, స్నేహంతో కూడిన ద్వైపాక్షిక సంబంధాలు ఇరు దేశాలకే కాకుండా యావత్ ప్రపంచానికి లబ్ది చేకూరుస్తాయని ఆమె తెలిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత స్థిరంగా ముందుకు తీసుకెళ్ళడానికి కలిసి కృషి చేయాలని అందుకు ఈ 75ఏళ్ళ వార్షికోత్సవాన్ని ఒక అవకాశంగా తీసుకోవాలని ముర్ము కోరారు.

పరస్పర లక్ష్య సాధనల్లో భాగస్వాములుగా వుండేందుకు, డ్రాగన్-ఏనుగు బంధాన్ని సాకారం చేయడానికి చైనా, భారత్‌లకు ఇది సరైన ఎంపిక అని ఇరు దేశాల మధ్య సంబంధాల అభివృద్ధితో స్పష్టమవుతోందని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. శాంతియుత సహజీవనం, పరస్పర విశ్వాసం, పరస్పర ప్రయోజనాలు, ఉమ్మడి అభివృద్ధితో కూడిన పంథాను అనుసరించాల్సి వుందన్నారు. బహుళ ధృవ ప్రపంచాన్ని, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలని కోరారు. ఈ దిశగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా వున్నామని జిన్‌పింగ్ చెప్పారు. చైనా-భారత్ సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతలను ఉమ్మడిగా పరిరక్షించాలన్నారు.

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, చైనా ప్రధాని లీ కియాంగ్ కూడా పరస్పరం అభినందన సందేశాలు పంపుకున్నారు. మానవ చరిత్ర గమనానికి ఒక రూపునివ్వడంలో ఇరు దేశాలు కీలక పాత్ర పోషించాయని మోడీ పేర్కొన్నారు. శాంతి, అభివృద్ధి కూడా పెంపొందించే బృహత్తర బాధ్యతలను భుజానకెత్తుకోవాల్సి వుందన్నారు. ఇరు దేశాల ప్రజలకు మరింత ఉపయోగపడేలా ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్ళాలని కియాంగ్ కోరారు.

సిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సిబిసిఐడి మాజీ చీఫ్ సంజయ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. అగ్నిమాపక విభాగంలో జరిగిన అవినీతి కేసులో సంజయ్‌పై ఎపి ప్రభుత్వం ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసింది. అయితే ఈ కేసులో సంజయ్‌కి రాష్ట్ర హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ప్రభుత్వ పిటిషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ పికె మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వ పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేయాలని సంజయ్‌ను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను నెలాఖరుకు వాయిదా వేసింది.

మత్స్యకారులకు నేరుగా సహాయం అందించాలి

- లోక్‌సభలో టిడిపి ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మత్స్యకారులకు నేరుగా సహాయం అందించాలని లోక్‌సభలో టిడిపి ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణ దేవరాయలు డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంపై ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ చేపల రైతులు, ఫిష్ ఎంట్రప్రెన్యూలకు మద్దతు ఇవ్వడం కోసం తీసుకొచ్చిన ఈ పథకంలో ఫండింగ్ ఎక్కువ భాగం రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించబడుతోందన్నారు. దీంతో రైతులకు ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరడం లేదని, కావున దీనిపై దృష్టి సారించాలని కేంద్రాన్ని కోరారు.

'మనీ-మను' వాదాలపై పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పేవారని, ఆ మాటలను జ్ఞాపకం ఉంచుకోవాలని ఆమె అన్నారు. బుధవారం నుండి ప్రారంభం కానున్న 24వ మహాసభ స్ఫూర్తిదాయకమైన ఈ మాటల వెలుగులోని జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చిస్తుందని చెప్పారు. కార్పొరేట్, మనువాద, మతోన్మాద విధానాలను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రత్యామ్నాయాన్ని అందిస్తామని అన్నారు. స్వాతంత్ర సమరంలోనూ, ఆ తరువాత పేద ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయాలను సాధించి తీరుతామని చెప్పారు.

ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం

అంతకుముందు భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సీనియర్ జర్నలిస్టు ఎన్.రామ్ మాట్లాడుతూ అత్యంత కీలకమైన సందర్భంలో 24వ మహాసభ జరుగుతోందని అన్నారు. కార్పొరేట్ దోపిడీతోపాటు విషం చిమ్ముతున్న మతోన్మాదం దేశ ప్రజానీకానికి శత్రువులుగా మారాయని అన్నారు. అధికారబలంతోనూ, తప్పుడు ప్రచారాలతోనూ ఆ శక్తులు ప్రజలను మభ్యపరుస్తున్నాయని అన్నారు. అయితే, ఈ పరిస్థితి ఎల్లకాలం ఉండదని, దేశంలో లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ముందుకొచ్చే రోజులు త్వరలోనే వస్తాయని అన్నారు. అయితే, ఆ పరిస్థితి రావాలంటే వామపక్షాలు బలపడాలని, ముఖ్యంగా సిపిఎం బలం భారీగా పెరగాలని ఆయన ఆకాంక్షించారు. సిపిఎం విడుదల చేసిన రాజకీయ ముసాయిదా తీర్మానంపై దేశవ్యాప్తంగా ఇప్పటికే విస్తృతంగా చర్చ జరుగుతోందని, మహాసభలో మరింతగా మేథోమధనం జరిగి దేశానికి నూతన దిశను చూపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి షణ్ముగం, స్థానిక ఎంపి వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

అమరజ్యోతులివే....

కిల్వెన్మణి అమరవీరుల త్యాగానికి, వారి పోరాటానికి గుర్తుగా ఈ జ్యోతిని తీసుకువస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నం జిల్లాలోని ఒక గ్రామం ఇది. 1968 డిసెంబర్ 25న సమ్మె చేస్తున్న దళిత కార్మిక కుటుంబాలకు చెందిన 44 మందిని స్థానిక భూస్వాములు దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన తీవ్ర ప్రభావం చూపింది. ప్రజలు పెద్ద ఎత్తున కదిలారు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పులు అనివార్యంగా మారింది. ఈ ప్రాంతంలో పేద ప్రజలకు భూ పంపిణీ చేయడానికి ఈ పోరాటం దారితీసింది. సిపిఎం వారికి అండగా నిలిచింది. పోరాటం రోజుకు తీవ్రమై పొరుగు గ్రామాలకు విస్తరించడం ప్రారంభమైంది. ఇది సహించలేని స్థానిక పెత్తందారులు రెచ్చిపోయారు. కిరాయి మూకలతో అనూహ్యంగా దాడికి దిగారు. దీనిని ప్రతిఘటించానికి దళిత కార్మికులు, మహిళలు చేసిన పోరాటం ఏ మాత్రం ఫలితమివ్వలేదు. పారిపోయిన వారిని వెంటాడి నరికారు. హింసాకాండకు భయపడి గుడిసెలో దాక్కున్నా పెట్రోలు పోసి తగలపెట్టారు. ఈ సంఘటనలో అభం, శుభం తెలియని పసిమొగ్గలు కూడా బూడిదకుప్పగా మిగిలారు. అయితే, వీరి త్యాగం వృథా కాలేదు. ఆ తరువాత కూలి రేట్లు పెరిగాయి. భూ పంపిణీ జరిగింది. ఈ మహత్తర పోరాటానికి, త్యాగాలకు గుర్తుగా కిల్వేన్మణి గ్రామం నుండి తీసుకువచ్చిన అమరవీరుల జ్యోతిని మహాసభ ప్రాంగణం వద్ద నేతలకు అందజేశారు. అమరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రతినచేశారు.

సేలం అమరుల స్ఫూర్తితో...

సేలం జైలులో 1950 ఫిబ్రవరి 11న జరిగిన అమానుష సంఘటన ఇది. భూ స్వాములకు, వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టులను, కిసాన్‌సభ కార్యకర్తలను, వ్యవసాయ కార్మికసంఘం నేతలను పోలీసులు అరెస్ట్ చేసి సేలం జైలులో కుక్కిన రోజులవి. తమిళనాడుతో పాటు, మలబారు, ఆంధ్ర ప్రాంతాలలోని నాయకులను ఇక్కడ నిర్బంధించారు. ఆ సమయంలోనే కమ్యూనిస్టు పార్టీని నిషేధించారు. దీంతో రాజకీయ ఖైదీలను ముఖ్యంగా కమ్యూనిస్టులపై జైలు సిబ్బంది అమానుషంగా ప్రవర్తించేవారు. నేరాలు చేసిన సాధారణ ఖైదీలలో కలిపి ఉంచడంతోపాటు, వారి తరహా డ్రస్సే ధరించాలని, వారికి అమలు చేసే నిబంధలనే అమలు చేస్తామని జైలు అధికారులు చెప్పారు. దీనిని కమ్యూనిస్టులు తిరస్కరించారు. ఇది కాస్తా ఆందోళనగా మారింది. ఫిబ్రవరి11న డిప్యూటీ జైలర్ నేతృత్వంలో పోలీసులు విరుచుకు పడ్డారు. ఒక్కసారిగా కాల్పులు జరిపారు. దీంతో 22 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 17 మంది అక్కడికక్కడే మరణించగా మిగిలిన వారు చికిత్సపొందుతూ ప్రాణాలు విడిచారు. మరణించిన వారిలో 19 మంది కేరళ, ఇద్దరు తమిళనాడు, ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. వారి స్ఫూర్తితో సేలం నుండి జ్యోతిని మహాసభ ప్రాంగణానికి తీసుకువచ్చారు

అభినవ భగత్‌సింగ్‌లు...

అవును వారు అభినవ భగత్‌సింగ్‌లే... ప్రాణాలు పోతున్నా, ఉరితాడుకు వేలాడుతున్నా ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినదించారు. కార్మిక వర్గ విప్లవాన్నే తుది శ్వాసలోనూ శ్వాసించారు. టెక్స్‌టైల్ రాజధానిగా పేచుగాంచిన కోయంబత్తూరులో ఈసంఘటన జరిగింది. మిల్లు కార్మికుల హక్కుల కోసం నిలబడినందుకు, ఒక మహిళా కార్మికురాలిపై జరిగిన అఘాయిత్యాన్ని ప్రశ్నించినందుకు కార్మికులు రామయ్యన్, రంగనాన్, వెంకటాచలం, చిన్నయ్యర్‌లను పోలీసులు నిర్బంధించారు. వారిపై రకరకాల నేరాలు మోపారు. హింసాకాండకు పాల్పడ్డారని, మహిళపై అఘాయిత్యానికి కూడా వారే పాల్పడ్డారని ఆరోపించారు. దీనిని ఆ మహిళ ఖండించింది. కోయంబత్తూరులోని మిల్లు వర్కర్లు అందరూ ఆగ్రహోదగ్రులయ్యారు. నిరవధిక సమ్మెకు దిగారు. కేసు విచారించిన ప్రివ్యూ కౌన్సిల్ ఆ నలుగురికి ఉరిశిక్ష విధించింది. అయితే, ఆ నలుగురిలో నేరం చేసిన ఒక్కరి పేరు చెబితే మిగిలిన వారికి క్షమాభిక్ష పెడతామని ప్రకటించింది, దీనిని వారు తిరస్కరించారు. కార్మికవర్గ ఐక్యత నినాదాలు చేస్తూ ఉరికంభంపై ఒకేసారి ప్రాణాలు వదిలారు. .

విద్యార్థి అమరులు...

విద్యార్థి వీరులు, ఆశయాల ధీరులు, కులవివక్షపై ఎక్కుపెట్టిన బాణాలు, అవినీతి అంతం చూసేంతవరకు విశ్రమించని యోధులు, ఈ లక్షణాలే సోమసుందరం, సోమలింగంపై శత్రు మూకల కన్ను పడటానికి కారణం. ప్రస్తుతం సిపిఎం మహసభ జరుగుతున్న మదురై పట్టణానికి సమీపంలోని ఒక చిన్న గ్రామంలో దళిత కుటుంబంలో ఒకే సంవత్సరం వీరు పుట్టారు. బాల్యం నుండి చదువులో ముందు ఉండటంతో పాటు, వివక్షను గట్టిగా ప్రశ్నించేవారు. ఇది అగ్రకులాల వారికి నచ్చేదికాదు, మదురైలోని తియ్యగర్జార్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరిన తరువాత కూడా వారిది పోరాటబాటే. దానికి తగ్గట్టే కళాశాల అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్‌ఎఫ్‌ఐ తరపున భారీ మెజార్టీతో గెలిచారు. ఇది ఏమాత్రం సహించలేని మనువాద, అగ్రకుల విద్యార్థులు కళాశాల బయట వారిని వెంటాడి మార్చి 31 1981న వేటకొడవళ్లకు బలిచేశారు. వారి ఆశయాల కొనసాగింపును ప్రతిన చేసిన విద్యార్థి ఉద్యమం వారి పేర్లతో ఒక జ్యోతిని ప్రజా పోరాటాల వేదిక వద్దకు తీసుకు వస్తోంది.

తాగునీటి కోసం...

పేద ప్రజలకు తాగునీటి కోసం పోరాటం చేసి, ఆ పోరాటంలో భాగంగానే అమరులైన సిపిఎం కౌన్సిలర్ కామ్రేడ్ లీలావతితో పాటు మదురై నగరంలో ప్రజల కోసం ప్రాణాలు విడిచిన ఎందరో అమరుల స్థూపాల నుండి జ్యోతిని మహాసభ ప్రాంగణం వద్దకు తీసుకువస్తున్నారు. లీలావతి 1996 అక్టోబర్‌లో మదురై నగరంలో సిపిఎం తరపున వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అప్పటి నుండి ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చడం కోసం ఆమె అనేక పోరాటాలు చేశారు. దీనిని తాగునీటి మాఫియా తీవ్రంగా అడ్డుకుంది. ఆమెపై అనేక దాడులు చేసింది. చివరకు తాగునీటి పథకానికి ఆమోదం పొందడంతో నిధులను కూడా సాధించింది. ఆ పథకం ప్రారంభోత్సవానికి మూడు రోజుల ముందు ఆమెను మాఫియా హత్య చేసింది. దీంతో నగరంలో తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అంతిమయాత్రలో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ఆమె జ్ఞాపకార్థం తీసుకువస్తున్న అమరవీరుల జ్యోతికి కూడా అదే విధమైన స్పందన కనిపించింది.

2020 నాటి అల్లర్ల కేసులో... ఢిల్లీ న్యాయ శాఖ మంత్రిపై ఎఫ్‌ఐఆర్

- కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : 2020లో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో బిజెపి నేత, ప్రస్తుత ఢిల్లీ న్యాయ శాఖ మంత్రి కపిల్ మిశ్రాపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ కోర్టు మంగళవారం ఆదేశించింది. యమునా విహార్‌లో నివసిస్తున్న మహమ్మద్ ఇల్లియాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. అల్లర్లు జరిగిన ప్రాంతంలో చౌరాసియా ఉన్నారంటూ ప్రాసిక్యూషన్ కొన్ని ఆధారాలను కోర్టుకు సమర్పించింది. 53 మంది మరణానికి, 700 మందికి పైగా గాయపడడానికి దారితీసిన ఢిల్లీ అల్లర్లలో మిశ్రా, మరో ఆరుగురి పాత్రపై విచారణ జరపాలని కోరుతూ గత సంవత్సరం డిసెంబరులో ఇల్లియాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను గత నెలలో పోలీసులు వ్యతిరేకించారు. బిజెపి నేత పాత్రపై ఇప్పటికే విచారణ జరిపామని, ఆయన ప్రమేయమేమీ లేదని తేలిందని వారు కోర్టుకు తెలిపారు. కాగా ఇల్లియాస్ తన పిటిషన్‌లో మిశ్రాతో పాటు ముస్తాఫాబాద్ ఎమ్మెల్యే, ఉప సభాపతి మోహన్ సింగ్ బిష్త్, అప్పటి డిసిపి, దయాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఆ సమయంలో ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన అధికారిని కూడా చేర్చారు. 2020 ఫిబ్రవరి 23న కర్దామ్‌పురిలోని ఓ రోడ్డును మిశ్రాతో పాటు మరికొందరు దిగ్బంధించి, వీధి వ్యాపారుల సామాగ్రిని ధ్వంసం చేయడాన్ని తాను చూశానని ఆయనతెలిపారు. సీఏఏ వ్యతిరేక నిరసనకారులను మిశ్రా బెదిరిస్తుంటే మాజీ డీసీపీతో పాటు కొందరు అధికారులు ఆయనకు వత్తాసు పలికారని కోర్టు దృష్టికి తెచ్చారు. దయాల్‌పూర్ మాజీ ఎస్‌హెచ్‌ఓ, ఇతరులు కలిసి ఈశాన్య ఢిల్లీలోని పలు మసీదును ధ్వంసం చేశారని ఆయన తన పిటిషన్‌లో వివరించారు.

అల్లర్లకు పలువురు విద్యార్థి నేతలు కుట్ర పన్నారని ఆరోపిస్తూ పోలీసులు వారిని ఈ కేసులో ఇరికించారు. అయితే ఢిల్లీ మైనారిటీ కమిషన్ ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిషన్ మాత్రం అల్లర్లు ఓ పథకం ప్రకారం, ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగాయని తేల్చింది. ఇందుకు మిశ్రాయే బాధ్యుడని స్పష్టం చేసింది.

ప్రాంతీయ వాణిజ్యాన్ని పెంచుకుందాం

- చైనా, జపాన్, దక్షిణ కొరియా అంగీకారం
- ట్రంప్ సుంకాలకు ప్రతిగా నిర్ణయం

న్యూఢిల్లీ : అమెరికా విధించబోయే ప్రతీకార సుంకాలను గట్టిగా ప్రతిఘటిస్తున్న చైనా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు ఒక్కటయ్యాయి. ప్రాంతీయ వాణిజ్యాన్ని ఉమ్మడిగా పెంచుకునేందుకు అంగీకారానికి వచ్చాయి. ఐదు సంవత్సరాల విరామం అనంతరం ఈ మూడు దేశాల వాణిజ్య మంత్రులు తొలిసారిగా దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో గత నెల 30న ఆర్థిక చర్చలు జరిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ వాణిజ్యాన్ని ముందుకు తీసుకుపోయే దిశగా వారు ఓ నిర్ణయానికి వచ్చారు. సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలు అంతర్జాతీయంగా ఆందోళనలు రేపుతున్న తరుణంలో జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి యోజి ముటో, చైనా వాణిజ్య మంత్రి వాంగ్ వెంటావో, దక్షిణ కొరియా వాణిజ్య, పరిశ్రమల, ఇంధన శాఖ మంత్రి డక్‌జున్ సమావేశం కావడం గమనార్హం.

'అంతర్జాతీయ వాణిజ్య పరిస్థితులపై మూడు దేశాలు అభిప్రాయాలను పంచుకున్నాయి. ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉన్నదని గుర్తించాయి' అని దక్షిణ కొరియా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారరు. కాగా 'కీలక రంగాలలో సవాళ్లను అధిగమించి ఫలితాలు సాధించేందుకు త్రైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉన్నదని మేము గుర్తించాము' అని కొరియా ప్రభుత్వం వివరించింది. జపాన్, కొరియా దేశాలు చైనా నుండి సెమీకండక్టర్ ముడి సామగ్రిని దిగుమతి చేసుకోవాలని ఆశిస్తుండగా జపాన్, దక్షిణ కొరియా నుండి చిప్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని చైనా అనుకుంటోంది. స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన, అత్యున్నత నాణ్యతతో కూడిన, పరస్పర ప్రయోజనకరమైన ఎఫ్‌టీఏకు వాస్తవ రూపం ఇవ్వడానికి త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకునే దిశగా చర్చలను వేగవంతం చేయాలని మూడు దేశాలు అంగీకారానికి వచ్చాయని దక్షిణ కొరియా ఒక ప్రకటనలో వివరించింది. ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో (జిడిపి) ఈ మూడు ఆసియా దేశాలు నాలుగో వంతు వాటాను, ప్రపంచ వాణిజ్య విలువలో 21 శాతాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఈ దేశాల మధ్య వాణిజ్య, దౌత్య సంబంధాలు అంత సజావుగా లేవు.

ఓటర్ల జాబితా ఆధునీకరణపై 5 వేల సమావేశాలు

- ఇసి వెల్లడి

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాలను ఆధునీకరించడంతో సహా పెండింగ్‌లో వున్న అంశాలన్నింటిపై దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలతో కిందిస్థాయిలో దాదాపు 5 వేల సమావేశాలను నిర్వహించినట్లు భారత ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు ఇసి చేపట్టిన కార్యక్రమాల్లో ఇదే అతి పెద్దదని తెలిపింది. రాజకీయ పార్టీలకు చెందిన 28 వేల మంది ప్రతినిధులతో కమిషన్ సమావేశాలు నిర్వహించిందని, నకిలీ ఓటరు కార్డులు, ఓటర్ల జాబితాలో అవకతవకలు వంటి పలు ఆరోపణలు అనేక రాజకీయ పార్టీల నుండి వచ్చిన నేపథ్యంలో ఈ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపింది. ఓటర్ల నమోదు అధికారి (ఇఆర్ఓ), జిల్లా ఎన్నికల అధికారి (డిఇఓ), ముఖ్య ఎన్నికల అధికారి (సిఇఓ) స్థాయిల్లో ఈ సమావేశాలు జరిగాయని పేర్కొంది. మార్చి 31నాటికి 25రోజుల వ్యవధిలో మొత్తంగా 4,719 సమావేశాలు నిర్వహించగా.. వీటిల్లో సిఇఓలతో 40 సమావేశాలు, డిఇఓలతో 800, ఇఆర్ఓలతో 3,879 సమావేశాలు జరిగినట్లు పేర్కొంది. సిఇసి జ్ఞానేష్ కుమార్, ఇతర కమిషనర్లు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ఈ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఇసి తెలిపింది.

సంపద సృష్టించి పేదలకు పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేద కుటుంబాలను ఆదుకొని వారి అభ్యున్నతికి స్వచ్ఛందంగా ముందుకురావాలని కోరారు. పేద కుటుంబాలను ఆదుకునే వారు మార్గదర్శిగా, ఆదుకోబడిన వారు బంగారు కుటుంబంగా పరిగణించబడతారని చంద్రబాబు వివరించారు. అంబేద్కర్, అబ్దుల్ కలాం, ఎన్‌టిఆర్ సహా ఎవరూ పుట్టుకతోనే గొప్పవారు కాదని, వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని మహోన్నత వ్యక్తులుగా ఎదిగారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఇల్లు, పింఛను, ప్రతి ఇంటికీ తాగు నీటి కుళాయి, కరెంటు, మరుగుదొడ్లు, డ్రెయినేజ్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపి తేనేటి కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, పర్చూరు, చీరాల, బాపట్ల శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, మద్దులూరి మాలకొండయ్య, వేగేసిన నరేంద్ర వర్మ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజేష్‌బాబు, ఎస్‌పి తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై ఇండియా బ్లాక్ చర్చలో పాల్గొంటుందని అన్నారు.

బిజెపి, కాంగ్రెస్, టిడిపితో సహా ఇతర పార్టీలు విప్ జారీ

వక్ఫ్ సవరణ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అన్ని పార్టీలు తమ వ్యూహాలను, ఎత్తుగడలను నిర్ణయించుకుంటున్నాయి. ఇప్పటికే బిజెపి, కాంగ్రెస్, టిడిపితో సహా వివిధ పార్టీలు తమ సభ్యులకు విప్ జారీ చేశాయి. సభకు హాజరుకావాలని విప్‌లో పేర్కొన్నారు. 542 మంది లోక్‌సభ ఎంపిల్లో ఎన్‌డిఎకి 293 మంది ఎంపిలు ఉన్నారు. బిజెపి, టిడిపి, జెడియు, ఎల్‌జెపి, జనసేన వంటి పార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాయి.

పాఠాల్లో చదువుకున్న పాత్రలు, తెరపై కనిపిస్తే పిల్లలు ఎంతో ఆసక్తిగా చూస్తారు. అయితే ఆ పాఠాల్లో తెలుసుకున్నవి, ఎదురుగా స్క్రీన్‌పై కనిపిస్తున్నవి ఒకదానికొకటి పొంతన లేకుంటే, ఎక్కడలేని అయోమయానికి, గందరగోళానికి గురవుతారు. ఆ భావోద్వేగాలు అణచుకోలేక కళ్లముందు చూపిస్తున్నవే నిజమన్న భ్రమలో తీవ్ర ఒత్తిడికి లోనవుతారు. అలా ఈ మధ్యకాలంలో విడుదలైన 'ఛావా' చిత్రం విద్యార్థులను ఎంతలా ప్రభావితం చేసిందో కొంతమంది టీచర్లు తమ అనుభవాలను ఇలా చెబుతున్నారు. తరగతి గది 'చరిత్ర', తెరపై 'చరిత్ర' ఒక్కటిగా లేదని వారంతా ఆవేదన చెందుతున్నారు. ముంబయి, ఢిల్లీ, బెంగుళూరు, కలకత్తా నగరాల్లో వివిధ పాఠశాలల్లో బోధించే టీచర్లకు ఎదురైన అనుభవాలు ఇవి..

JEEVANA జీవన the family

నాలుగో బెంచి

ఒక ఊర్లో ఓ బడి ఉంది. ఆ బడిలో తొమ్మిదో తరగతిలో తక్కువ మంది విద్యార్థులు ఉన్నారు. ఆ క్లాసులో నాలుగు బెంచీలు మాత్రమే ఉన్నాయి. ఒకటో బెంచీలో బాగా చదివే పిల్లలు కూర్చునేవారు. రెండో బెంచిలో మామూలుగా చదివే పిల్లలు కూర్చునేవారు. మూడవ బెంచిలో కాస్త అల్లరి చేసే పిల్లలు, చదువులో వెనుకబడిన పిల్లలు కూర్చునేవారు. నాల్గవ బెంచిలో మాత్రం ఎవరూ కూర్చోవడం లేదు. ఆ బెంచి చాలా బాధపడింది. ఏడ్చింది. 'నా బెంచిలో ఒక్కరైనా కూర్చోవడం లేదు. ఎందుకు నాపై అంత కోపం' అని మిగతా బెంచీలని అడిగింది. 'మాకేం తెలుసు. అసలు నువ్వు మా పక్కకి రాకు' అని ఈసడించుకున్నాయి మిగతా బెంచీలు. నాలుగవ బెంచి బాధపడుకుంటూ ప్రిన్సిపాల్ రూముకెళ్లింది. ప్రిన్సిపాల్‌తో 'సార్! నాపై ఒక్కరు కూడా కూర్చోవడం లేదు. నాకు చాలా బాధగా ఉంది. ఎలాగైనా పిల్లలు నాపై కూర్చునేలా చేయండి సార్' అని వేడుకుంది.

ప్రిన్సిపాల్ సార్ బెంచీతో కలిసి క్లాసురూమ్‌కి వెళ్లారు. అక్కడి పిల్లలను ఉద్దేశించి 'నాలుగో బెంచీలో ఎవరూ ఎందుకు కూర్చొవడం లేదు' అని అడిగారు. అప్పుడు మాస్టారుకి అసలు విషయం అర్థమైంది. పిల్లలను బాగా చదివేవారు, చదవని వారుగా విడదీసి కూర్చొబెట్టారని తెలుసుకుంటారు. 'పిల్లలూ మీ అందరూ ఒకే క్లాసు చదువుతున్నారు. పాఠాలు బాగా అర్థమయ్యేవారు, అర్థం కాని వారిగా విడిపోయి కూర్చొంటే మీరు ఎప్పటికీ ఇలాగే ఉంటారు. అలాకాక, అర్థమైన వారు, సరిగ్గా అర్థం చేసుకోని విద్యార్థిని పక్కన కూర్చోబెట్టుకోండి. అప్పుడు రెండో విద్యార్థి కూడా మీతో పోటీపడి చదువుతారు. మీకు కూడా ఇంతకుముందు కంటే పాఠాలు బాగా అర్థమవుతాయి. చదువును బట్టి మీరు విడిపోవడం ఇష్టం లేకే ఈ బెంచీ నా దగ్గరికి వచ్చింది. ఇది బాధపడడం వెనుక అసలు కారణం తెలిసి నేను చాలా ఆశ్చర్యపోయాను. ఇక నుండి మీరంతా కలిసి చదువుకోండి. కలిసి ఆడుకోండి' అని చెప్పి వెళ్లారు. ఆ రోజు నుండి తరగతిగదిలో నాలుగు బెంచీలపై పిల్లలు కూర్చొని పాఠాలు చదువుకున్నారు.

- మెడుదుల స్నేహ,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
బక్రిచెప్యాల. సిద్ధిపేట జిల్లా.
97048 65816.



అవి ఏవీ?

చిన్నారులూ, ఇక్కడ రెండు వరుసల్లో కప్పలు ఉన్నాయి. వీటిలో రెండు కప్పలు ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.

జవాబు: 1-4

నేను గీసిన బొమ్మ

ఎస్.కె.అఫ్రిన్,
2వ తరగతి,
మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాల,
చిల్లకల్లు మెయిన్
జగ్గయ్యపేట మండలం,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'చరిత్ర' వక్రీకరణ.. విద్యార్థుల్లో అయోమయం...



చారిత్రాత్మకంగా తప్పుడు కథనాలను సినిమాల్లో చూపిస్తున్నారని, వాటి వల్ల విద్యార్థులు ప్రతికూల ప్రభావాన్ని లోనవుతున్నారని చరిత్ర పాఠాలు బోధిస్తున్న ఈ టీచర్లు అంటున్నారు.

ఔరంగజేబును మొదటిసారి చూశాను..

ఢిల్లీ ఉన్నత పాఠశాల్లో చరిత్ర బోధిస్తున్న, పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఉపాధ్యాయురాలు తన అనుభవాన్ని ఇలా చెప్పారు. 'రెండు దశాబ్దాలుగా నేను చరిత్ర బోధిస్తున్నాను. ఈ కాలంలో క్లాసు రూంలో చరిత్ర పాఠాలకంటే సైన్సు పాఠాలు, లెక్కల వైపు విద్యార్థులు ఎక్కువగా మొగ్గ చూపారు. క్రమంగా చరిత్ర సబ్జెక్టును 'చెత్త'గా అభివర్ణించే పిల్లలు కూడా ఉన్నారు. అయితే ఇటీవల బాలీవుడ్‌లో 'ఛావా' చిత్రం విడుదలయ్యాక నా తరగతి గది పిల్లల్లో ఓ మార్పు గమనించాను. ఒక విద్యార్థిని నా దగ్గరికి వచ్చి, 'మొట్టమొదటిసారి ఔరంగజేబును ప్రత్యక్షంగా చూశాను. మొఘలుల కాలంలో మన దేశంలో ఇలాగే ఉందా మిస్' అని నన్ను అడిగింది. ఆ క్షణంలో నాకు సినిమాలో చూపించిన కథ కళ్లముందు కదలాడింది. మరాఠా రెండో రాజు శంబాజీ కథతో 17వ శతాబ్దం నాటి భారతదేశ పరిస్థితులు, మొఘలులకు వ్యతిరేకంగా శంబాజీ పోరాటం ఆ చిత్రంలో చూపించారు. మొఘల్‌రాజు ఔరంగజేబు క్రూరత్వం, శంబాజీని తీవ్ర హింసలు పెట్టడం తెరపై చాలా భయంకరంగా చిత్రీకరించారు. అందుకు ప్రతిఫలంగా నాగ్‌పూర్‌లో జరిగిన అల్లర్లు మన కళ్లముందే ఉన్నాయి. ఆ విద్యార్థిని అడిగిన ప్రశ్నలో ఔరంగజేబు క్రూరత్వం వాళ్లని ఎంతగా ప్రభావితం చేసిందో అర్థమైంది. ఆ భావన మొత్తం మొఘల్ సామ్రాజ్యాన్ని క్రూరత్వం కలదిగా చేసింది. పిల్లల్లో ఆ భావన పోగొట్టాలని, నేను తనకి అక్బర్ గురించి చెప్పాను. మొఘల్ మొదటి చక్రవర్తి అయిన అక్బర్ తీర్థయాత్రలు చేసే హిందూ యాత్రికులపై పన్నును రద్దు చేసిన విధానాన్ని వివరించాను. ఒక్క రాజును చూసి, మొత్తం సామ్రాజ్యాన్నే తప్పుగా అర్థం చేసుకోవద్దని చెప్పాను. అయితే ఆ తరువాతి రోజే మా స్కూల్లో 9వ తరగతి చదివే విద్యార్థులు పాఠశాల కారిడార్‌లో 'జై భవాని, జై శ్రీరామ్' నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. అది చూసి నేను చాలా షాక్ అయ్యాను. ఈ చిన్న వయసు పిల్లల్లో ఆ సినిమా ఎంత తీవ్ర ప్రభావం చూపించిందో చూసి బాధపడ్డాను' అంటూ ఆమె వివరించారు.

ఇది ఆ ఒక్క టీచరు బాధే కాదు.. చరిత్ర బోధిస్తున్న ఎందరో ఉపాధ్యాయులది. చాలామంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'చారిత్రాత్మకంగా తప్పుడు కథనాలను చూపించే సినిమాలు పిల్లలపై చెడు ప్రభావాన్ని చూపిస్తుంటే తాము నిస్సహాయులుగా ఉండిపోతున్నామ'ని వారు బాధపడుతున్నారు.

మధ్యయుగం రాజుల చరిత్రను బోధిస్తాం..

'ఈ విధమైన సినిమాల వల్ల పిల్లలు భారతదేశ చరిత్రని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ఇక నుండి పిల్లల పాఠ్య పుస్తకాల్లో ఈ రకమైన చరిత్ర పాఠాలు నేర్పించే అవకాశం కూడా ఉంది. మన దేశంలో చాలా పాఠశాల్లో ముఖ్యంగా 10 నుండి 14 ఏళ్ల వయసు పిల్లలు మధ్యయుగ భారతదేశ చరిత్రను పాఠాల రూపంలో తెలుసుకుంటున్నారు. ఆ కాలంలో ముస్లిం రాజులు మన దేశాన్ని పాలించారు. ఇప్పుడు బాలీవుడ్‌లో నాటి కథనాలతో సినిమాలు రూపొందిస్తున్నారు. సాధారణంగానే ప్రజల్లో అప్పుడు అంటే ముస్లిం పాలనలో హిందువులు ఎలా ఉన్నారు? అనే ఉత్సుకత ఉంటుంది. ఆ ఆసక్తితోనే థియేటర్లకు వెళ్తారు. అయితే సినిమాల్లో చూపించేదంతా నిజం కాదని చాలామందికి అర్థమవుతుంది. కానీ పదేళ్ల పిల్లలకు ఏది నిజం? ఏది అబద్ధం? ఎవరు చెబుతారు. సినిమా చూస్తున్న వాళ్ల మనసుల్లో ముస్లిం రాజులు, హిందూ రాజులను, ప్రజలను హింస పెట్టినట్లు ముద్రపడిపోతుంది. అది తప్పని, మధ్యయుగం నాటి భారతదేశ చరిత్ర ఇదని చెప్పే వెసులుబాటు టీచర్లకి ఉండదు. అది చెప్పే సమయానికి మధ్య యుగం దాటి ఆధునిక చరిత్రని బోధించాల్సి వస్తోంది. దీంతో పిల్లల్లో ముద్రపడిన భావాలు చెరిపేయలేకపోతున్నాం' అని ఆ టీచర్లు ముక్తకంఠంతో బాధపడుతున్నారు.

వాస్తవాలు చెప్పే వెసులుబాటు లేదు

ముంబయి సాక్రెడ్ హార్ట్ స్కూల్ చరిత్ర ఉపాధ్యాయురాలు క్రిస్టిల్ అన్‌వాజ్ తనకెదురైన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. 'చరిత్రని వక్రీకరిస్తున్న సినిమాలు పిల్లల్లో ఎన్నో సమాధానాలు లేని ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వాటికి సమాధానాలు ఎవరు చెబుతారు? దేశంలో ప్రస్తుతం విద్యాబోధన అంటే మార్కులు, ర్యాంకులు అన్న చందంగా మారిపోయింది. ఉదాహరణకి పదో తరగతి విద్యార్థినే తీసుకుందాం. తను ఫోకస్ అంతా పరీక్షలపైనే పెడతాడు. తనకి చరిత్రలో అసలు ఏం జరిగిందో చెప్పేటంత తీరిక మాకు లేదు. అసలు వినిపించుకునే స్థితి కూడా విద్యార్థులకు ఉండడం లేదు' అని ఆమె దిగులుపడుతున్నారు.

ముంబయికి చెందిన మరో చరిత్ర ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో చాలా మంది పిల్లలు అయోధ్య గురించి క్లాసు రూంలో ప్రశ్నలు అడుగుతున్నారు. అయితే వాటికి సమాధానాలు చెప్పకుండా దాటవేస్తున్నాం. ఎందుకంటే ప్రస్తుతం వారు చూస్తున్న అయోధ్య చరిత్రకి, పాఠాల్లో మేం బోధించే వాస్తవ అయోధ్య చరిత్రకి చాలా వ్యత్యాసం ఉంది. ఆ తేడాని తీసుకొచ్చింది సినిమాలే' అంటున్నారు.

సోషల్ మీడియాలో కూడా చరిత్రని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. 'ఆర్టికల్ 370', 'పద్మావత్' చిత్రాలపై సోషల్ మీడియాలో జరిగిన చర్చలు విద్యార్థులను తప్పుదోవ పట్టించాయి' అంటున్నారు ఢిల్లీ బ్లుబెల్స్ ఇంటర్నేషనల్ స్కూల్ చరిత్ర ఉపాధ్యాయురాలు సంయుక్త నైనన్. '14వ శతాబ్దపు ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీని 'పద్మావత్' చిత్రంలో చాలా క్రూరంగా చూపించారు. ఆ పాత్ర పిల్లల మనసులను విపరీతంగా ప్రభావితం చేసింది. అందులో నిజానిజాలు తెలుసుకోలేని పిల్లలు ఒక వర్గంపై విపరీతమైన ద్వేషం పెంచుకుంటున్నారు. స్క్రీన్ మీద చూపించేది నిజం కాదని చెప్పడం మాలాంటి టీచర్లకు సవాల్ విసురుతోంది' అని ఆమె అంటున్నారు.

పిల్లల్లో ఉత్సుకతను రేకెత్తించడానికి, మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి సినిమా ఒక శక్తివంతమైన మార్గం అని చాలామంది ఉపాధ్యాయులు భావిస్తున్నారు. 1857 తిరుగుబాటు గురించి, సెల్యులాయిడ్ శక్తిని గురించి తన విద్యార్థులకు బోధించేందుకు కోల్‌కత్తా లా మార్టినియర్ ఫర్ బాయ్స్ స్కూల్ చరిత్ర టీచర్ కొన్ని సంవత్సరాలుగా సత్యజిత్ రే 'సత్రంజ్ కే ఖిలారి', శ్యామ్ బెనగల్ 'జునూన్' చిత్రాలను చూడమని విద్యార్థులను సిఫార్సు చేసినట్లు చెప్పారు.

చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నారు

'ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు విద్యార్థులకు గత చరిత్రను దెయ్యంగా చూపిస్తున్నాయి' అని ఈ ఉపాధ్యాయులు అంటున్నారు. 'గత విద్యార్థులు చరిత్ర పట్ల సానుకూల దృక్పథంతో ఉండేవారు. ఇప్పుడు అలా కాదు. ఈ తరం విద్యార్థులు గతంలో జరిగినదంతా తప్పు అని వాదిస్తున్నారు. నాకు ఆ అనుభవం చాలాసార్లు ఎదురైంది' అంటున్నారు నైనన్ టీచర్.

సినిమాల్లో చూపించేదంతా కల్పితకథని, అదొక ఫిక్షన్ కథని విద్యార్థులకు చెప్పాలనుకున్నా చాలామంది టీచర్లకు ఆ అవకాశం ఉండదు' అంటున్నారు బెంగుళూరు కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ బోర్డు స్కూల్ టీచర్ భావనా జైన్. తనకెదురైన ఓ అనుభవాన్ని ఆమె ఇలా చెప్పారు.

'2023లో సెంట్రల్ బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్ ఆదేశాల ప్రకారం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ వాళ్లు 12వ తరగతి పాఠ్యపుస్తకాల్లో విభజన సమయం నాటి చరిత్ర చెప్పే ఒక చాప్టర్‌ని తొలగించాలని నిర్ణయించారు. అయితే ఆ సమయంలో కులం, మతం అని చూడకుండా ఎక్కడ చూసినా లైంగిక హింస చెలరేగింది. పిల్లలకు ఆ వాస్తవాలు తెలియకుండా దాచేయాలని వారి ఉద్దేశం. అయితే నేను విభజన నాటి వాస్తవ వీడియోలని పిల్లలకు చూపించి ఆ పాఠాన్ని చెప్పాను. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. చాలామంది పెద్దలు నన్ను వ్యతిరేకించారు'.

'చరిత్రని చూపించే సినిమాల్లో ఫ్యాషన్ దుస్తులు, సెట్లకు ఇచ్చే ప్రాధాన్యత వాస్తవాలను చూపించడంలో ఉండడం లేదు. కల్పిత కథలే చరిత్ర అని నమ్మించడం ఎంతమాత్రం సమంజసం కాదు. ఈ ధోరణి పెరిగిపోవడం వల్ల పిల్లల్లో మానవత్వ లక్షణాలు అడుగంటుతున్నాయి. కొంతమందిపై అసహ్యం పెరిగిపోతుంది. పనికిరాని చెత్త మాట్లాడుకుంటూ, పిచ్చి పిచ్చి జోక్సు వేసుకునే గుంపులు ఇప్పుడు చాలా పాఠశాలల్లో తయారవుతున్నారు' అంటున్న ఈ టీచర్ల అనుభవాలు అందరివీ.. ఆలోచించాల్సినవీ..

మహాసభకు సిద్ధమైన హాలు

సిపిఎం మహాసభకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మదురైలో పార్టీ 24వ అఖిల భారత మహాసభ
- సౌహార్ద సందేశాలివ్వనున్న వామపక్ష అగ్ర నేతలు
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రకాశ్ కరత్, బివి రాఘవులు, బృందాకరత్ తదితరులు
- కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర ప్రదర్శన, బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సీతారాంఏచూరి నగర్ (మదురై) నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రాబోయే మూడేళ్ల కాలానికి దేశానికి దిశా, నిర్దేశం చేయనున్న సిపిఎం అఖిల భారత మహాసభలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ మహాసభలకు తమిళనాడులోని మదురై నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. మహాసభల్లో పాల్గొనేందుకు వీలుగా ఇప్పటికే పార్టీ అగ్ర నాయకత్వం మదురైకి చేరుకుంది. సిపిఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్, పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, బృందాకరత్‌తోపాటు తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, స్థానిక ఎంపీ వెంకటేశన్ తదితరులు మంగళవారం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

మహాసభల వేదికైన కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (మదురై కన్వెన్షన్ సెంటర్)లోని కామ్రేడ్ కొడియెరి బాలకృష్ణన్ హాల్‌తో పాటు ఆహ్వాన సంఘం, వైద్య శిబిరం, కేంద్ర కమిటీ మీటింగ్ హాల్, మీడియా సెంటర్, అమర వీరుల స్థూపం, పుస్తక ప్రదర్శన, కమ్యూనిస్టు పార్టీ చరిత్రను తెలిపే ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక తదితర విభాగాలను వారు కలియదిరిగి నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లకు తగిన సూచనలు, సలహాలనిచ్చారు.

ఇక్కడి తముక్కమ్ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను తెలిపే ప్రదర్శనను సీనియర్ పాత్రికేయులు ఎన్.రామ్, పుస్తక ప్రదర్శనను సిపిఎం సీనియర్ నేత వి.పరమేశ్వరన్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్... కార్పొరేట్ శక్తులపైనా, మతోన్మాదం పైనా పోరాడాలని పిలుపునిచ్చారు.

ద్వారానికి బుద్ధదేవ్ పేరు.. ఆడిటోరియానికి కొడియేరి హాల్ గా నామకరణం...

అరుణ పతాకాన్ని ఆవిష్కరించనున్న బిమన్ బసు

మదురై నగరం అడుగడుగునా సిపిఎం అగ్రనేతలను స్మరించుకుంటోంది. ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌కు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేరు పెట్టగా.. ద్వారానికి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య పేరు పెట్టారు. ఆడిటోరియానికి పార్టీ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు కొడియేరి బాలక్రిష్ణన్ హాల్‌గా నామకరణం చేశారు. మహాసభలో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం వెణ్మణి అమరవీరుల స్మారక పతాకాన్ని కేంద్ర కమిటీ సభ్యులు యు.వాసుకి స్వీకరించి, పార్టీ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ ఎకె. పద్మనాభన్‌కు అందజేస్తారు. ఆ తరువాత మహాసభ ప్రారంభ సూచికగా సీనియర్ నేత బిమన్‌బసు అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఉదయం 10 గంటలకు పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అధ్యక్షతన ప్రారంభ సభ ఆరంభమవుతుంది. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు కె.బాలకృష్ణన్ స్వాగతోపన్యాసం చేస్తారు. పార్టీ పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ప్రారంభోపన్యాసం చేస్తారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ సౌహార్ద సందేశాలను ఇస్తారు. మదురై ఎంపీ వెంకటేశన్ ధన్యవాదాల తీర్మానంతో ప్రారంభ సభ ముగియనుంది.

కేరళ సిఎం విజయన్‌కు ఆహ్వానం పలుకుతున్న ఎంపీ వెంకటేశన్, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను తెలిపే ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎన్.రామ్, చిత్రంలో బృందాకరత్ తదితరులు

పంజాబ్ బౌలర్లు భల్లే.. భల్లే..

- అర్ష్‌దీప్‌కు మూడు వికెట్లు
- ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్ అర్ధసెంచరీలు
- లక్నో సూపర్‌జెయింట్స్‌పై గెలుపు

లక్నో: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18లో పంజాబ్ కింగ్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించింది. తొలి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్‌పై 11 పరుగుల తేడాతో నెగ్గిన పంజాబ్ జట్టు.. మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం పంజాబ్ కింగ్స్ 16.2 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి 177పరుగులు చేసి సునాయాసంగా విజయం సాధించింది. ప్రభ్‌సిమ్రన్(69), కెప్టెన్ శ్రేయస్(52నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించి పంజాబ్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. లక్నో బౌలర్లలో దిగ్వేష్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు పంజాబ్ బౌలర్లు రాణించి లక్నోను కట్టడి చేశారు. దీంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 7వికెట్ల నష్టానికి 171పరుగులకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ మిఛెల్ మార్ష్(0) డకౌటయ్యాడు. దీంతో లక్నో జట్టు ఒక్క పరుగు వద్ద తొలి వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ మార్క్రమ్(28) రాణించగా.. కెప్టెన్ పంత్(2) మరోసారి నిరాశపరిచాడు. దీంతో లక్నో జట్టు 35పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో పూరన్(44), బడోనీ(41) కలిసి 4వ వికెట్‌కు 55పరుగులు జతచేశారు. ధాటిగా ఆడే క్రమంలో వీరిద్దరూ ఔటవ్వగా.. చివర్లో డేవిడ్ మిల్లర్(19), అబ్దుల్ సమద్(27) త్వరగా పెవీలియన్‌కు చేరడంతో లక్నోజట్టు భారీ స్కోర్‌పై ఆశలు వదులుకుంది. పంజాబ్ కింగ్స్ బౌలర్లు అర్ష్‌దీప్‌కు మూడు, ఫెర్గుసన్, మ్యాక్స్‌వెల్, జాన్సెన్, చాహల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
బెంగళూరు	2	2	0	4	+2.26
పంజాబ్	2	2	0	4	+1.48
ఢిల్లీ	2	2	0	4	+1.32
గుజరాత్	2	1	1	2	+0.62
ముంబయి	3	1	2	2	+0.30
లక్నో	3	1	2	2	+0.15
చెన్నై	3	1	2	2	-0.77
సన్‌రైజర్స్	3	1	2	2	-0.87
రాజస్తాన్	3	1	2	2	-1.11
కోల్‌కతా	3	1	2	2	-1.42

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

లక్నో ఇన్నింగ్స్: మార్క్రమ్ (బి)ఫెర్గుసన్ 28, మార్ష్ (సి)జాన్సెన్ (బి)అర్ష్‌దీప్ 0, పూరన్ (సి)మ్యాక్స్‌వెల్ (బి)చాహల్ 44, పంత్ (సి)చాహల్ (బి)మ్యాక్స్‌వెల్ 2, బడోని (సి)మ్యాక్స్‌వెల్ (బి)అర్ష్‌దీప్ 41, డేవిడ్ మిల్లర్ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి)జాన్సెన్ 19, అబ్దుల్ సమద్ (సి)ప్రియాన్ష ఆర్యా (బి)అర్ష్‌దీప్ 27, శార్దూల్ ఠాకూర్ (నాటౌట్) 1, ఆవేశ్ ఖాన్ (నాటౌట్) 0, అదనం 7. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 171పరుగులు. **వికెట్ల పతనం:** 1/1, 2/32, 3/35, 4/89, 5/119, 6/166, 7/167 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-43-2, ఫెర్గుసన్ 3-0-26-1, మ్యాక్స్‌వెల్ 3-0-22-1, జాన్సెన్ 4-0-28-1, స్టొయినీస్ 2-0-15-0, చాహల్ 4-0-36-1.

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాన్ష ఆర్యా (సి)శార్దూల్ (బి)దిగ్వేష్ రాథి 8, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)రవి బిష్ణోయ్ (బి)దిగ్వేష్ రాథి 69, శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 52, నేహాల్ వాధేరా (నాటౌట్) 43, అదనం 5. (16.2 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 177పరుగులు. **వికెట్ల పతనం:** 1/26, 2/110 **బౌలింగ్:** శార్దూల్ 3-0-39-0, ఆవేశ్ ఖాన్ 3-0-30-0, దిగ్వేశ్ రాథి 4-0-30-2, రవి బిషోయ్ 3-0-43-0, సిద్ధార్థ 3-0-28-0, అబ్దుల్ సమద్ 0.2-0-6-0.

ఐపిఎల్‌లో నేడు

బెంగళూరు × గుజరాత్
వేదిక: బెంగళూరు; రాత్రి 7.30గం॥లకు

అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లకు వందన గుడ్‌బై

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ పోటీలకు వందన కటారియా గుడ్‌బై చెప్పింది. మంగళవారం ట్విటర్ (ఎక్స్)లో 32ఏళ్ల వందన ఈ విషయాన్ని వెల్లడించింది. '15ఏళ్లపాటు అంతర్జాతీయ హాకీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించేందుకు సహకరించిన కోచ్‌లు, సహాయ సిబ్బందితోపాటు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరిగా ధన్యవాదాలు తెలిపింది. తాను మరిన్ని మ్యాచ్‌లు ఆడాలని ఉన్నా.. భారతజట్టు మరింత మెరుగైన దశలో ఉండాలని ఆశిస్తున్నందునే వైదొ లుగుతున్నట్లు' వెల్లడించింది. భారత్ తరఫున 329 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన వందన.. 158 గోల్స్ కొట్టింది. 15ఏళ్ల పాటు అంతర్జాతీయ మ్యాచ్‌లకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన వందన.. అత్యధిక హాకీ మ్యాచ్‌లు ఆడిన భారత తొలి మహిళా హాకీ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించింది.

క్రికెట్ ఆస్ట్రేలియా కాంట్రాక్ట్ జాబితాలో మార్ష్‌కు చోటు

సిడ్నీ: 2025-26 ఏడాదికి క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) ఆటగాళ్ల జాబితాను ప్రకటించింది. ఆల్‌రౌండర్ మిఛెల్ మార్ష్ సిఎ మంగళవారం ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. భారత్‌తో టెస్ట్ సిరీస్‌లో భాగంగా నాల్గో టెస్ట్‌లో గాయపడ్డ మార్ష్.. ఆ తర్వాత శ్రీలంకతో వైట్‌బాల్ సిరీస్‌కు చోటు దక్కించుకోలేదు. ఈ క్రమంలో అతనికి సిఎ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు దక్కడం కష్టమే అనుకున్నా.. అతనిపై ఆ దేశ క్రికెట్‌బోర్డు నమ్మకం ఉంచింది. మార్ష్ గత 10 టెస్టుల్లో 47.07సగటుతో రాణించాడు. ఇక గాయపడ్డ కెమెరాన్ గ్రీన్ సిఎ 2025-26కు సెంట్రల్ కాంట్రాక్ట్‌లో చోటు దక్కించుకోలేకపోయాడు.

సిఎ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా: బార్ట్‌లెట్, బోలండ్, క్యారీ, కమిన్స్, ఎల్లిస్, గ్రీన్, హేజిల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, ఖవాజా, కోన్‌స్టస్, కుహెన్మన్, లబూషేన్, లియాన్, మార్ష్, మ్యాక్స్‌వెల్, మొర్రీస్, రిచర్డ్సన్, షార్ట్, స్మిత్, స్టార్క్, వెబ్‌స్టర్, జంపా.

2027 వన్డే ప్రపంచకప్ ఆడతా

- రిటైర్మెంట్‌పై కోహ్లి స్పందన



బెంగళూరు: టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లి తన రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు చెక్ పెట్టాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకూ ఆడతానని తెలిపాడు. ఐపిఎల్-2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతనిధ్యం వహిస్తున్న విరాట్ కోహ్లి.. భవిష్యత్తు ప్రణాళికలకపై క్లారిటీ ఇచ్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత మీ ముందు ఉన్న అతి పెద్ద లక్ష్యమేంటి అన్న ప్రశ్నకు బదులిస్తూ.. "నా నెక్ట్స్ బిగ్ స్టెప్ 2027 వరల్డ్ కప్ గెలిచేందుకు ప్రయత్నిస్తా" అని సమాధానం ఇచ్చాడు. దీంతో 2027 వన్డే ప్రపంచకప్‌లో వరకూ ఆడతాడని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోతున్నారు. టి20 ప్రపంచకప్-2024 టీమిండియా గెలిచిన తర్వాత అంతర్జాతీయ టి20లకు కోహ్లి వీడ్కోలు పలికాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68